
ANDHRAJYOTHY

# ఆంధ్రజ్యోతి

5

శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
గురువారం 13 మార్చి 2025



సామాజిక అవసరాలు, సిద్ధాంతాల ప్రమేయం లేకుండా వ్యక్తిగత ప్రయోజనాల కోసం ప్రేరేపితమై సానుభూతి పునాదుల మీద ఆవిర్భవించిన పార్టీ వైసీపీ. చేసిన మేలు మరవడం, సామాన్య ప్రజలు కృతజ్ఞత పూర్వకంగా ఇచ్చిన అధికారాన్ని ఐదేళ్ల కాలానికే పరిసమాప్తం చేసుకున్న బలహీన పార్టీగా మిగిలిపోయినది వైసీపీ. బుధవారం ఆ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని శ్రేణులు జరుపుకున్న తీరుకు, సరిగ్గా ఏడాది కిత్రం జరుపుకున్న తీరుకు ఎంతో తేడా కనిపించింది. 2011, మార్చి 12వ తేదీన ఆవిర్భవించిన వైసీపీ గడచిన 13 సంవత్సరాల్లో ఏదో ఒక ఆశతో, లక్ష్యంతో ఆవిర్భావ దినోత్సవాలను జరుపుకుంది. ఎనిమిదేళ్లపాటు జగన్‌ను సీఎం చేయడమే లక్ష్యంగా ఆ పార్టీ శ్రేణులు కృషి చేశాయి. ఆ తరువాత ఐదేళ్ల కాలం అధికార దర్పంతో ఆవిర్భావ దినోత్సవాలను జరుపుకుంది. ఈ సంవత్సరం మాత్రం అందుకు భిన్నంగా ఎలాంటి లక్ష్యం లేకుండా, భవిష్యత్తు మీద ఆశ లేకుండా నిస్సారంగా, నిరుత్సాహంగా జరుపుకున్నాయి.

## నిరుత్సాహం..
# నిరాశావాదం!

### వైసీపీలో కనిపించని నాటి ఉత్సాహం
### 14వ ఆవిర్భావ దినోత్సవంలో కానరాని కేడర్

నెల్లూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : అసలు ఎన్నికల ఫలితాలతోనే ఆ పార్టీ క్షీణ దశకు చేరుకుంది. ఎన్నికలకు ముందే ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 30 శాతం మంది వైసీపీ ఎమ్మెల్యేలు జగన్ నాయకత్వంపై తిరుగుబాటు చేసి తెలుగుదేశం జెండా పట్టుకున్నారు. వీరివెంట వేలాది మంది వైసీపీ ముఖ్య కార్యకర్తలు పార్టీ ఫిరాయించారు. ఎన్నికల ఫలితాల తరువాత ఈ వలసలు మరింత పుంజుకున్నాయి. వైసీపీకి చెందిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో టీడీపీలో చేరిపోయారు. ఒక్కమాటలో చెప్పాలంటే వైసీపీ తిరిగి ప్రాణం పోసుకోవాలంటే కొత్తగా మళ్లీ పార్టీ నిర్మాణం చేసుకోవాల్సిన అవసరం కనిపిస్తోంది. ఈ ఏడాది పార్టీ ఆవిర్భావ దినోత్సవం జరిగిన తీరే ఇందుకు నిదర్శనం. చాలా మంది నాయకులు ఈ కార్యక్రమాల్లో పాల్గొనలేదు. మెజారిటీ గ్రామాల్లో అసలు వైసీపీ జెండానే ఎగరలేదు.

● నాయకుల్లోనూ నీరసం

ఐదేళ్లపాటు రాజరికం తరహా అధికారాన్ని అనుభవించిన ఎమ్మెల్యేలు, వారి ముఖ్య అనుచరులు ప్రస్తుతం జన బాహుళ్యంలో కనిపించడం లేదు. అంతా అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. నాయకులు ఇంతలా డీలా పడిపోవడానికి ఒక విధంగా ఎన్నికల్లో వీరికి ఎదురైన ఘోర పరాజయం ఒక కారణం అయితే, ఆ కారణానికి వీరి ఐదేళ్ల ప్రవర్తన మరో కారణం. ఒక్క చాన్స్ ఇచ్చి చూద్దాం అని దయచూపిన ప్రజలపై వీరు దండయాత్ర చేశారు. గంపెడు మట్టి కావాలన్నా నేతల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడే విధంగా పాలన సాగించారు. రాజకీయ కక్షలకు పాల్పడ్డారు. రాజకీయ కారణాలతో సామాన్యుల మీద తప్పుడు కేసులు పెట్టించారు. ప్రజలందరూ చూస్తుండగా బహిరంగంగా అవినీతి, అక్రమార్జనకు పూనుకున్నారు. ఐదేళ్లపాటు ప్రజలు తెలియని అభద్రతాభావంతో బతికేలా చేశారు. ఈ ప్రభావం ఎన్నికల ఫలితాలపై కనిపించింది. నెత్తిన పెట్టుకున్న ప్రజలే వీరిని చిత్తు చిత్తుగా ఓడించారు. భవిష్యత్తులో కూడా వీరికి క్షమాభిక్ష పెట్టాలంటే ప్రజలు ఆలోచించుకునే పరిస్థితి తీసుకొచ్చారు. ప్రజల్లో వ్యక్తమైన తీవ్ర వ్యతిరేకత కారణంగా వీరు జనం మధ్యకు రావడమే మానేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడి హోదాలో కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాత్రం జనంలో కనిపిస్తున్నారు. అయితే, ఈయన ఎక్కువగా సర్వేపల్లి రాజకీయాలకే పరిమితం అవుతున్నారనే వాదన వినిపిస్తోంది. ఇక మాజీ ఎమ్మెల్యేలు అందరూ జనానికి దూరంగానే ఉన్నారనే చెప్పాలి. సుదీర్ఘ కాలం రాజకీయాల్లో కొనసాగి, ఒకటి రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా పనిచేసిన నాయకులు సైతం జనం మధ్యకు రావడానికి మొహమాట పడుతున్నారంటే పార్టీ పరిస్థితి ఎలా ఉందో ఊహించుకోవచ్చు. 14ఏళ్ల వైసీపీ ఆవిర్భావంలో ఎప్పుడూ కనిపించనంత నిరుత్సాహం, నిరాశావాదం ఈ ఏడాది కనిపించడం చెప్పుకోదగ్గ రాజకీయ విశేషం.



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ, ఎమ్మెల్సీలు మాజీ ఎమ్మెల్యేలు, ఇతర నాయకులు

## ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

నెల్లూరు(వెంకటేశ్వరపురం, ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్ మెంట్ ఇవ్వకుండా కూటమి ప్రభుత్వం విద్యార్థులను రోడ్డుమీదకు లాగేసిందని, రీయింబర్స్ మెంట్ విడుదల చేసేంత వరకు పోరాడుతామని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చెప్పారు. వైసీపీ ఆధ్వర్యంలో బుధవారం నెల్లూరులో యువత పోరు కార్యక్రమం నిర్వహించారు. వీఆర్‌సీ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ ఆనంద్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ప్రసన్నకుమార్‌రెడ్డి, వివిధ నియోజకవర్గాల ఇన్‌చార్జులు, నాయకులు పాల్గొన్నారు. కాగా, వైసీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నెల్లూరులోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి జెండాఎగురవేసి, కేక్ కట్ చేశారు. ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, నాయకులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, ఆనం విజయ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. పార్టీ నగర కార్యాలయంలో ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆవిర్భావ దినోత్సవం జరిగింది.

## రంజాన్ వేళలు

ఇఫ్తార్ (గురువారం) : 6.24
సహరి (శుక్రవారం) : 5.02

## నేల పరీక్షలుండవు!

- విద్యార్థులందరికీ బెంచీలు
- సకల సౌకర్యాలతో 'టెన్త్ పబ్లిక్'
- 17 నుంచి 31 వరకు నిర్వహణ
- 174 కేంద్రాలు.. 33,434 మంది విద్యార్థులు
- జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ బాలాజీ రావు

జిల్లాలో పదో తరగతి పబిలక్ పరీక్షలకు దాదాపు అన్నీ ఏర్పాట్లు పూర్తి చేశామని, ఏ విద్యార్థి కూడా నేలపై కూర్చునే పరిస్థితి రానివ్వమని, ప్రతి ఒక్కరు బెంచీపై కూర్చునే పరీక్షలు రాసేలా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా విద్యాశాఖా ధికారి డాక్టర్ ఆర్ బాలాజీరావు తెలిపారు. పరీక్షల నిర్వహణ, ఏర్పాట్లపై నెల్లూరులోని దర్గామిట్టలో ఉన్న జిల్లా పరీక్షల విభాగం కార్యాల యంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆ వివరాలు డీఈవో మాటల్లోనే...

- నెల్లూరు(విద్య), (ఆంధ్రజ్యోతి)

ఈనెల 17 నుంచి 31వతేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 9.30 నుంచి మధ్నాహ్నం 12.45 గంటల వరకు జంబ్లింగ్ విధానంలో పరీక్షలు జరుగుతా యి. పరీక్ష సమయానికి అరగంట ముందే విద్యార్థులు పరీక్ష కేంద్రానికి చేరుకోవాల్సి ఉంటుంది. ప్రతీ విద్యార్థి బెంచీపై కూర్చునే పరీక్షలు రాసేలా అవసరమైతే బెంచీలను ఇతర పాఠశాలల నుంచి తెప్పించేలా అధికారుల కు ఆదేశాలు జారీ చేశాము. పరీక్ష సమయంలో విద్యుత్ సౌకర్యం, తాగునీరు, వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంటాయి. ఈ ఏడాది నూతన జిల్లా ప్రాతిపదికన 174 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నాము. వీటి మూడు విభాగాలు చేశాము. ఏ కేటగిరిలో 95, బీ కేటగిరి 55, సీ కేటగిరిలో 24 సెంటర్లు ఉంటాయి. సీ సెంటర్లలో మాత్రం 24 మంది కస్టోడియన్లను నియమించి పరీక్ష సమయానికి ప్రశ్నపత్రాలు ఆయా కేంద్రాలకు చేరుకునేలా ఏర్పాట్లు చేశాము.

### 33,434 మంది విద్యార్థులు....



జిల్లావ్యాప్తంగా 16,250 మంది బాలురు, 17,184 మంది బాలికలు కలిపి మొత్తం 33,434 మంది విద్యార్థులు పబ్లిక్ పరీక్షలకు హాజరుకానున్నారు. ఈ పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించేందుకు 174 మంది చీఫ్ సూపరిం టెండెంట్లు, 174 మంది డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, 1968 మంది ఇన్విజిలేటర్లను నియమించాము. 24 సిట్టింగ్ స్క్వాడ్స్, 9 ఫ్లయింగ్ స్క్వాడ్స్‌తోపాటు ఉన్నతాధికారుల ఆకస్మిక తనిఖీలుంటాయన్నారు. ప్రశ్న పత్రాలను 15 రూట్స్ ద్వారా 48 స్టోరేజీ పాయింట్లలో భద్రపరిచాము. గ్రామీణ ప్రాంత విద్యార్థులు హాల్‌టికెట్ చూపిస్తే ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తారు.

### ఏడు అతి సమస్యాత్మకం

జిల్లాలో 16 సమస్యాత్మక కేంద్రాలను, వాటిలో ఏడు పాఠశాలలను అతి సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నాము. ఈ కేంద్రాలపై గట్టి నిఘా ఏర్పాటు చేయడంతోపాటు సిట్టింగ్ స్క్వాడ్‌లు ఉంటాయి. సమస్యల పరిష్కారానికి కాల్ సెంటర్ ఏర్పాటు చేశాము. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సమస్యలను టోల్ ఫ్రీ నెంబర్‌కు 8341408109 తెలియజేయవచ్చు. సమగ్రశిక్ష ఏఎస్‌పీడీ రవీంద్రనాథ్ రెడ్డి జిల్లాకు ప్రత్యేకాధికారిగా నియమితులయ్యారు. కలెక్టర్ ఆనంద్ ఆదేశాల మేరకు అధికారుల సమన్వయంతో పరీక్షలు విజయవంతంగా నిర్వహిస్తాము.

## 'సర్వేపల్లి' కేసు..
# వేగం పెంచిన 'సిట్'!

● గ్రావెల్ కేసుపై మొదలైన విచారణ ● ఒకేరోజు 12 మంది స్టేట్‌మెంట్ల రికార్డు

నెల్లూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : సర్వేపల్లి రిజర్వాయర్‌లో అక్రమ గ్రావెల్ తవ్వకాలపై విచారణకు ఏర్పాటైన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణలో వేగం పెంచింది. ఇప్పటికే గ్రావెల్ తవ్వకాలకు ఇచ్చిన పర్మిషన్లు, చెల్లించిన డీడీలు, ఇతర డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్న సిట్.. తాజాగా ఈ కేసులో భాగస్వాములుగా ఉన్న వ్యక్తులను విచారించడం మొదలుపెట్టింది. తొలుత విచారణకు రావాలంటూ 14 మందికి నోటీసులు ఇచ్చింది. వీరిలో 12 మంది మంగళవారం విచారణకు హాజరైనట్లు తెలిసింది. విచారణాధికారి అయిన బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు ఆయన కార్యాలయంలోనే ఈ విచారణ జరిగింది. వెంకటాచలం పోలీసు స్టేషన్‌లో కేసు పెట్టిన అప్పటి ఇరిగేషన్ డీఈఈ, ఏఈలతోపాటు సర్వేపల్లి రిజర్వాయర్ లస్కర్లు, స్థానిక వీఆర్వో, అప్పట్లో గ్రావెల్‌ను తరలించిన టిప్పర్ల యజమానులు విచారణకు హాజరైన వారిలో ఉన్నారు. వీరందరి స్టేట్‌మెంట్లను సిట్ రికార్డు చేసింది. గ్రావెల్ తవ్వకాలకు అనుమతులు మంజూరు చేసే అధికారం తమకు లేదని, ఉన్నతాధికారులు ఇచ్చిన అనుమతుల మేరకు తవ్వకాలు జరిపారా.. లేదా..? అన్నది తాము పరిశీలించామని ఇరిగేషన్ అధికారులు సమాధానం ఇచ్చినట్లు తెలిసింది. అనుమతులకు మించి గ్రావెల్ తవ్వకాలు జరగడంతో నిబంధనల ప్రకారం అనుమతిదారులకు నోటీసులు ఇచ్చి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఇరిగేషన్ అధికారులు సిట్‌కు స్టేట్‌మెంట్ ఇచ్చారు. ఇక గ్రావెల్‌ను తరలించిన టిప్పర్ల యజమానులు మాత్రం.. అక్రమ తరలింపు విషయంలో మరింత స్పష్టత ఇచ్చినట్లు తెలిసింది. అప్పటి ఓ ప్రజాప్రతినిధికి సన్నిహితంగా ఉండే వ్యక్తి తమ వాహనాలను బాడుగకు తీసుకున్నారని, అనుమతులకు, తమకు ఎటువంటి సంబంధం లేదని చెప్పినట్లు సమాచారం. కాగా త్వరలోనే మరి కొంత మందిని విచారణకు పిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి. నాడు అనుమతులు మంజూరు చేసిన ఇరిగేషన్ ఉన్నతాధికారులతోపాటు కేసును విచారించిన పోలీసు అధికారులు, నాటి ప్రజాప్రతినిధి సన్నిహితుడిని విచారణకు పిలిచేందుకు సిట్ సిద్ధమవుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. దీంతో ఈ కేసులో ఎప్పుడు ఏం జరుగుతుం దోనన్న ఉత్కంఠ నెలకొంది.



చంద్రప్రభ వాహనంలో శ్రీరంగనాథుడు

## జాబిల్లిపై జనార్దనుడు

● రంగడికి చంద్రప్రభ వాహన సేవ

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : తల్పగిరి రంగనాథస్వామి బుధవారం రాత్రి చంద్రప్రభ వాహనంలో దర్శనమిచ్చి భక్తులను చల్లగా కరుణించారు. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం విశేష పూజలు జరిగాయి. స్వామివారికి సింహ వాహనం అలంకారం జరిగింది. మూలవరులకు విశేష పుష్పాలంకారం చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఉభయకర్తలుగా దేవస్థానం, పోకూరు సుబ్బారావు కుటుంబం వ్యవహరించారు. ఆలయ చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, ధర్మకర్తలు, ఈవో ఆళ్ల శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

## గరుడుడిపై ప్రసన్నుడి వైభోగం

బిట్రగుంట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : ఓ పక్క నిండు చంద్రుడి వెలుగు.. మరో పక్క తరలివచ్చిన భక్తజనం నడుమ మహావిష్ణువు అలంకరణలో శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారు గరుడ్మంతుడిపై కొలువుదీరి దర్శనమిచ్చారు. బిలకూటక్షేత్రంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారు ఉదయం మోహినీ అవతారంలో విహరించారు. ఈ ఉత్సవాల్లో పేద బ్రాహ్మణులు 30 మందికి సామూహిక ఉచిత ఉపనయనాల కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ దిగువ ప్రాంతంలో రెడ్డి సంక్షేమ సంఘం (కావలి) అన్న ప్రసాదన, మజ్జిగ, మంచినీరు పంపిణీ చేసింది. రావి కుటుంబ సభ్యులు, బిట్రగుంట ద్వారకా నగర్ శేషసాయి మందిరంలో, తాళ్ళూరు, విశ్వనాధరావుపేట పంచాయతీల నడుమ అటవీ ప్రాంతంలోని శ్రీవారి నిజపాదాల వద్ద అన్నసంతర్పణ కార్యక్రమాలు జరిగాయి. ఆ తర్వాత రాత్రి శ్రీవారు గరడు వాహనంపై కొలువుదీరి భక్తులను కటాక్షించారు. విశాఖ నుంచి తమిళనాడు వరకు తీరప్రాంతాల్లో నివసిస్తున్న శంభుని కాపుల కుటుంబాలు తనలిరావడంతో ఆలయ ప్రాంగణం జనసంద్రంగా మారింది, పురిణి వెంకటేశ్వర్లు, శంభునిపాలెం వారు ఉభయకర్తలుగా వ్యవహరించారు. కాగా, కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి, డీఎస్పీ వెంకటరమణ స్వామివారిని దర్శించుకున్నారు.



గరుడ వాహనంపై విష్ణుమూర్తి అవతారంలో వేంకటేశ్వరస్వామి

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి దాదాపు 9 నెలలు కాలం పూర్తవుతోంది. ప్రజల అవసరాలను గుర్తిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికార పార్టీ నేతలు నెల్లూరులో శరవేగంగా అభివృద్ధి పనులు చేపట్టారు. ఇందులో సీసీరోడ్లు, మురుగు కాలువల నిర్మాణం, సుందరీకరణ, చెత్తతరలింపు, చెత్తసేకరణ వాహనాల కేటాయింపులు ఉన్నాయి. ఇలా పూర్తయిన పనులకు అక్షరాల రూ.45 కోట్లు కార్పొరేషన్ నుంచి కాంట్రాక్టర్లకు చెల్లించాల్సి ఉంది. కానీ అధికారులు ఒక్క రూపాయి కూడా విదల్చలేదు. ప్రభుత్వం ఏర్పడిన తొలినాళ్లలో విజయవాడలోని బుడమేరు పొంగి అనేక ప్రాంతాలు జలమయమైయ్యాయి. అక్కడ భాధితులకు నెల్లూరు నుంచి రూ.1.35 కోట్లతో ఆహార ప్యాకెట్లు తయారుచేసి పంపారు. ఈ కాంట్రాక్టర్లకూ రూపాయి అందలేదు. ఇక ప్రజా సమస్యలను ప్రతి కౌన్సిల్ సమావేశంలో కార్పొరేటర్లు ప్రస్తావిస్తున్నా ప్రయోజనం మాత్రం లేదన్న అసంతృప్తి నెలకొంది. వీటన్నిటి నేపథ్యంలో గురువారం జరిగే నగర పాలక సంస్థ సర్వసభ్య సమావేశంలో ఏ మాత్రం చర్చ జరుగుతుందో వేచి చూడాలి.

- నెల్లూరు (సిటీ), ఆంధ్రజ్యోతి)

- కాంట్రాక్టర్లకు రూ.45 కోట్ల బకాయిలు
- 'బుడమేరు' బిల్లులూ పెండింగ్
- రూపాయి విదల్చని కార్పొరేషన్ అధికారులు
- నేటి కౌన్సిల్‌లో నిలయదీయనున్న కాంట్రాక్టర్లు
- ప్రజా సమస్యలపైనా కార్పొరేటర్ల గుర్రు

కార్పొరేషన్ కార్యాలయం



## చేసిన పనులకు
# డబ్బులివ్వండయ్యా..!

రాష్ట్రం వేరు.. మేము వేరు అన్నట్టుగా ఉంది నెల్లూరు కార్పొరేషన్ తీరు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి అనుమతులు పొందిన అనేక అభివృద్ధి పనులకు వారాంతపు చెల్లింపులతో సర్కారు కాంట్రాక్టర్లకు ఆర్థిక లావాదేవీలు సమకూర్చుకురుస్తోంది. కానీ నెల్లూరులోని కార్పొరేషన్‌లో సీసీరోడ్లు, డ్రైన్లు, సుందరీకరణ పనులు, అల్లీపురం నుంచి దొంతాలికి, నివాసాల నుంచి అల్లీపురానికి చెత్తను తరలించే వాహనాలకు ఇప్పటివరకు చెల్లించా ల్సిన మొత్తం రూ.45 కోట్లకు చేరింది. సీఎఫ్ఎంఎస్‌లో అప్‌లోడైన మొత్తం రూ. 15 కోట్ల వరకు ఉండగా, అకౌంట్స్ విభాగంలో పరిశీలనార్థం ఉన్న ఫైల్స్ మరో రూ.20 కోట్లు వరకు ఉంది. ఇక కమిషనర్ లాగిన్‌లో రూ. 10 కోట్లు ఫైల్స్ పెండింగ్ ఉన్నట్లు సమాచారం. ఇవన్నీ పనులు పూర్తయి నెలలు గడుస్తున్నవే. కూటమి ప్రభుత్వం ఏర్పడిన 9 నెలల కాలం నుంచి జరిగిన పనుల తాలుకా లెక్కే. రూ.45 కోట్లు వరకు ఉంది. ఇక జరుగుతున్న పనులు పొద్దు రూ.కోట్లలోనే ఉంది.

● బెంబేలెత్తిపోతున్న కాంట్రాక్టర్లు

కార్పొరేషన్ పరిధిలో అభివృద్ధి పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు బెంబేలెత్తిపోతున్నారు. రూ.కోట్లు ఖర్చు పెట్టి పనులు పూర్తి చేస్తే చెల్లింపులు మాత్రం ఉండటం లేదని అధికారులపై కాంట్రాక్టర్లు గుర్రుమంటున్నారు. అధికారికంగా టెండర్ల ద్వారా పనులు దక్కించుకుని నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేసినా అధికారులు రూపాయి కూడా విడుదల చేయడం లేదని వాపోతున్నారు. పనులు చేసినా వైసీపీ సర్కారు హయాంలో నగదు చెల్లింపులుండవన్న కారణంతో తామే పనులు చేపట్టలేదని, కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రవ్యాప్తంగా వారాంతపు చెల్లింపులు చేస్తూ మిగిలిన ప్రాంతాలలో బ్రహ్మాండంగా నిధులు మంజూరు అవుతున్నాయని, ప్రత్యేకించి నెల్లూరు కార్పొరేషన్‌లోనే రూపాయి మంజూరు చేయకుండా నిలిపివేశారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● 'బుడమేరు' ఆహార ఖర్చూ అంతే!

విజయవాడలోని బుడమేరు భాధితులకు ఆహారం పంపిణీ చేసి సుమారుగా రూ.1.35 కోట్లు ఖర్చు చేశారు. ఈ మొత్తాన్ని అప్పట్లో ఏ రోజుకు ఆ రోజు చెల్లిస్తామని అధికారులు ప్రకటించారు. పైగా ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపుతో తామంతా ముందుకు వచ్చి రూ.లక్షలు ఖర్చు చేసి ప్రత్యేక వాహనాల్లో బాధితులకు ఆహార ప్యాకెట్లు తరలించామని కాంట్రాక్టర్లు చెబుతున్నారు. కానీ నెలలు గడిచినా కార్పొరేషన్ అధికారులు నేటికీ రూపాయి మంజూరు చేయలేదని వాపోతున్నారు.

### సమస్యలు ప్రస్తావించినా...

కార్పొరేషన్‌లో ప్రతిసారి ప్రజల సమస్యలపై గళమెత్తినా అధికారుల నుంచి ఆశించిన ఫలితం ఉండటం లేదని కార్పొరేటర్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తమ డివిజన్లలో పారిశుధ్యలేమి, కుక్కల బెడద, పందుల విహారం, డ్రైన్లలో పూడికతీత, దోమల వ్యాప్తితో రోగాలు విజృం భణ, వీధిలైట్ల ఏర్పాటు వంటి సమస్యలను ప్రతి కౌన్సిల్ సమావేశంలో చర్చకు తీసుకువస్తున్నా అధికారులు ఆ రోజుకు సరేనని ఆపై వదిలేస్తున్నారంటూ కార్పొరేటర్లు మండిపడు తున్నారు. కాగ గురువారం నేడు జరుగు సర్వసభ్య సమావేశంలో కార్పొరేటర్లు ఎంత మాత్రం ప్రజసమస్యలపై గళమెత్తుతారో ఆసక్తికరంగా మారింది. తమ డివిజన్లలో పనులు మంజూరు చేయించుకున్నా వాటిని పూర్తి చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడంలేదని, ఈ అంశంపై నేటి కౌన్సిల్లో నిలదీస్తామంటూ కొందరు సభ్యులు బహిరంగంగానే ప్రకటిస్తున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే

# చైతన్య యాత్రలు



సమావేశంలో మాట్లాడుతున్న కాకు వెంకటయ్య

ఉదయగిరి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చైతన్యయాత్రలు నిర్వహించనున్నట్లు సీపీఎం జిల్లా నాయకుడు కాకు వెంకటయ్య పేర్కొన్నారు. బుధవారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో ప్రాంతీయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన విలేఖరులతో మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదన్నారు. భూ సమస్యలతో ప్రజలు తహసీల్దారు కార్యాలయం చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నా పరిష్కారం కాలేదన్నారు. ఉదయగిరిలో 50 పడకల వైద్యశాల ఉన్నా రోగులకు మెరుగైన వైద్య సేవలు అందడం లేదన్నారు. పెద్దిరెడ్డిపల్లి, సీతారాం సాగర్ జలాశయాలకు బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడం దారుణ మన్నా రు. ఉదయగిరిలో కళాశాల వసతిగృహం ఏర్పాటు చేయాలని ఏళ్ల తరబడి డిమాండ్ చేస్తున్నా కార్యరూపం దాల్చలేదన్నారు. ప్రభుత్వాలు మారినా ఉదయగిరి- బండగానిపల్లి ఘాట్‌రోడ్డు, ఉదయగిరి-నందవరం రోడ్ల దుస్థితి మారడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రజా సమస్యలు పరిష్కరించాలని, లేదంటే ఆందోళన కార్య క్రమాలు ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కోడె రమణయ్య, వెంకటేశ్వర్లు, నాయబ్ పాల్గొన్నారు.

## వెంగమాంబ ఆలయంలో వేలం పాటలు

దుత్తలూరు (ఉదయగిరి), మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్రవాడలో ఉన్న వెంగమాంబ పేరంటాలు అమ్మవారి ఆలయానికి సంబంధించి బుధవారం వేలం పాటలు నిర్వహించారు. కోరుటూరు దేవ స్థానముల కార్యనిర్వహణాధికారి పీ కవిత ఆధ్వర్యంలో లీజు హక్కులకు బహిరంగ వేలం నిర్వహించారు. ఈసందర్భంగా కొబ్బరి కాయలు, పూజ ద్రవ్యములకు సంబంధించి అదే గ్రామానికి చెందిన టంకశాల ప్రభావతి రూ. 28,01,000కు దక్కించుకున్నారు. అలాగే చీరలు, రవికలు సేకరణ, విక్రయాలకు రూ. 7,54,000, గ్యాస్ పొయ్యిలు అద్దెకు ఇచ్చుటకు పీ లీలావతి రూ. 1,25,000, పండ్లు, పూలు విక్రయాలకు గాను పత్తి సుబ్రమణ్యం రూ. 4,73,000, పాదరక్షలు భద్రపర్చుకొనుటకు అమ్మనబోలు బాబు 12,200కు వేలం పాడి సొంతం చేసుకున్నారు. దీంతో గతేడాది కంటే ప్రస్తుతం రూ. 1,32,200 ఆదాయం పెరిగినట్లు ఆమె తెలిపారు. ఆలయ కార్యనిర్వహణాధికారి వి ఉష, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పచ్చవ కరుణాకర్, పచ్చవ వెంగయ్య, వేమూరి ముసలయ్య, సర్పంచు నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన అవసరం



ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పిస్తున్న అశోక్

సంగం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రతి ఒక్కరూ ఆర్థిక అక్షరాస్యత, సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌పర్మేషన్ స్టేట్ రిసోర్స్‌పర్సన్ అశోక్ పేర్కొన్నారు. బుధవారం ఆయన స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్నెస్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బ్యాంకింగ్ సేవలపై పూర్తి అవగాహన కలిగి ఆర్థికంగా బలోపేతం చెందాలన్నారు. కెనరా బ్యాంక్ మేనేజర్ శివ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో అమలవుతున్న పీఎంఎస్‌బీవై, పీఎంజేజేబీవై పథకాలతోపాటు సేవింగ్, డిపాజిట్ ఖాతాల ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆంజనేయులు, రిసోర్స్‌పర్సన్ రూపేష్, సతీష్, ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ



వరికుంటపాడు: వాటర్ కూలర్ అందజేస్తున్న జనసేన నేత వెంగళరావు తదితరులు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తోటలచెరువుపల్లి గ్రామానికి చెందిన జనసేన నాయకుడు గమ్మలంపాటి వెంగళరావు వేసవి దృష్ట్యా సమీప పెద్దిరెడ్డిపల్లి ఉన్నత పాఠశాలకు వాటర్ కూలర్ అందజేశారు. నార్త్‌కొండాయపాళెం, విరువూరు పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లను పంపిణీ చేశారు. అలాగే పెద్దిరెడ్డిపల్లి పాఠశాలకు అదే గ్రామానికి చెందిన నాయకులు రవి, శివాజీ, వరికుంటపాడు ఉన్నత పాఠశాలకు సమీప ప్రకాశం జిల్లా పామూరుకు చెందిన రాజేష్ మెడికల్స్ అధినేత దరిశి రాజేష్ ప్యాడ్‌లను అందజేశారు.

●వింజమూరు: మండలంలోని ఊటుకూరు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జనసేన పార్టీ నాయకుడు వెంకీ గవ్వల ఆధ్వర్యంలో విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు బండారు సత్యనారాయణ, నాయకులు మనోహర్, లోకేష్, ఆజర్, నితీష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు. అలాగే, మండలంలోని రాధాకృష్ణ ప్రభుత్వ ఉన్నత పాఠశాల చాకలికొండలో పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు ఇదే పాఠ శాలలో (1996-97) చదివిన పూర్వ విద్యార్థులు మబ్బు వెంకటప్రసాద్, కాకర్ల మాల్యాద్రి పరీక్షా సామగ్రిని అందచేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పోలుబోయిన రమేష్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ పథకాలపై కళాబృందం ప్రచారం



బుర్రకథ ప్రదర్శనతో ప్రచారం చేస్తున్న కళాబృందం

సంగం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండ ల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో షాలెట్ ఆధ్వర్యంలో కేంద్రప్రభుత్వ పథకాలపై శ్యామలాదేవి కళాబృందం బుధవారం బుర్రకథ నాటకం రూపంలో ప్రచారం నిర్వహించారు. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన (పీఎంఎస్‌బీవై), ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన (పీఎంజేజెబీవై) ప్రధానమంత్రి సూ ర్య ఘర్ యోజన (పీఎంఎస్‌జీవై), ప్రధాన మంత్రి అటల్ పెన్షన్ యోజన (పీఎంఏపీవై) వంటి తదితర పథకాలపై బుర్రకథ రూపంలో ప్రదర్శించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కెనరా బ్యాంక్ మేనేజర్ శివ, ఏపీఎం రవిశంకర్‌రెడ్డి, పొదుపు మహిళలు, బ్యాంక్ క్యాషియర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

### కెనరా బ్యాంక్ సేవలపై ఇంటింటి ప్రచారం

అనంతసాగరం : స్థానిక కెనరా బ్యాంక్ సేవల గురించి అనంతసాగరంలో అధికారులు బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బ్యాంక్ మేనేజర్ బితేష్‌కుమార్ వ్యాపారస్తులకు, స్థానికులకు బ్యాంక్ సేవలపై అవగాహన కల్పించారు. ప్లకార్డులు పట్టుకొని ర్యాలీ చేశారు. ఈకార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు

ఉదయగిరి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రగతి జూనియర్ కళాశాలలో పోషణ భీ పఢాయి భీ కార్యక్రమంలో భాగంగా రెండో రోజైన బుధవారం అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రిసోర్సుపర్సన్లు సుబ్బరత్నమ్మ, రమణమ్మలు కార్యకర్తలకు తగు సూచనలు, సలహాలు అందజేశారు.

●దుత్తలూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో సూపర్ వైజర్లు షేక్ షాను, షకీలాలు అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాలను కార్యకర్తలు కేంద్రాల్లో అమలు చేయాలన్నారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు.

# అసంపూర్తిగా డిజిటల్ గ్రంథాలయాల నిర్మాణం

● విద్యార్థులు, నిరుద్యోగుల ఆశలు అడియాశలు



రామనాయుడుపల్లిలో అసంపూర్తిగా నిలిచిన డిజిటల్ గ్రంథాలయ నిర్మాణం

మర్రిపాడు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ప్రతీ గ్రామంలో డిజిటల్ గ్రంథాలయాలను ఏర్పాటుచేస్తామని గత వైకాపా ప్రభుత్వం ప్రచార ఆర్భాటం చేసింది. కానీ గత ఐదేళ్ల కాలంలో ఎక్కడా కార్యరూపం దాల్చలేదు. నిర్మాణాలకు సంబంధించిన బిల్లులు సకాలంలో విడుదల చేయకపోవడంతో ఇప్పటికీ పూర్తికాలేదు. ఆత్మకూరు నియోజకవర్గంలో 136 పంచాయతీలు ఉండగా 85 సచివాలయాలు ఉన్నాయి. సచివాలయం ఉన్న ప్రతీచోటా ఒక డిజిటల్ గ్రంథాలయాన్ని నిర్మిస్తామని గత ప్రభుత్వం ప్రచారం చేసింది. తరువాత వాటిల్లో కోత విధించి విడతల వారీగా గ్రంథాలయాలను నిర్మిస్తామని ప్రకటించింది. ఈక్రమంలో మొదటి విడతగా ఆత్మకూరు నియోజక వర్గంలో 36 చోట్ల మంజూరుచేసి కొన్నిచోట్ల పనులు ప్రారంభించారు. ఒక్కో భవనానికి రూ. 16.70 లక్షల నిధులు కేటాయించారు. మర్రిపాడు మండలంలో కంద్రిక, రామానాయుడుపల్లిలో మాత్రం స్లాబులు వేసి పనులు అర్థాంతరంగా నిలిపివేశారు. దీంతో గ్రామాల్లో అంతర్జాల సేవలు అందుబాటులోకి వస్తాయని ఆశించిన విద్యార్థులు, నిరుద్యోగుల ఆశలు అడియాశలు అయ్యాయి. కూటమి ప్రభుత్వమైనా అర్థాంతరంగా నిలిచిపోయిన డిజిటల్ గ్రంథాలయాలను నిర్మిస్తే గ్రామీణ ప్రాంతాల యువతకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది.

## భక్తిశ్రద్ధలతో సరస్వతీ పూజ



వరికుంటపాడు : సరస్వతీదేవికి విద్యార్థుల పూజలు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పెద్దిరెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో బుధ వారం గ్రామానికి చెందిన పచ్చవ లక్ష్మయ్య జ్ఞాపకార్థం కుమారులు పెద వెంగయ్య, చిన వెంగయ్య, భూమయ్యల ఆధ్వర్యంలో సరస్వతీ పూజ నిర్వహించారు. పదవ తరగతి విద్యార్థులు తమ హాల్ టికెట్లను అమ్మవారి విగ్రహం వద్ద ఉంచి పూజలు చేశారు. అర్చకులు ఆనందశర్మ పూజలు నిర్వహించి మంచి ఫలితాలతో ఉత్తీర్ణత సాధించాలని ఆశీర్వదించారు. అనంతరం వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం అన్నదానం ఏర్పాటు చేసిన దాతలను ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యా యులు చలపతి, ఎస్ఎంసీ చైర్మన్ రసూల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

●సీతారామపురం : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గౌతమి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో బుధవారం సరస్వతీ పూజ నిర్వహించారు. పదో తరగతి విద్యార్థులు పరీక్ష సామగ్రిని అమ్మవారి ఎదుట ఉంచి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రదానోపాధ్యాయులు శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు, తల్లి దండ్రుల కమిటీ చైర్మన్‌లు పాల్గొన్నారు.

●అనంతసాగరం : మండలంలోని కామిరెడ్డిపాడు ఉన్నత పాఠశాలలో విద్యార్థులు బుధవారం సర్వసతి పూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం వసుంధరాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి

● అసెంబ్లీలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

ఉదయగిరి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఉదయగిరి, ఆత్మకూరు నియోజకవర్గాల్లో నాలుగు దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని రహదారులకు నిధులు మంజూరు చేసి ప్రజల కష్టాలు తీర్చాలని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ బుధవారం అసెంబ్లీలో తన వాణిని వినిపించారు. ప్రధానంగా ఉదయగిరి-నందవరం, వింజమూరు-ఆత్మకూరు, కలిగిరి-సంగం రహదారులు గుంతలమయంగా మారి సింగిల్‌రోడ్లు కావడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారన్నారు. ఈ రహదారుల గుండా నిత్యం జిల్లా కేంద్రమైన నెల్లూరుకు ఆయా నియోజకవర్గాల్లోని ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారన్నారు. అలాగే సీతారామపురంలో క్రీడాకారుల అభ్యున్నతి కోసం నిర్మించిన క్రీడా వికాస కేంద్రం జాతీయ రహదారి నిర్మాణంలో తొలగించడం జరిగిందని, ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే మరోచోట కేంద్రం నిర్మిస్తామన్నారు. ఎన్టీఆర్ భరోసా పించన్లు మంజూరయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. మహిళలకు రక్షణ కల్పించడంలో మన రాష్ట్రం వెనుకబడి ఉందని, ప్రభుత్వం శక్తియాప్ ద్వారా ప్రత్యేక రక్షణ కల్పిస్తున్నప్పటికీ వారి జీవితానికి భరోసా కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వారి రక్షణకు ప్రత్యేక చట్టాలను అమలు చేయాలన్నారు. మహిళలను ప్రతిఒక్కరూ గౌరవించి సమాజంలో వారిని శక్తివంతులుగా తీర్చిదిద్దాలని సభాముఖంగా తెలియచేశారు.

### బీటీ నాయుడుకి సన్మానం



బీటీ నాయుడుని సన్మానించి జ్ఞాపిక అందజేస్తున్న చల్లా ప్రసాద్

దుత్తలూరు (ఉదయగిరి), మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీగా రెండోసారి నియమితులైన బీటీ నాయుడుని బుధవారం విజయవాడలోని అతిథిగృహంలో ఉదయగిరి నియోజకవర్గ టీడీపీ అధికార ప్రతినిధి, వాల్మీకి సాధికారిక కన్వీనర్ చల్లా ప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిసి ప్రత్యేక అభినందనలు తెలిపి సన్మానించి జ్ఞాపిక అందజేశారు. బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి ఒక్క తెలుగుదేశం పార్టీకే సాధ్యమని, అందు కు ఉదాహరణ బీటీ నాయుడుకి రెండోసారి ఎమ్మెల్సీగా ఇవ్వడమేనన్నారు.

### అభివృద్ధి పనులకు అధికారులు సహకరించాలి

అనంతసాగరం : మండలంలో జరిగే అభివృద్ధి పనులకు అధికారుల సహకారం అవసరమని టీడీపీ సీనియర్ నాయకుడు మెట్టుకూరు కృష్ణారెడ్డి తెలిపారు. ఉపాధి హామీ ఉద్యోగులు, రెవెన్యూ అధికారులతో బుధవారం ఆయన చర్చించారు. సిమెంటు రోడ్లు, గోకుల నిర్మా ణాలు త్వరగా పూర్తయ్యేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో సాగరం చెరువు సొసైటీ అధ్యక్షుడు రాహూరు సుబ్బారెడ్డి, మైనారిటీ నాయకుడు ఖాసింబాష, చల్లా అవినాష్‌రెడ్డి, మనోజ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

### నేటి నుంచి టిడ్కో ఇళ్ల వరకు ఆర్టీసీ బస్సు సౌకర్యం

ఆత్మకూరు : జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం నుంచి ఆత్మకూరు టిడ్కో ఇళ్ల వరకు ఆర్టీసీ బస్సు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ కరీమున్నీసా ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7.15 గంటలకు గుడిపాడు వద్ద బయలుదేరి 7.45 గంటలకు టిడ్కో ఇళ్ల వద్దకు వచ్చి అనంతరం ఆత్మకూరుకు 8గంటలకు చేరుతుందని తెలిపారు. అదేవిధంగా సాయంత్రం 5.15గంటలకు ఆత్మకూరు నుంచి బయలుదేరి టిడ్కో ఇళ్ల వద్దకు చేరి నెల్లూరు వెళ్తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని టిడ్కో ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె ఒక ప్రకటనలో కోరారు.

### వైసీపీ శ్రేణుల సంబరం

ఉదయగిరి : స్థానిక హెచ్‌పీ పెట్రోల్ బంకు ఆవరణలో బుధవారం వైసీపీ 15వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించి మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం నెల్లూరులో నిర్వహిస్తున్న యువత పోరు కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు.

## జనసేన జెండా ఆవిష్కరణ



జెండా ఆవిష్కరిస్తున్న జనసేన పార్టీ మండల అధ్యక్షుడు రసూల్

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తోటలచెరువుపల్లిలో బుధవారం జనసేన జెండా ఆవిష్కరణ ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు పఠాన్ రసూల్ మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవ న్‌కల్యాణ్ అన్ని వర్గాలకు సమాన ప్రాతినిధ్యం కల్పిస్తు పథకాల అమలులో తమదైన శైలిలో వ్యవహరిస్తున్నారన్నారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం కల్పిస్తున్నారన్నారు. అలాగే ఈనెల 14న పిఠాపురంలో జరిగే పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం బస్టాండ్ సెంటర్‌లో నిర్మించిన స్థూపంతో పాటు జెండాను ఆవిష్కరించి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో నాయకులు యాదగిరి ప్రభాకర్, నాగేశ్వరరావు, కె. వెంకట్, అవినాష్, ఎం వెంకట్, వెంగళరావు, జగదీష్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్‌స్టేషన్‌లో పది ప్రశ్నపత్రాలు భద్రం



పోలీసు స్టేషన్‌లో ప్రశ్నపత్రాలను భద్రపరుస్తున్న అధికారులు.

కలువాయి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఈ నెల 17వ నుంచి జరుగు పదోతరగతి పబ్లిక్ పరీక్షల ప్రశ్న పత్రాలు బుధవారం కలువాయి పోలీసు స్టేషనుకు చేరాయి. పోలీసు బందోబస్తుతో ప్రత్యేక వాహనంలో విద్యాశాఖ అధికారులు సెట్-1 ప్రశ్నపత్రాలు తీసుకొచ్చి ఇక్కడ భద్రపరిచారు. మండలంలో ఈ ఏడాది 379 మంది విద్యార్థులు పదోతరగతి పరీక్షలు రాస్తున్నారు. వీరి కోసం కలువాయి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏబీ రెండు సెంటర్లు, కుల్లూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఒక సెంటర్ మొత్తం 3సెంటర్లు ఏర్పాటు చేశారు. కలువాయి ఏ సెంటర్‌లో ఈఏడాది 55 మంది ఓపన్ స్కూల్ విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

### బోధనా నైపుణ్యం పెంపొందించుకోవాలి

సీతారామపురం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు బోధనా నైపుణ్యం పెంపొందించుకోవాలని ఎంఈవో మస్తాన్‌వలి సూచించారు. బసినేనిపల్లి, సీతారామపురం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం స్కూల్‌కాంప్లెక్స్ పరిధిలోని ప్రధానోపాధ్యాయులు, సహోపాధ్యాయులకు కాంప్లెక్స్ స్థాయి సమావేశం నిర్వహించారు. పాఠశాలల బోధనలో పాటించాల్సిన విధానాలను వీడియో ప్రదర్శనతో వివరించారు. ఈ కార్యక్రమంలో సీతారామపురం, ఓగూరువాడ్లపల్లి, బసినేనిపల్లి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, సహోపాధ్యాయులు పాల్గొన్నారు.

### అభివృద్ధి పనులకు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఆమోదం

వింజమూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చాకలికొండ పీహెచ్‌సీలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో డాక్టర్ మురళీధర్ మాట్లాడుతూ ఆసుపత్రిలో హెచ్‌డీఎఫ్ నిధులను కమిటీ సభ్యుల అంగీకారం మేరకు ఆసుపత్రి అభివృద్ధికి ఉపయోగించడం జరుగుతుందన్నారు. మౌలిక వసతులు, తాగునీరు, బోర్లు మరమ్మతులు తదితర పనులు చేయడానికి కమిటీ ఆమోదం తెలిపిందన్నారు

C.R.I.M.E N.E.W.S

## తాళం వేసిన ఇంట్లో పట్టపగలే చోరీ

● 25 సవర్ల బంగారం, రూ.30 వేల అపహరణ



బీరువాలో వేలిముద్రలు స్వీకరిస్తున్న క్లూస్ టీం సభ్యులు, ఎస్ఐ సుమన్

కావలి రూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కావలి పట్టణం తుమ్మల పెంట రోడ్డులోని ఒక లేఅవుట్‌లో తాళం వేసిన ఇంట్లో పట్టపగలు దుండగుడు జొరబడి చోరీకి పాల్పడ్డారు. బాధితులు, పోలీసుల కథనం మేరకు... ఈ లేఅవుట్‌లో నివాసం ఉండే తన్నీరు వసంతరావు గుడ్లూరు మండలం చినలాటరపీ పాఠశాలలో ఉపాధ్యాయుడు, ఆయన సతీమణి అంజనీదేవి బోగోలు మండలం జువ్వలదిన్నెలో ఉపాధ్యాయినిగా పని చేస్తున్నారు. బుధవారం ఉదయం 8 గంటలకు ఇద్దరూ ఇంటికి తాళం వేసుకుని పాఠశాలలకు వెళ్లారు. 10 గంటల ప్రాంతంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి పక్క ఇంట్లో నివాసముండే ఉపాధ్యాయుడు ప్రవీణ్ కుమార్ ఇంటి గోడ దూకి పోతుండటం గుర్తించిన స్థానికులు అతనిని వెంబడించడంతో దుండగుడు పరారయ్యాడు. ఈ విషయాన్ని స్థానికు లు ప్రవీణ్ కుమార్‌కు తెలపడంతో వెంటనే ఆయన పాఠశాల నుంచి వచ్చి ఇంటి పరిసరాలు పరిశీలించుకుని తమ ఇంటి పక్కనే ఉన్న వసంతరావు ఇంట్లో చోరీ జరిగినట్లు గుర్తించి బాధితులకు సమాచారం ఇచ్చారు. వారు పాఠశాల నుంచి వచ్చి చూసుకోగా ఇంటి మెయిన్ డోర్ పక్కన ఉన్న సర్వీస్ డోర్, దాని గ్రిల్ తాళాలు పగలగొట్టి ఇంట్లోకి ప్రవే శించిన దుండగుడు బెడ్ రూంలో బీరువా పగలగొట్టి 25 సవర్ల బంగారు ఆభరణాలతో పాటు, రూ.30వేల అపహరించుకు పోయినట్లు గుర్తించారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయగా 1వ పట్టణ ఎస్ఐ సుమన్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. నెల్లూరు నుంచి క్లూస్ టీం బృందం వచ్చి వేలిముద్రలు సేకరిం చారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### బాలుర అక్రమ రవాణా

● పట్టుకున్న ఐసీపీఎస్ అధికారులు

నెల్లూరు (హరనాథపురం), మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఒడిస్సాలోని రాయగడ్ నుంచి టాటానగర్ రైలులో అక్రమంగా తరలిస్తున్న బాలురను ఐసీపీఎస్ అధికారులు బుధవారం గుర్తించి నెల్లూరు రైల్వే స్టేషన్‌లో పట్టుకున్నారు. జితేంద్ర, శన్మాజీ, మదన్ ముండా, అజిత్ ముండా, చాడిబొద్ర, మణి షైజ్ గోద్రాలను వాళ్ల స్వంత ప్రాంతాల నుంచి బుధవారం కూలి నిమిత్తం చెన్నై, కేరళలోని కాటన్ మిల్లులో పని చేయించడానికి తీసుకెళుతున్నట్లు అధికారులు గుర్తించారు. మధ్యవర్తులైన అంకిత్ లాక్ర, గోపి సన్మేజ్ ద్వారా తాము పనులకు వెళుతున్నట్లు ఆ బాలురు అధికా రులకు తెలిపారు. జిల్లా బాలల సంరక్షణ విభాగం వారు ఆ పిల్లలకు కౌన్సెలింగ్ ఇచ్చి జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ నెల్లూరు వారి సహకారంతో కేసు ఫైల్ చేసి వారిని నెల్లూరు చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఎదుట హాజరుపరిచారు. ఆ తర్వాత విశ్వజనని ఓపెన్ షెల్టర్ హోమ్‌లో చేర్పించారు. జిల్లా బాలల సరంక్షణ అధికారి బీ సురేష్ ఆ బాలల తల్లిదండ్రులు ఆచూకీ తెలుసుకుని వారికీ బాలలను అప్పగించే ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ ఆర్డేడీ ఎస్ జయలక్ష్మి, పీడీ సీహెచ్ సుశీలాదేవి, జీఆర్‌పీ ఆర్‌పీఎఫ్, బీబీఏ, ఐసీపీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

### నకిలీ ఎస్‌ఐ గుట్టురట్టు



ఎస్ఐ డ్రస్సులో హరీష్

సంగం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): తాను ఎస్ఐగా సెలెక్ట్ అయి అనంతపురంలో ట్రైనింగ్ పూర్తి చేశానని స్థానికులను నమ్మించి ఎస్ఐ వేషధారణలో కారులో సంచరిస్తూ సోషల్ మీడియాలో ఫోటోలు కూడా హల్‌చల్ చేయడంతో సదరు యువకుడ్ని నకిలీ ఎస్ఐగా గుర్తించి కేసు నమోదు చేసిన సంఘటన బుధవారం జరిగింది. వివరాల మేరకు... అల్లూరు మండలం నార్త్ ఆమూలూరుకు చెందిన నన్నం హరీష్ అనే యువకుడు బీటెక్ చేసి పోలీస్ సెలక్షన్‌కు ప్రయత్నించి విఫలమ య్యాడు. హరీష్ చిన్నతనంలోనే తండ్రి మృతి చెందాడు. దీంతో హరీష్ తల్లి ఆమె తల్లిదండ్రుల స్వగ్రామమైన సంగం మండలంలోని సిద్దీపురంలో ఉంటోంది. హరీష్ మాత్రం తండ్రి స్వగ్రామంలోనే నాయనమ్మ, తాత వద్ద ఉండి చదువుకున్నాడు. ఈక్రమంలో హరీష్ ఇటీవల తల్లి ఉంటున్న సిద్దీపురం వచ్చి తాను ఎస్ఐగా సెలెక్ట్ అయి అనంతపురంలో ఎస్ఐగా ట్రైనింగ్ పూర్తిచేశానని నమ్మించాడు. ఈక్రమంలో గత కొంత కొద్ది రోజుల నుంచి పోలీస్ డ్రస్, టోపీ ధరించి కారులో సంచరిస్తున్నాడు. అంతేకాకుండా ఎస్ఐ వేషధారణలో ఉన్న ఫోటోలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. ఇతని వ్యవహారంపై అనుమానం వచ్చిన స్థానికులు వీఆర్వోకు సమాచారం అందించారు. దీంతో వీఆర్వో ద్వారా సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు యువకుడ్ని విచారించగా నకిలీ ఎస్ఐగా నిర్ధారణ అయింది. అయితే యువకుడు నకిలీ ఎస్ఐ వేషధారణలో ఎటువంటి మోసాలు, బెదిరింపులకు పాల్పడలేదని తెలిసింది. కేవలం పోలీస్ వృత్తిపై ఉన్న మమకారంతో నకిలీ ఎస్ఐ వేషధారణతో కారులో బయటకు వెళ్లడం, తిరిగి ఇంటికి రావడమే చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. దీంతో యువకుడిపై చీటింగ్ కేసు నమోదు చేసి స్టేషన్ బెయిల్‌పై విడుదల చేసినట్లు ఎస్ఐ రాజేష్ తెలిపారు.

### అప్పుల బాధతో ఆటో డ్రైవర్ అదృశ్యం

నెల్లూరు(క్రైం), మార్చి 12 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని టిడ్కో ఇళ్లలో నివసించే తురకా మల్లికార్జున అనే వ్యక్తి అదృశ్యమైనట్లు నవాబుపేట పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... భగత్‌సింగ్ కాలనీ పరిధిలోని టిడ్కో ఇళ్లలో మల్లికార్జున, రాజేశ్వరి దంపతులు నివసిస్తున్నారు. మల్లికార్జున ఆటో నడుపుకుంటూ కుటుంబా న్ని పోషిస్తున్నాడు. అప్పుల అధికంగా చేయడంతో అప్పిచ్చిన వారి ఒత్తిడి తట్టుకోలేక కొద్దిరోజుల కిందట స్టోన్‌హౌస్‌పేటలోని తన మేనత్త ఇంటికి వెళ్లిపోయాడు. ఈ నెల 8వ తేదీ అక్కడి నుంచి కూడా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల గాలించినా జాడ తెలియక పోవడంతో బుధవారం భార్య రాజేశ్వరి నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

### టీ తాగి వచ్చేసరికి ఆటో దోచేశారు

నెల్లూరు(క్రైం), మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఓ ఆటో డ్రైవర్ తన ఆటోను రోడ్డు పక్కన నిలిపి టీతాగి వచ్చే సరికి గుర్తుతెలియని వ్యక్తులు ఆటోను దోచుకెళ్లిపోయారు. పోలీసుల సమాచారం మేరకు... కోవూరు మండలం పోతిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన షేక్ రఫీ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం రాత్రి 8 గంటల సమయంలో ఏపీ26 టీసీ7162 నెంబరు కలిగిన అప్పీ ప్యాసెంజర్ ఆటోను నగరంలోని బాబు ఐస్‌క్రీమ్ దుకాణం పక్కన పార్క్ చేసి టీ తాగేందుకు వెళ్లాడు. తిరిగి వచ్చి చూసే సరికి ఆటో కనిపించలేదు. చుట్టు పక్కల గాలించినా ఫలితం లేకపోవడంతో బుధవారం సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### ఆటో బోల్తా - ముగ్గురికి తీవ్ర గాయాలు

సీతారామపురం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంధంవారిపల్లి గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి. సీతారామపురం గ్రామానికి చెందిన నారాయణ తన ఆటోలో చిన్ననాగంపల్లి నుంచి ప్రయాణికులను ఎక్కించుకొని సీతారామపురం వస్తుండగా గంధంవారిపల్లి గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై గేదెలు అడ్డు రావడంతో ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఉప్పారోలపల్లికి చెందిన మలపాటి రంగయ్య, పబ్బులేటిపల్లికి చెందిన యారావాలా భాగ్యమ్మ, గంధంవారిపల్లికి చెందిన వంగపాటి లక్ష్మీదేవి లకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు 108 వాహనం ద్వారా సీతారామపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఉదయగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## 16న మండల పరిషత్ సమావేశం

అల్లూరు, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈ నెల 16వ తేదీన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రజనీకాంత్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశంలో ప్రధానంగా తాగునీరు, ప్రజారోగ్యం, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై చర్చ జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని తెలిపారు.

## ఎస్సీ, ఎస్టీ, బీసీల ఇళ్లకు అదనపు నిధులు

అల్లూరు, మార్చి 12(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో గృహనిర్మాణాలు చేపట్టిన ఎస్సీ, ఎస్టీ, బీసీ లబ్ధిదారులకు కూటమి ప్రభుత్వం అదనపు నిధులు మంజూరు చేసిందని హౌసింగ్ ఏఈ సీహెచ్ వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ రూ.1.80 లక్షలతో మంజూరైన గృహనిర్మాణాలలో అర్ధాంతరంగా ఆగిపోయిన వాటికి ఎస్సీ, ఎస్టీలకు రూ.75వేలు, బీసీలకు రూ.50వేలు చొప్పున అదనపు నిధులు మంజూరయ్యాయన్నారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు తమ పరిధిలోని లబ్ధిదారులకు కుల ధ్రువీకరణ మంజూరు చేసేలా సహకరించి జూన్ మొదటి వారంలోపు నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## రైతు కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

కావలి, మార్చి 12(ఆంధ్రజ్యోతి) : కావలి పట్టణంలోని ఉమాచంద్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న కావలి రూరల్ మండలం తాళ్లపాలెంకు చెందిన రైతు శివప్రసాద్‌రెడ్డి ఆయన సతీమణి లక్ష్మీకాంతమ్మలను బుధవారం కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి పరామర్శించారు. పొలం వివాదంలో వైసీపీ నేత అభిషేక్‌రెడ్డి వేధింపులను తట్టుకోలేక మంగళవారం శివప్రసాద్‌రెడ్డి ఆయన సతీమణి పొలంలో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విషయం తెలిసిందే. వారిని కావలి ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఉమాచంద్ ఆసుపత్రికి తరలించి అక్కడ చికిత్స అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి బుధవారం సాయంత్రం ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందుతున్న వారిని పరామర్శించి ధైర్యం చెప్పారు. డాక్టర్‌ను అడిగి ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట సోమశిల ప్రాజెక్ట్ మాజీ చైర్మన్ కండ్లగుంట మధుబాబు నాయుడు, టీడీపీ నేతలు ఉన్నారు.

## వైసీపీ ఆవిర్భావ దినోత్సవం

కావలిటౌన్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ముసునూరులో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి నివాసం వద్దనున్న క్యాప్ కార్యాలయ ప్రాంగణంలో బుధవారం వైసీపీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి పార్టీ జెండా ఆవిష్కరించి నేతలు ప్రజాప్రతినిధులు కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ శ్రేణులు పాల్గొన్నారు.

## ఆయుష్ వైద్యశిబిరం

బిట్రగుంట, మార్చి 12(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కొండబిట్రగుంట శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో ఆయుష్ శాఖ వైద్యులు బుధవారం ఉచిత ఆయుర్వేద శిబిరం ఏర్పాటు చేశారు. వైద్యులు కొర్రా చంద్రశేఖర్, షేక్ హలిమౌలాలి, కే.కృష్ణయ్య, రాజనరసింహ, శ్రీరేఖలు బ్రహ్మోత్సవాలకు వచ్చిన 375 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా ఆయుర్వేద మందులు పంపిణీ చేశారు. రెండు రోజుల పాటు ఈ వైద్యశిబిరం నిర్వహిస్తామని వైదులు తెలిపారు.

## వీఎస్‌యూ పీజీ కళాశాలలో విచారణ వాయిదా

కావలిటౌన్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): విక్రమ సింహపురి యూనివర్శిటీ కావలి పీజీ కళాశాలలో చోటుచేసుకున్న పలు సంఘటనలకు సంబంధించిన ఆరోపణలపై బుధవారం జరగాల్సిన త్రిసభ్య కమిటీ విచారణ వాయిదా పడింది. త్రిసభ్య కమిటీలో సభ్యులు అందుబాటులో లేనందున విచారణ వాయిదా పడిందని, మరో వారం లోపల యూనివర్శిటీ అధికారులు విచారణ తేదీని ప్రకటిస్తారని ప్రిన్సిపాల్ తెలిపారు.

# అద్దె భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు

- ఇరుకు గదుల్లో చిన్నారుల అవస్థలు

వలేటివారిపాలెం, మార్చి (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో నిర్వహిస్తుండడంతో చిన్నారులు, సిబ్బంది అవస్థలు పడుతున్నారు. మండలంలో మొత్తం 53 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. అందులో 21 అంగన్‌వాడీ కేంద్రాలకు మాత్రమే సొంత భవనాలు ఉన్నాయి. మిగిలినవి అద్దె భవనాల్లో, శిథిల పాఠశాలల్లో ఇరుకు గదుల్లో నిర్వహిస్తున్నారు. అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న కేంద్రాలకు ప్రభుత్వం ప్రతి నెలా వేల రూపాయలు అద్దెలు చెల్లిస్తోంది. గత వైసీపీ ప్రభుత్వం నాడు - నేడు రెండవ విడత కింద మండలంలోని లింగపాలెం, బంగారక్కపాలెం గ్రామాల్లో అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలు ప్రారంభించింది. అయితే అవి ఇప్పటికీ నిర్మాణ దశలోనే ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వీటిపై దృష్టి సారించి నిర్మాణ పనులు పూర్తిచేసి చిన్నారుల అవస్థలను తొలగించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


బంగారక్కపాలెంలో అర్థాంతరంగా నిలిచిన అంగన్‌వాడీ భవనం


లింగపాలెంలో గోడల దశలోనే నిలిచిపోయిన అంగన్‌వాడీ భవనం

## సింహ వాహనంపై శ్రీహరి చిద్విలాసం

కావలిటౌన్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కచ్చేరిమిట్టలో వెలసివున్న వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆలయ ప్రధాన అర్చకులు బుర్రా శేషాచార్యులు, అర్చక బృందం బుధవారం ఉదయం హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి శ్రీవారు సింహ వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ పెద్దలు తిరివీధి బ్రహ్మయ్య, తిరివీధి ప్రసాద్, అన్నవరం హనుమకుమార్, నరహరి తదితరులు పాల్గొన్నారు.


సింహ వాహనంపై ఊరేగుతున్న శ్రీవారు

## విభేదాలు వీడి టీడీపీ నేతల నవ్వుల హరివిల్లు

కావలి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు కుమార్తె హరిప్రియ వివాహ వేడుకలో టీడీపీ అగ్రనేతల నవ్వుల హరివిల్లు అందరినీ ఆకట్టుకున్నాయి. ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డిల మధ్యలో కావలి నియోజకవర్గ టీడీపీ మాజీ ఇన్‌చార్జి మాలేపాటి సుబ్బానాయుడు కూర్చుని ఉండగా వారి పక్కన ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు కూర్చున్నారు. తొలుత బీద రవిచంద్ర, క్రిష్ణారెడ్డిలు పక్కపక్కనే కూర్చుని ఉండగా కొంత సేపటికి మాలేపాటి సుబ్బానాయుడు అక్కడకు చేరుకున్నారు. దీంతో ఆయనను ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి ఆహ్వానించి వారి మధ్యలో కూర్చోపెట్టుకున్నారు. అయితే అంతవరకు బాగానే ఉన్నా ఆ తర్వాత వారు ముగ్గురు ఆనందంగా నవ్వుకోవడం దానిని బొల్లినేని ఆస్వాదించడం వివాహ వేడుకలలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అయితే వారు ఏమి మాట్లాడుకున్నారో...ఎందుకు నవ్వుకున్నారో ఎవరికీ తెలియదు కానీ ఎడమోహం, పెడ మొహంగా ఉండిన క్రిష్ణారెడ్డి, మాలేపాటిలు ఆనందంగా నవ్వుకోవడం మాత్రం టీడీపీ శ్రేణులలో ఉత్సాహాన్ని నింపింది. అయితే ఆ నవ్వులు అంత వరకేనా.. పూర్తిగా కొనసాగుతాయా అనేది రాజకీయ వర్గాలలో చర్చనీయాంశమైంది.


బీద రవిచంద్ర, కావ్య క్రిష్ణారెడ్డి మధ్యలో మాలేపాటిల నవ్వుల హరివిల్లు

## నియోజకవర్గ వ్యాప్తంగా అభివృద్ధి మండలి సమావేశాలు

- మాజీ ఎమ్మెల్యే దివి శివరాం

కందుకూరు, మార్చి 12(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ వ్యాప్తంగా అభివృద్ధి మండలి కార్యకలాపాలను విస్తరించటం లక్ష్యంగా గ్రామగ్రామానా సమావేశాల నిర్వహణకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే, మండలి అధ్యక్షుడు దివి శివరాం తెలిపారు. బుధవారం సాయంత్రం పట్టణంలోని కోర్టు భవనాల సముదాయంలో బార్ అసోసియేషన్ హాలులో న్యాయవాదులతో సమావేశం ఏర్పాటుచేశారు. న్యాయవాదులు అధికసంఖ్యలో పాల్గొన్న ఈ సమావేశంలో శివరాం మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి కృషిచేయాలన్న లక్ష్యంతోనే ఈ అభివృద్ధి మండలి ఏర్పడిందని, అన్నివర్గాల ప్రజలను ఇందులో భాగస్వామ్యం చేయడం ద్వారా తగిన సలహాలు, సూచనల కోసం సమావేశాలు నిర్వహిస్తున్నామని, న్యాయవాదులూ కలిసిరావాలని విజ్ఞప్తిచేశారు. దీంతో వారు అంగీకరించారు. ఈ సందర్భంగా అభివృద్ధి మండలి ఆధ్వర్యంలో గత కొద్దినెలలుగా వివిధ సమస్యల పరిష్కారం కోసం, ప్రజావ్యతిరేక నిర్ణయాలను వ్యతిరేకిస్తూ చేసిన పోరాటాలను శివరాం వివరించారు. ఈ సమావేశంలో ప్రముఖ వ్యాపారి కొల్లూరి కొండయ్య, న్యాయవాదులు వీవీ సుబ్బారావు, పి సంపత్‌కుమార్, బెజవాడ కృష్ణయ్యచౌదరి, సీహెచ్ హరికృష్ణ, శ్రీధర్ నాయుడు, బీవీ మురళీకృష్ణ, ప్రసాదరెడ్డి, అభివృద్ధి మండలి ప్రతినిధులు పాలేటి కోటేశ్వరరావు, తోకల వెంకటేశ్వర్లు, చింతరబోయిన నరేష్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో న్యాయవాదులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దివి శివరాం తదితరులు


చుండి బస్టాండు సెంటరులో వృథాగా పోతున్న మంచినీరు

## రక్షిత మంచినీటి పైప్‌లైన్ లీకేజీ

- వృథా అవుతున్న మంచినీరు

వలేటివారిపాలెం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చుండి బస్టాండు సెంటరులో చుండి - చెర్లోపాలెం రక్షిత మంచినీటి పైప్‌లైన్ లీకేజీతో గత నాలుగైదు నెలల నుండి తాగునీరు వృథాగా పోతున్నా పట్టించుకునే నాథుడే లేడని గ్రామస్థులు విమర్శిస్తున్నారు. పైప్‌లైన్ లీకేజీతో వృథాగా పోతున్న తాగునీరు బస్టాండు సెంటరులో నిల్వ ఉండి చిన్న నీటి కుంటను తలపిస్తోంది. దోమలు పెరిగి దుర్గంధం వెదజల్లుతోంది. వాహనాల రాకపోకల సమయాలలో మురుగునీరు పాదచారులపై పడుతుండడంతో ఇబ్బందులు పడుతున్నారు. అంతేగాకుండా దిగువనున్న గ్రామాలకు తాగునీరు పూర్తిస్థాయిలో సరఫరా కావడం లేదు. దీంతో గ్రామస్థులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పైప్‌లైన్ లీకేజీని అరికట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## జనసేన 12వ ఆవిర్భావ దినోత్సవ సభకు తరలిరండి

కొండాపురం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఈనెల 14వ తేదీన తూర్పుగోదావరి జిల్లా పిఠాపురంలో జరగనున్న జనసేన 12వ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేసేందుకు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆపార్టీ మండల ఉపాధ్యక్షుడు కాకుటూరు రాఘవేంద్ర, భీమవరప్పాడు జనసేన నాయకుడు తిప్పినేని రమేష్ పార్టీ శ్రేణులను కోరారు. ఈ మేరకు బుధవారం కొండాపురంలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ అధ్యక్షతన జరగనున్న సభకు మండలంలోని అన్ని గ్రామాల జనసేన నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు డి.మహేంద్ర, టి.మాల్యాద్రి, కిషోర్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.


పవన్‌కళ్యాణ్ ఉన్న పోస్టరును విడుదల చేస్తున్న జనసేన నాయకులు

## ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు

- సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ

వలేటివారిపాలెం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయనున్నట్లు కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ తెలిపారు. ఆ భూమి మాది కాదు... అబ్బే మాది కాదు.. అని మార్చి 2వ తేదీన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ స్పందించారు. మండలంలోని అయ్యవారిపల్లెలో జాతీయ రహదారి పక్కన ఆక్రమణలకు గురైన సర్వే నెంబర్ 4, సర్వేనెంబర్ 118లోని ప్రభుత్వ భూములను బుధవారం ఆమె పరిశీలించారు. ఆసర్వే నెంబర్లలోని ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూములను జాయింట్ సర్వే నిర్వహించాలని సూచించారు. అంతేగాకుండా ప్రభుత్వ భూముల్లో ఏర్పాటుచేసిన ఇటుక బట్టీలను తక్షణమే తొలగించాలని, లేదంటే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కోట్లాది రూపాయలు విలువ కలిగిన ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురవుతున్నా యని, ప్రభుత్వ భూములను రక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఆమె తెలిపారు. వీఆర్వోలు, సర్వేయర్లు స్థానికంగా ఉంటూ క్షేత్రస్థాయిలో పరిశీలిం చాలన్నారు. ఆమె వెంట తహసీల్దార్ అబ్దుల్ అమీద్, సర్వేయర్ సింగయ్య, వీఆర్వో నారాయణ ఉన్నారు.



అయ్యవారిపల్లెలో ప్రభుత్వ భూములను పరిశీలిస్తున్న కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ

## 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

కొండాపురం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థినీ, విద్యార్థులకు బుధవారం పరీక్ష సామగ్రిని అందచేశారు. ఎస్ఎంసీ చైర్మన్ పొదిలి లక్షణ్ సౌజన్యంతో మండల పరిషత్ మాజీ వైస్ చైర్మన్ పోలినేని చంద్రబాబునాయుడు చేతుల మీదుగా 32 మంది విద్యార్థులకు అందచేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రెహమాన్, పొదిలి రాము, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందచేస్తున్న నాయకులు

## సోమశిలలో నిపుణుల కమిటీ పరిశీలన

అనంతసాగరం మార్చి 12 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయాన్ని నిపుణుల కమిటీ సభ్యులు బుధవారం పరిశీలించారు. డ్యాం క్రస్ట్‌గేట్లు అధ్వానంగా ఉన్న నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాలతో కృష్ణ రివర్ మేనేజ్మెంట్ కమిటీ సభ్యుడు బీఎం రాయ్‌పూర్, ఎస్ఈ వెంకట రమణారెడ్డి ఇతర అధికారులు గేట్లు, కంట్రోల్ గది, కండలేరు, ఉత్తర, దక్షిణ కాలువ గేట్ల పటిష్టతను పరిశీలించారు. నీటి నిల్వ, సరఫరా వివరాలు స్థానిక ఇంజనీర్లను అడిగి తెలుసుకున్నారు. వారికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు కమిటీ చైర్మన్ వేలూరు కేశవ చౌదరి, ఈఈ, దశరథ రామిరెడ్డి జేఈలో పాల్గొన్నారు. కాగా, సోమశిల జలాశయంలో బుధవారం నాటికి 56.030 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డెల్టాకు 1,150, ఉత్తర కాలువకు 550, దక్షిణ కాలువకు 350, కండలేరుకు 200 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు.

## వైసీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

లింగసముద్రం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బుధవారం లింగసముద్రంలో ఆ పార్టీ మండల కన్వీనర్ నోటి వెంకటేశ్వరరెడ్డి పార్టీ జెండా ఎగురవేసి కేక్ కట్ చేసి పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్ర మంలో వైసీపీ నాయకులు, సర్పంచులు డి మల్లికార్జున, పులి రాఘవులు, కోఆప్షన్ సభ్యులు షేక్ షఫి, జి చెంచురామయ్య, ఎంపీటీసీ దగ్గు వెంకటేశ్వర్లు, జి మహేంద్ర, కె ప్రసాద్, చీమల శ్రీనివాసులు, కె పోతులూరయ్య తదితరులు పాల్గొన్నారు.

# బుడంగుంటలో సమస్యల తిష్ఠ!

- పూడికతీతకు నోచుకోని మురుగు నీటి కాలువలు
- కుళాయిల్లో మొక్కుబడిగా మంచినీటి సరఫరా
- ప్రజలకు తప్పని ఇక్కట్లు

కావలి రూరల్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణ పరిధిలోని బుడంగుంట కాలనీలో సమస్యలు తిష్ఠ వేశాయి. కనీస మౌలిక వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణానికి కూతవేటు దూరంలో పేదలు నివశించే ఈ కాలనీలో ఏళ్ల తరబడి మురుగు నీటి కాలువలు పూడికతీతకు నోచుకోక పోవడంతో కాలువలు మట్టి, పిచ్చి మొక్కలతో నిండిపోయాయి. దీంతో మురుగు నీటి సరఫరా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. వేసవి రాక ముందే నీళ్ల కష్టాలు తప్ప డం లేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీధుల్లో కుళా యిలు ఏర్పాటు చేసినప్పటికి రోజు మార్చి రోజు అరకొరగా నీటి సరఫరా జరుగుతుండడం, ఒక్కో ఇంటికి 10 బిందెలు కూడా నీరు రాకపోవడంతో కుళాయిల వద్ద మహిళలు నిత్యం గొడవలు పడుతున్నారు. వేసవి రాకముందే తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడాల్సివస్తుందని అధికారులు, పాలకులు స్పందించి కాలనీలో ఇబ్బందులు తొలగించటంతో పాటు మౌలిక వసతులు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

పిచ్చి మొక్కలతో కనిపించని మురుగునీటి కాలువ




తాగునీటి కోసం ఖాళీ బిందెలతో నిరీక్షిస్తున్న మహిళలు

### కాలువలు పూడి పోయాయి



నివాసాలల్లోని మురుగు నీరు పోయేందుకు మార్గం లేదు. ఏడాదికి ఒక్కసారి కూడా కాలువలు పూడిక తీత చేపట్టక పోవటంతో కాలువలు పూడి పోయాయి. వీధులు కూడా శుభ్రపర్చక పోవటంతో కాలనీలో చెత్తాచెదారాలతో కంపుకొడుతున్నాయి.

- దేవరకొండ పద్మమ్మ

### నీటి కోసం కొట్టుకుంటున్నారు



కాలనీలోని కుళాయిల్లో అర కొరగా తాగునీటి సరఫరా జరుగు తుంది. ఒక్కో ఇంటికి 10 బిందెలు కూడా రాకపోవటంతో పాటు కుళాయిల్లో నీరు సన్నగా వస్తుండటంతో గంటల కొద్ది కుళాయిల వద్ద నిరీక్షించాల్సి వస్తుంది. దీని కొసం మహిళలు కొట్టుకుంటున్నారు.

- మల్లవరపు భవాని

## జమ్మలపాలెం నుడా లేఔట్‌లో అదనపు భూసేకరణ

- కావలి ఆర్డీవో వంశీకృష్ణ

జలదంకి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని జమ్మలపాలెం నుడా ఎంఐజీ లేఔట్ విస్తరణలో భాగంగా అదనపు భూసేకరణ చేయనున్నట్లు కావలి ఆర్డీవో వంశీకృష్ణ తెలిపారు. ఈ భూసేకరణకు సంబంధించి బుధవారం ఆయన స్థానిక తహసీల్దారు కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో సమీక్షించారు. అనంతరం గతంలో ఇదే లేఔట్‌కు భూసేకరణ చేయగా పలు కారణాలతో 23మంది లబ్ధిదారులకు భూపరిహారం అందక పోవడంపై చర్చించారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల తరుపున జమ్మలపాలెం మాజీసర్పంచు నక్కా మాధవరావు పలు సమస్యలను ఆర్డీవో దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఆరీవో విలేకరులతో మాట్లాడుతూ గతంలో నుడా లేఔట్‌లో భూములు కోల్పోయిన భూయజమానులకు కోర్టు కేసులు త్వరితగతిన పరిష్కరింపజేసి పరిహారం అందిస్తామన్నారు. ఈ సమావేశంలో తహసీల్దారు ప్రమీల, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కావలి ఆర్డీవో వంశీకృష్ణ

## రాళ్లపాడు ప్రాజెక్టు కార్యాలయాలు ఎప్పుడు తెరుచుకుంటాయో!

- పిచ్చిమొక్కలతో నిండిన కార్యాలయ ఆవరణ

లింగసముద్రం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రాళ్లపాడు ప్రాజెక్టుకు చెందిన కార్యాలయాలు అప్పడప్పుడు మాత్రమే తెరుచుకుంటున్నాయని, కార్యాలయ ఆవరణ పిచ్చిమొక్కలతో నిండిపోయినా పట్టించుకునే నాథుడే లేడన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పెంట్రాల పంచాయతీలో రాళ్లపాడు క్వార్టర్స్ వద్ద శిథిలస్థితిలో ఉన్న ప్రాజెక్టు సబ్ డివిజన్-1, సబ్ డివిజన్-2 కార్యాలయాలను తొలగించి, అధికారులు, 2012వ సంవత్సరంలో జైకా నిధులతో నూతన భవనాలను నిర్మించారు. ఈ కార్యాలయాలలో జూనియర్ అసిస్టెంట్, అటెండరు విధులు నిర్వహిం చాల్సి ఉంది. మొదట్లో వీరు విధులకు సక్రమంగా హాజరయ్యే వారు. అయితే రాను రాను ఈ కార్యాల యాలకు సిబ్బంది రావడమే మానేశారు. అప్పడప్పుడు జూనియర్ అసిస్టెంటు వచ్చి వెళుతున్నారు. వీరు ఎక్కువగా కందుకూరు ఇరిగేషన్ కార్యాల యంలో విధులు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. కాగా, కార్యాలయం ఆవరణ పిచ్చిమొక్కలతో నిండి పోయిందని అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


మూతపడి ఉన్న రాళ్లపాడు ప్రాజెక్టు కార్యాలయం

# స్వర్ణాంధ్ర - 2047

● వర్క్‌షాప్‌లో కలెక్టర్ ఆనంద్

# ప్రణాళిక తయారీపై శ్రద్ధ పెట్టండి

నెల్లూరు (హరనాథపురం), మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : స్వర్ణాంధ్ర - 2047 ప్రణాళిక తయారీలో ప్రత్యేక అధికారులు అత్యంత శ్రద్ధ తీసుకోవా లని కలెక్టర్ ఓ ఆనంద్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లోని తిక్కన భవన్‌లో స్వర్ణాంధ్ర -2047 యాక్షన్ ప్లాన్‌ను నియోజకవర్గ స్థాయిలో తయారు చేసేందుకు సీపీవో నరసింహులు ఆధ్వర్యంలో వర్క్ షాపు జరిగింది. ఇందులో కలెక్టర్ మాట్లాడుతూ రాబోయే ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన 15 శాతం వృద్ధి లక్ష్యాన్ని సాధించేలా ప్రణాళిక తయారు చేయాలని సూచించారు. ప్రజల ఆరోగ్యం, ఆనందం, సంపద సృష్టితో పాటు స్థిరమైన వృద్ధి రేటే లక్ష్యమని



వర్క్‌షాపులో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

చెప్పారు. నియోజక వర్గానికి ప్రత్యేకంగా అధికారుల వ్యవస్థ లేనందున మండల, జిల్లా స్థాయి విజన్ ప్లాన్ రూపొం దించినట్లుగానే నియోజక వర్గాలకూ ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ముఖ్యంగా మౌలిక వసతుల అభివృద్ధిలో భాగం గా ప్రాంతీయ రహదారుల విస్తరణ, రవాణా వ్యవస్థ మెరుగు దల, ప్రతి ఇంటికి శుద్ధి చేసిన నీరు అందించడం, గ్రామీ ణ, పట్టణ విద్యుత్ సరఫరా మెరుగుపర్చడం, వంద శాతం విద్యుదీకరణ లక్ష్యంగా ఉండాలన్నారు. స్థానిక పరిశ్రమలను, ఎంఎస్ఎంఈ లను ప్రోత్సహించాల న్నారు. ప్రతి గ్రామంలో పాఠశా లలు, స్మార్ట్ క్లాసులు, డిజిట ల్ విద్య, ఈలెర్నింగ్ ప్లాట్‌ఫామ్‌లు, ఇంటర్నే షనల్ స్థాయిలో పరిశో ధన సంస్థల ఏర్పాటును ప్రోత్సహించా లని దిశానిర్దేశం చేశారు. ఈ వర్క్ షాపులో నెల్లూరు మున్సిపల్ కమిషనర్ సూర్యతేజ, నెల్లూరు, ఆత్మకూరు, కావలి ఆర్డీవోలు అనూష, పావని, వంశీకృష్ణ, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

### స్టాటిస్టికల్, సర్వే సొసైటీని ప్రారంభించిన కలెక్టర్

నెల్లూరు (హరనాథపురం), (ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్ ఆవరణలోని గోల్డెన్ జూబ్లీ హాల్లో బుధవారం నెల్లూరు జిల్లా రెవెన్యూ, స్టాటిస్టికల్, సర్వే ఎంప్లాయిస్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కోపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్‌ను కలెక్టర్ ఓ ఆనంద్ ప్రారంభించారు. కార్యక్ర మంలో డీఆర్వో ఉదయభాస్కర్‌రావు, సొసైటీ అధ్యక్షుడు చొప్పా రవీంద్ర బాబు, గౌరవ సలహాదారు దూబగుంట మధుసూదన శర్మ, కార్యదర్శి శేషయ్య, కోశాధికారి ఆర్ శ్రీనివాసులు, డైరెక్టర్ పై నాగశేఖర్, శ్యామ్ కుమార్, సూర్యనారాయణ, జయజయరావు, సతీష్‌కుమార్, ఈశ్వరమ్మ, రిటైర్డ్ రెవెన్యూ, స్టాటిస్టిక్స్ సర్వే ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

### బీఈడీ పరీక్షలకు 72 మంది గైర్హాజరు

వెంకటాచలం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశాలలో బుధవారం జరిగిన బీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షలకు 72 మంది గైర్హాజరైనట్లు వీఎస్‌యూ పరీక్షల నిర్వాహణాధికారి డాక్టర్ ఆర్ మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం జరిగిన పరీక్షలకు 965 మంది విద్యార్థులకు 893 మంది హాజరయ్యారని పేర్కొన్నారు.

**డిగ్రీ పరీక్షలకు 449 మంది..**

విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశాలలో బుధవారం జరిగిన డిగ్రీ 4వ సెమిస్టర్ రెగ్యులర్, 6వ సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షలకు 449 మంది గైర్హాజరైనట్లు వీఎస్‌యూ పరీక్షల నిర్వాహణాధికారి డాక్టర్ ఆర్ మధుమతి తెలిపారు. ఉదయం జరిగిన డిగ్రీ 6వ సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షలకు 55 మందికి గాను 47 మంది హాజరు కాగా 8 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. మధ్యాహ్నం జరిగిన డిగ్రీ 4వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలకు 7,573 మంది విద్యార్థులకు 7132 మంది హాజరు కాగా 441 మంది గైర్హాజరయ్యారన్నారు.

### వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్‌లో పాల్గొనండి

● కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(విద్య), మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్‌లో యువత పాల్గొనాలని కలెక్టర్ ఓ ఆనంద్ పిలుపునిచ్చారు. కలెక్టర్ కార్యాలయంలో బుధవారం యూత్ పార్లమెంట్‌కు సంబంధించిన గోడ పత్రికలను ఆవిష్కరించి మాట్లాడారు. 18 నుంచి 25 సంవత్సరాల వయసు కలిగిన యువతీ, యువకులు మైభారత్ పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకోవాలన్నారు. భారత్‌పై మీ ఆలోచనలు ఏమిటో ఒక నిమిషం వీడియోను చిత్రీకరించి యూత్‌పార్లమెంట్ నెల్లూరు నోడల్ డిస్ట్రిక్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన 150 మందిని ఎంపికచేసి జిల్లా స్థాయిలో మౌఖికంగా వన్ నేషన్ - వన్ ఎలక్షన్ అనే అంశంపై మాట్లాడే అవకాశం కల్పిస్తారని చెప్పారు. వారిలో పది మందిని ఎంపిక చేసి రాష్ట్ర యూత్ పార్లమెంట్‌కు పంపిస్తారన్నారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచిన ముగ్గురిని జాతీయ స్థాయికి ఎంపిక చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో వీఎస్‌యూ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ ఉదయ్‌శంకర్ అల్లం, ఎన్‌వైకే యూత్ ఆఫీసర్ డాక్టర్ ఏ మహేంద్రరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### సింహపురి ప్రీమియం లీగ్‌కు సన్నాహాలు

● 20న క్రీడాకారుల వేలం

నెల్లూరు(విద్య), మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్, నెల్లూరు జిల్లా క్రికెట్ సంఘం సహకారంతో సింహపురి ప్రీమియర్ లీగ్ టీ-20 క్రికెట్ నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నట్లు టోర్నీ నిర్వాహ కుడు వంశీధర్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బుజ బుజ నెల్లూరులోని సీఏఏ క్రీడామైదానంలో ఏప్రిల్ 2 నుంచి 12వతేదీ వరకు జరిగే ఈ టోర్నీకి సంబంధించి జిల్లాలో మొత్తం 8 జట్లు పాల్గొంటున్నాయన్నారు. ఔత్సాహికులైన యువతను మరింత ప్రోత్సహించేందుకు, వారిలోని క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు ఈ టోర్నీ ఎంతో ఉప యోగపడుతుందని తెలిపారు. ఈ నెల 16వతేదీన సీఏఏ క్రికెట్ మైదానంలో ఉదయం 9 గంటలకు నెట్స్ ఎంపికలు జరుగుతాయని, 16 నుంచి 30 ఏళ్లలోపు యువత హాజరుకావచ్చని పేర్కొన్నారు. వారిలో ప్రతిభ చూపిన వారి జాబితాతో ఈనెల 20న వేలం నిర్వహిస్తారని, క్రీడాకారులను ఆయా జట్ల నిర్వా హకులు కొనుగోలు చేస్తారని తెలిపారు.

### ధాన్యాన్ని మద్దతు ధరకు విక్రయించుకోండి

● కొనుగోలు కేంద్రం పరిశీలించిన కలెక్టర్ ఆనంద్

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రైతులు తమ ధాన్యాన్ని దళారులు, మిల్లర్లకు తక్కువ ధరకు విక్రయించి నష్టపోకుండా ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి ప్రభుత్వం కల్పించిన మద్దతు ధర పొందాలని కలెక్టర్ ఓ.ఆనంద్ సూచించారు. బుధవారం ఆయన మండలం లోని రేబాల రైతు సేవా కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు



రేబాల ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ ఆనంద్

ఎదైనా సమస్యలుంటే కొనుగోలు కేంద్రాల్లో వ్యవసాయశాఖ సిబ్బంది, టెక్నికల్ అసిస్టెంట్లు, సివిల్ సప్లైస్ అధికారులు, తహసీల్దారు, కోఆపరేటివ్ అధికారులను సంప్రదిస్తే పరిష్కరిస్తారని తెలిపారు. జిల్లా లోని 38 మండలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేసి ధాన్యం సేకరిస్తున్నట్లు తెలిపారు. పలు చోట్ల ఎదురవుతున్న చిన్న చిన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ రైతాంగానికి 24 గంటల్లో నగదు బ్యాంకు ఖాతాకు జమ చేస్తున్నట్లు తెలిపారు. కాగా రైతుల అభ్యర్థన మేరకు జీపీఎస్ లేని వాహ నాలు తెచ్చుకున్నా వాటి ద్వారానే మిల్లుకు ధాన్యం రవాణా చేసేలా చర్యలు చేపట్టాలని కొనుగోలు కేంద్రాల అధికారులను ఆదేశించారు. అనంతరం ఇస్కపాళెం రెవెన్యూ పరిధిలోని ఇస్కపాళెం పల్లాప్రోలు గ్రామ పరిధిలో చేపడుతున్న రీసర్వేని పరిశీలించారు. రీ సర్వేలో, సాదా బైనామాలో ఉన్న సమస్య లపై ఎలాంటి అభ్యంతరాలు లేకుంటే తక్షణం పరిష్కరించాలని తహసీల్దార్‌కు సూచించారు. కలెక్టర్ వెంట డీసీవో గురప్ప, సివిల్ సప్లైస్ డీఎం అర్జున్‌రావు, పౌర సంబంధాల శాఖ డీడీ సదారావు, తహసీల్దారు అంబటి వెంకటేశ్వర్లు, జిల్లా సర్వే ఏడీ నాగశేఖర్, డిప్యూటి సర్వే ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణరెడ్డి, మండల వ్యవసాయాధికారి సురేంద్రరెడ్డి, వవ్వేరు, బుచ్చి బ్యాంకుల సీఈవోలు ఎం.శ్రీనివాసులు, సురేష్‌రెడ్డి, మండల సర్వేయర్ శ్రీనివాసులు రెడ్డి, తదితరులు ఉన్నారు.

### రాజ్యాంగ హక్కుల రక్షణకు కృషి

● పశుసంవర్థక శాఖ జేడీ రమేష్ నాయక్

నెల్లూరు(వ్యవసాయం), మార్చి 12 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగం ఎస్సీ, ఎస్టీలకు కల్పించిన హక్కులను కాపాడేందుకు తనవంతు కృషి చేస్తానని పశుసంవర్థకశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కే రమేష్ నాయక్ పేర్కొన్నారు. జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా జిల్లా ఆఫీసర్స్ విభాగం నుంచి ఎన్నికైన సందర్భంగా జేడీని పశువైద్య అధికారుల సంఘం నాయకులు ఆయన కార్యాలయంలో బుధవారం సన్మానించారు. కార్యక్రమంలో ఆ శాఖ డీడీలు ఎం నాగమణి, టీ సోమయ్య, కోవూరు డీఎల్‌డీఏ కార్యనిర్వహణాధికారి డీ శ్రీనివాసరావు, నెల్లూరు, తిరుపతి జిల్లాల పశువైద్యాధికారుల సంఘం అధ్యక్షులు ప్రసాద్, కృష్ణారావు, గజిటెడ్ ఆఫీసర్స్ నాయకుడు తిరుమలేశ్ పాల్గొన్నారు.



జేడీ రమేష్ నాయక్‌ను సన్మానించి అభినందిస్తున్న పశువైద్య అధికారుల సంఘం నాయకులు



ఛూమిలో విత్తనం వేసేటప్పుడు రైతు ఎన్నో కలలుకంటాడు. మొలకెత్తినప్పటి నుంచి పైరును కంటికి రెప్పలా కాపాడుకుంటాడు. అతివృష్టి, అనావృష్టి, చీడపీడల నుంచి పంటను కాపాడుకున్నా చివరకు ఆశించిన స్థాయిలో దిగుబడి, ధర ఉండదు. పసుపు రైతుల పరిస్థితి కూడా ఇలాగే ఉంది. గతేడాది దిగుబడి, ధర రికార్డుస్థాయిలో ఉండగా ఈ ఏడాది తలకిందుల య్యింది. కనీసం పెట్టుబడులు కూడా అందుతాయో లేదోనన్న దిగులు సాగుదారుల్లో నెలకొంది.

- ఉదయగిరి, (ఆంధ్రజ్యోతి)



తవ్వకం అనంతరం పసుపు గొమ్ములను ఏరుతున్న కూలీలు

# పసుపు.. పరేషాన్!

● తెగుళ్ల విజృంభణ.. దిగుబడిపై ప్రభావం

● గతేడాదికంటే సగానికి పడిపోయిన ధర

● లబోదిబోమంటున్న సాగుదారులు

జిల్లాలో ఎక్కడాలేని విధంగా ఉదయగిరి మండలంలో ఐదు దశాబ్దాల నుంచి రైతులు పసుపును సాగు చేస్తున్నారు. అలాగే వరికుంటపాడు, సీతారామపురం, వింజమూరు, అనంతసాగరం, ఇందుకూరుపేట తదితర మండలాల్లోనూ పసుపు సాగులో ఉంది. గతేడాది పసుపు ధర రికార్డు స్థాయిలో పలకడంతో ఈ ఏడాది సాగు మానిన రైతులు సైతం పంట సాగు చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 600 ఎకరాల్లో పసుపు సాగు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. తొమ్మిది నెలల కాలం కలిగిన ఎకరా పసుపు సాగుకు దుక్కం, ఎరు వులు, విత్తనం, ఇతరత్రా ఖర్చులు కలిపి సుమారు రూ.1.5 లక్షల ఖర్చువుతుందని రైతులు తెలుపుతున్నారు.

● దిగజారిన ధర, దిగుబడి

గత కొన్నేళ్లుగా మార్కెట్‌లో పసుపు దిగుబడులకు ఆశించిన ధరలు లేవు. గతేడాది రికార్డుస్థాయిలో క్వింటం పసుపు ధర రూ.15 వేలు పలి కింది. అయితే ఈ ఏడాది క్వింటం రూ.8-9 వేలకు దిగజారింది. దీనికి తోడు పంట కు దుంపకుళ్లు తెగులు విజృంభించడంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపింది. ఎకరాకు 35 నుంచి 40 క్వింటాళ్ల దిగు బడి రావాల్సి ఉండగా 25 నుంచి 30 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వస్తోందని రైతులు వాపోతున్నారు. ఈ దిగుబడి, ధరతో తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతులు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధరతో పసుపు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవా లని రైతు సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు.

**పెట్టుబడులు కూడా కష్టమే**



పసుపు పంటకు దుంపకుళ్లు తెగులు సోకడంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపింది. ఎకరాకు 25 నుంచి 30 క్వింటాళ్లు మాత్రమే దిగుబడి వచ్చింది. కొంతమంది రైతులకు అదీ కూడా లేదు. గతేడాది క్వింటం పసుపు రూ.15 వేలు ఉండగా, ప్రస్తుతం రూ.8 వేలు పలుకుతోంది. ఈ పరిస్థితుల్లో పెట్టుబడులు కూడా రావు. ప్రభుత్వం స్పందించి పసుపు రైతులను ఆదుకోవాలి.

- కాకు వెంకటయ్య, రైతు, కృష్ణారెడ్డిపల్లి

### మాస్ కాపీయింగ్‌ను ప్రోత్సహిస్తే చర్యలు

● ఓపెన్ స్కూల్ ఇంటర్ పరీక్ష కేంద్రాల్లో ఆర్‌జేడీ తనిఖీ

కావలి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఓపెన్ స్కూల్ ఇంటర్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌ను ప్రోత్సహిస్తే శాఖాపరమైన కఠిన చర్యలు తప్పవని గుంటూరు ఆర్‌జేడీ లింగేశ్వరరెడ్డి హెచ్చరించారు. కావలి పట్టణంలో జరుగుతున్న 5 పరీక్ష కేంద్రాలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. 'అంతా ఓపెనే' అనే శీర్షికతో కావలిలో ఓపెన్ స్కూల్ ఇంటర్ పరీక్షలలో మాస్ కాపీయింగ్ జరుగుతున్న విషయం సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఆర్‌జేడీ కావలిలో తనిఖీలు చేపట్టారు. మాస్ కాపీయింగ్‌పై జిల్లా విద్యాశాఖాధికారి, స్థానిక విద్యాశాఖాధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. పరీక్ష కేంద్రాల్లో సహజంగా ఉన్న సిటింగ్ స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు కాకుండా అదనంగా స్థానికేతర అధికారులతో మరో సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్‌లను బుధవారం నియమించారు. కావలి మండల ఉపవిద్యాశాఖాధికారి హరిప్రసాద్ డివిజన్‌లోని మరో నలుగురు ఎంఈవోలతో కలిపి పరీక్షలు పగడ్బందీగా నిర్వహించేలా ఫైవ్ మ్యాన్ కమిటీని ఏర్పాటు చేశారు. కాగా బుధవారం ఆర్జేడీ కావలికి వస్తున్నారనే సమాచారం రావటంతో పరీక్ష కేంద్రాల్లో మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా ముందుగా అప్రమత్తమయ్యారు. ముందుగా ఆయన ఆర్‌జేడీ ఉపవిద్యాశాఖా ధికారి కార్యాలయంలో ఉపవిద్యాశాఖాధికారి హరిప్రసాద్, ఎంఈవోలు గోవిందయ్య, వెంకటసుబ్బయ్యలతో సమావేశమయ్యారు. విలేకర్లతో మాట్లాడుతూ పరీక్షల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేశామని చెప్పారు. మాస్ కాపీయింగ్‌కు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని, ఎవరినీ వదిలేది లేదని హెచ్చరించారు.



విద్యాశాఖ అధికారులతో సమావేశమైన గుంటూరు ఆర్‌జేడీ లింగేశ్వరరెడ్డి

### 'క్షయ' లక్ష్యం 100 శాతం పూర్తి చేయాలి

● జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలి

నెల్లూరు (వైద్యం), మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో క్షయవ్యాధి కేసుల గుర్తింపు, చికిత్స లక్ష్యాలను 100 శాతం పూర్తి చేయాలని జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలి ఆదేశించారు. బుధవారం ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాల, నారాయణ వైద్య కళాశాలల్లో క్షయవ్యాధిపై కోర్ కమిటీ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ రాబోయే మూడు నెలల్లో ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. క్షయ వ్యాధిని పూర్తిగా నివారించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం అనేక సూచనలు చేసిందని, వాటిని తప్పక పాటించాలని తెలిపారు.



మాట్లాడుతున్న అదనపు జిల్లా వైద్యాధికారి ఖాదర్‌వలి

# కిడ్నీ కలవరం!

పొదలకూరు మండలం ఊసరపల్లి గ్రామ జనాభాలో 60 శాతం మంది కిడ్నీ వ్యాధిగ్రస్తులున్నారు. తూర్పుయడవల్లి, సీతారామపురం, ఉదయగిరి, దుత్తలూరు, ఏఎస్‌పేట, తదితర మండలాల్లో కూడా వ్యాధిగ్రస్తుల సంఖ్య ఎక్కువే. నీటిలో ఫ్లోరిన్ శాతం అధికంగా ఉండడంతో ఈ వ్యాధి ప్రబలుతోంది. ఫ్లోరిన్ కారణంగా నొప్పులు ఎక్కువగా ఉండటం, వాటి నివారణకు పెయిన్ కిల్లర్లు వాడటం, అవి కిడ్నీపై ప్రభావం చూపడంతో మూత్రపిండ వ్యాధిగ్రస్తులు పెరుగుతున్నారు. ఫ్లోరైడ్ బాధితులే కాకుండా ఎవరూ కూడా వైద్యుల సూచనలేకుండా పెయిన్ కిల్లర్లు వాడొద్దని నిపుణులు సూచిస్తున్నారు.

● జిల్లాలో 82 వేల మందికిపైగా రోగులు


● 'ఎన్టీఆర్ వైద్యసేవ'తో 10 వేల మందికి డయాలసిస్

● 280కిపైగా కిడ్నీల మార్పిడి

● ఇప్పటికే 50 మంది మృతి

● నిర్లక్ష్యం చేస్తే ప్రాణాపాయమే

● నేడు ప్రపంచ కిడ్నీ వ్యాధుల నివారణ దినం



నెల్లూరు (వైద్యం), మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : మూత్రపిండాల వ్యాధులపై ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. ప్రస్తుత ఆహారపు అలవాట్లతోపాటు జీవనశైలిలో వస్తున్న అనేక మార్పుల వల్ల ఎంతో మంది కిడ్నీ వ్యాధుల బారిన పడుతున్నారు. అవగాహన లేకపోవడం, ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడంతో ఎంతో మంది ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. ప్రస్తుతం జిల్లాలో 82 వేలకు మందికిపైగా వ్యాధిగ్రస్తులు ఉన్నారు. వీరిలో ఎన్టీఆర్ వైద్యసేవ పథకం ద్వారా ఏటా 10 వేల మంది వరకు డయాలసిస్ చేయించుకుంటున్నారు. ఆ పథకం కిందకు రాని మరో 3వేల మందికిపైగా రోగులు కూడా డయాలసిస్ చేయించుకుంటున్నారు. ఇదిలా ఉంటే రెండు కిడ్నీలు చెడిపోయి 50 మందికి వరకు మృత్యువాత పడ్డారు. చిన్నారుల్లోనూ 10 శాతం మంది కిడ్నీ వ్యాధులకు గురికావడం ఆందోళన కలిగించే అంశం. ఈ నేపథ్యంలో ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ కిడ్నీ ఫౌండేషన్ ఏటా మార్చి 13వ తేదీన ప్రపంచ కిడ్నీవ్యాధుల నివారణ దినంగా జరుపుకోవాలని తీర్మానించింది.

**280 మందికి కిడ్నీ మార్పిడి**

జిల్లాలో 280కి కిడ్నీల మార్పిడి చికిత్సలు జరిగాయి. నారాయణ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, అపోలోతి, కిమ్స్, మెడికవర్ వంటి ఆసుపత్రుల్లో ఈ చికిత్సలు జరుగుతున్నాయి. కాగా, హృద్రోగుల్లో 40 శాతం మందికి కిడ్నీలు చెడిపోయే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. పూర్తిగా కిడ్నీ వ్యాధిని నివారించినా 10, 12 ఏళ్ల తరువాత మరలా వచ్చే అవకాశం ఉన్న దృష్ట్యా తప్పనిసరిగా ఆరు నెలలకొకసారి చికిత్సలు చేయించుకోవాలని సూచిస్తున్నారు.

● షుగర్.. బీపీ

మధుమేహం, రక్తపోటు కూడా కిడ్నీ వ్యాధులకు కారణమని వైద్యులు చెబుతున్నారు. అధిక చక్కెర శాతం కారణంగా మూత్రపిండాల్లో రక్తం వడపోత సామర్థ్యం తగ్గిపోతుందని, అలాగే ప్రొటీన్ల సంఖ్య విపరీతంగా తగ్గిపోయి క్రమేపి కిడ్నీలు విఫలమవుతాయని హెచ్చరిస్తున్నారు. మొత్తం వ్యాధిగ్రస్తుల్లో 40 శాతం మంది షుగర్, 30 శాతం మంది బీపీ వల్ల కిడ్నీ వ్యాధులకు గురవుతున్నట్లు అధ్యయనాలు చెబుతున్నాయి. ఇక వంశపారం పర్య కారణాలు, ఊబకాయం వల్ల కూడా కొందరు ఈ వ్యాధికి గురవుతున్నారు.



జీజీహెచ్‌లో కిడ్నీ డయాలసిస్ చేయించుకుంటున్న రోగులు

### ఇంటర్ పరీక్షలకు 23,907 మంది హాజరు

నెల్లూరు (విద్య), మార్చి 12 (ఆంధ్ర జ్యోతి) : ఇంటర్మీడి యట్ పరీక్షల్లో భాగంగా బుధ వారం ద్వితీయ సంవత్సరం విద్యా ర్థులకు ఫిజిక్స్-2, ఎకనామిక్స్-2, ఒకేషనల్ పరీక్షలు జరిగాయి. జిల్లా వ్యాప్తంగా 23,907 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఆర్ఐవో డాక్టర్ ఏ శ్రీనివాసులు ఆరు, డీవీఈవో రెండు, డీఈసీ ఐదు, ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్స్ 31 కేంద్రాలను పరిశీలించాయి.

**చికెన్ ధరలు**

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

| | కిలో |
|---|---|
| బాయిలర్ లైవ్ | 97 |
| లేయర్ లైవ్ | 90 |
| స్కిన్ చికెన్ | 180 |
| స్కిన్‌లెస్ | 200 |
| లేయర్ | 153 |

**బంగారం, వెండి ధరలు**

బంగారం (22 క్యారెట్లు)

| | |
|---|---|
| ఒక గ్రాము ధర | రూ.8307 |
| వెండి కిలో ధర | రూ. 100,700 |
| వెండి ఒక గ్రాము | రూ.103.70 |

# బస్సు షెల్టర్లు ఉన్నా.. లేనట్టే!

● బస్సులు ఆగేదొకచోట.. ఉండేది మరోచోట ● ఎండ.. వర్షంలో ప్రయాణికుల నిరీక్షణ



గొలగమూడి కూడలిలో శిథిలావస్థలో బస్ షెల్టర్



వెంకటాచలంలో కసుమూరు రోడ్డు కూడలికి దూరంగా నిరుపయోగంగా బస్సు షెల్టర్

వెంకటాచలం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): అధికారుల అనాలోచిత విధానాలతో నిర్మించే బస్సు షెల్టర్లు ప్రయాణికులకు ఉపయోగపడక నిరుపయోగంగా మారుతోన్నాయి. బస్సులు ఆగేదొకచోట.. షెల్టర్ మరోచోట ఉండడంతో ప్రయాణికులు బస్సుల కోసం ఎండైనా.. వర్షం వచ్చినా అక్కడే అవస్థలు పడుతూ నిరీక్షిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల మీదుగా వెళ్లే రహదారుల వెంట ఆయా పంచాయతీల పరిధిలో బస్సు షెల్టర్లు నిర్మిస్తారు. అయితే జాతీయ రహదారి పక్కన మాత్రం పరిస్థితి ఇందుకు విరుద్ధంగా ఉంది. జాతీయ రహదారి విస్తరణ సమయంలో సంబంధిత శాఖ వారు ప్రజల అనుకూలతను విస్మరించి ఎక్కడపడితే అక్కడ షెల్టర్లు నిర్మించారు. మరి కొన్ని చోట్ల అసలు వీటి నిర్మాణాన్ని విస్మరించారు. దీంతో బస్సు షెల్టర్లు ఉన్న చోట, లేని చోట ప్రజలు ఒకే రకంగా ఇబ్బందులు పడుతున్నారు. ఆయా గ్రామాల బ్రాంచి రోడ్లకు సమీపంలో కాకుండా ఒక ఫర్లాంగు దూరంలో షెల్టర్లను నిర్మించారు. అదే విధంగా వెంకటాచలంలోని సర్వేపల్లి రోడ్డు కూడలిలో అసలు షెల్టరే ఏర్పాటు చేయలేదు. దీంతో ప్రయాణికులు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ బస్సుల కోసం నిరీక్షిస్తున్నారు. ఇటువంటి చోట్ల ఆర్టీసీ వారు అయినా షెల్టర్లను ఏర్పాటు చేయాల్సి ఉండగా వారు కూడా పట్టించుకోవడం లేదు. సర్వేపల్లి, కసుమూరు ప్రాంత ప్రజలకు ఇది కూడలి కావడంతో నిత్యం నెలూరు, గూడూరు వైపు వందలాది మంది ప్రయాణికులు ప్రయాణించే క్రమంలో ఇక్కడ బస్సుల కోసం నిరీక్షిస్తుంటారు. ఇటు వంటి కూడలిలో బస్సు షెల్టర్లను నిర్మించకపోవడం పట్ల విమర్శలు వ్యక్తమవుతో న్నాయి. మండలంలోని కొన్ని గ్రామాల కూడళ్లలో బస్సు షెల్టర్లు ఉన్నప్పటికీ అవి అలంకారప్రాయంగా మారిపోయాయి. మరికొన్ని చోట్ల శిథిలావస్థకు చేరుకున్నాయి. వీటిని మరమ్మతులు చేసినట్లయితే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటాయి. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా జాతీయ రహదారుల శాఖ వారు జాతీయ రహదారి వెంట ప్ర తి గ్రామం వద్ద బస్సు షెల్టరును నిర్మించారు. ప్రయా ణికులు బస్సుల కోసం నిరీక్షించడానికి వీటిని రెండు వైపులా ఏర్పాటు చేశారు. అయితే ఈ షెల్టర్లు అవసర మైన చోట కాకుండా మరో చోట రోడ్ల కూడలికి ఒక ఫర్లాంగు దూరంలో నిర్మించారు. బస్సులు మాత్రం ఆ యా గ్రామాల రోడ్ల వద్దనే నిలుపుతున్నారు. దీంతో ప్రయాణిక లు కూడా అంతదూరం నడవ లేక బస్సు షెల్టర్ల వద్ద కాకుం డా తమ రోడ్డు కూడలి వద్దనే బస్సుల కోసం వేచి ఉంటున్నారు. దీంతో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన బస్సు షెల్టర్లు నిరుపయోగంగా ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు వీటిపై దృష్టి పెట్టాలని ప్రయాణి కులు కోరుతున్నారు.

### బస్సు షెల్టర్లు లేకపోవడం దారుణం



వెంకటాచలంలోని సర్వేపల్లి రోడ్డు కూడలిలో జాతీయ రహదారిపై రెండు వైపులా బస్సు షెల్టర్లు ఏర్పాటు చేయలేదు. అందువల్ల ప్రయాణికులు నిత్యం అవస్థలు పడుతుంటారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్న పిల్లలు ఎండ, వానలకు నిలబడలేక అగచాట్లు పడుతున్నారు. అధికారులు ప్రయాణికుల అవస్థలను ఇకనైనా గమనిస్తే మంచిది.

- ఉప్పు రాఘవేంద్ర, వడ్డిపాలెం గ్రామం, వెంకటాచలం

# బస్సు షెల్టర్‌లో పాముల పుట్టలు

ముత్తుకూరు, మార్చి 12(ఆంధ్రజ్యోతి): లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన బస్సు షెల్టర్లు వినియోగంలో లేక నిరుపయోగంగా మారాయి. సరైన ప్రణాళిక, ముందుచూపు లేకుండా ఎక్కడపడితే అక్కడ షెల్టర్లు నిర్మించారు. ప్రయాణికుల అవసరాలకు ఈ బస్సు షెల్టర్లు ఉపయోగపడకపోవడంతో వృథాగా మిగిలిపోయాయి. వాడుకలో లేని పలు బస్సు షెల్టర్లు మొదట్లో అసాంఘిక కార్యకలాపాలకు నెలవుగా మారాయి. కొంతకాలం తర్వాత పాడుబడిపోయిన బస్సు షెల్టర్లు పాముల పుట్టలకు నిలయంగా మారాయి. మల్లూరు సెంటర్‌లో షెల్టర్ ప్రధాన రహదారి కనిపించేందుకు అడ్డంగా మారి, ప్రమాదాలు జరుగుతున్నాయన్న కారణంతో పడగొట్టేశారు. పాటూరువారికండ్రిగ సెంటర్‌లో ఉన్న బస్ షెల్టర్‌లో ఏకంగా నాలుగైదు పాము పుట్టలు వెలిశాయి. ముత్తుకూరు సమీపంలోని కప్పలదొరువులో ఎదురుగా షెల్టర్ ఉన్నా నెల్లూరు వెళ్లే ప్రయాణికులకు నిరుపయోగంగా మారింది. ముత్తుకూరు-నెల్లూరు మార్గంలో ఏకంగా 10 బస్సు షెల్టర్లు ఉన్నా, ఒకటి వినియోగంలో లేకపోవడం వీటి దుస్థితికి నిదర్శనం. నిధులు ఇస్తున్నారన్న కారణంతో ఎడాపెడా కట్టేసినా షెల్టర్లు వినియోగంలో లేక నిరుపయోగం మారాయి.





ముత్తుకూరు మండలం పీవీ కండ్రిగ బస్సు షెల్టర్‌లో వెలిసిన పాము పుట్టలు, నిరుపయోగంగా కుమ్మరమిట్ట బస్సు షెల్టర్

## 'కాకాణి కంటే అష్టదరిద్రుడు ఎవరూ లేరు'

పొదలకూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : సర్వేపల్లి నియోజకవర్గంలోనే కాదు రాష్ట్రంలోనే కాకాణి కన్నా అష్ట దరిద్రుడు ఎవరూ లేరని, అతని జీవితమంతా అబద్ధాలమయమని టీడీపీ మండల అధ్యక్షుడు తలచీరు మస్తాన్‌బాబు అన్నారు. బుధవారం స్థానిక తెలుగుదేశం పార్టీ ప్రాంతీయ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్ల భారీ దోపిడీకి పాల్పడి తప్పుల మీద తప్పులు చేసి ఈ రోజు నంగనాచి కబుర్లు చెబుతున్నాడన్నారు. తమ నాయకుడిపై 18 అక్రమ కేసులు బనాయించారన్నారు. 2024 ఎలక్షన్ అఫిడవిట్‌లోనే 17 కేసులు చూపించారన్నారు. ఒక కేసును గతంలో హైకోర్టు క్వాష్ చేసిందన్నారు. తమ నాయకుడిపై బనాయించిన 18 అక్రమ కేసులకు కాకాణికి సంబంధం ఉందన్నారు. వరదాపురం రుస్తుం మైన్స్‌లో జరిగిన అక్రమ మైనింగ్‌లో నీకు సంబంధం లేదా అని ప్రశ్నించారు. బస్సుల్లో వచ్చిన హిజ్రాలు, రౌడీలతో సంబంధం లేకుంటే వారిపై ఎందుకు చర్యలు తీసుకోలేదో చెప్పాలన్నారు. మైన్స్‌లో వెలుగుజూసిన ప్రమాదకరమైన పేలుడు పదార్థాలకు అతని సంబంధం లేకుంటే కనీసం ఒక్క కేసు కూడా ఎందుకు నమోదు చేయలేదని సూటిగా ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు బొద్దులూరు మల్లికార్జున్‌నాయుడు, నాయకులు కోడూరు పెంచలభాస్కర్‌రెడ్డి, బక్కయ్యనాయుడు, షేక్.జమీర్, అలుపూరు శ్రీనివాసులు, గంటా మల్లికార్జున్‌యాదవ్, కలిచేటి శ్రీనివాసులురెడ్డి, కండే సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## వీఎస్‌యూలో పునరావాస విధానాలపై సమీక్ష

వెంకటాచలం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న విక్రమ సింహపురి యూనివర్సిటీలో బుధవారం మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్ విభాగం ఆధ్వర్యంలో కమ్యూనిటీ ఆధారిత పునరావాస విధానాలపై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు విచ్చేసి సామాజిక సేవ రంగంలో కమ్యూనిటీ ఆధారిత విధానాలు ప్రముఖ పాత్ర పోషిస్తాయన్నారు. కమ్యూనిటీ ఆధారిత పునరావాసం ద్వారా బాధితులకు మెరుగైన జీవన ప్రమాణాలను అందించవచ్చన్నారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, విభాగాధిపతి డాక్టర్ ఆర్ మధుమతి, డాక్టర్ ఆర్ ప్రభాకర్ తదితరులున్నారు.

## దళారులను నమ్మి మోసపోవద్దు

● ఏడీఏ రాజ్‌కుమార్



రైతులతో కలిసి ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఏడీఏ రాజ్‌కుమార్

తోటపల్లిగూడూరు, మార్చి12 (ఆంధ్రజ్యోతి): రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని విక్రయించాలని ఏడీఏ రాజ్ కుమార్ పేర్కొన్నారు. మండలంలోని పేడూరు, నరుకూరు గ్రామాల్లో బుధవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి శిరీషరాణి, ఏఈవో హరిబాబు, వీఏఏ నిరీష, రైతులు పాల్గొన్నారు.

## ఉచిత కుట్టు శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

విడవలూరు, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మహిళా సంక్షేమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకుందని ఎంపీడీవో నగేష్‌కుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. టైలరింగ్ ఉచిత శిక్షణకు బీసీ, కాపు, ఈబీసీ, కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, క్షత్రియ బ్రాహ్మణ కులాలకు చెందిన మహిళలు అర్హులని తెలిపారు. దరఖాస్తు చేసుకోనే మహిళలు 18 ఏళ్ల నుంచి 50లోపు వయస్సు కలిగి ఉండి తెల్లరేషన్ కార్డు కలిగి ఉండాలన్నారు. స్థానిక సచివాలయంలో తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు.

● బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చిరెడ్డిపాళెం రూరల్ మండలంలో బీసీ 29, ఈబీసీ 14, కాపు 5, రెడ్డి 22, కమ్మ 15, వైశ్య 6, బ్రాహ్మణ 4 మందికి ఆయా కార్పొరేషన్ల ద్వారా మహిళలకు స్వయం ఉపాధి పెపొందించే దిశగా ప్రభుత్వం కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభిస్తున్నట్టు ఎంపీడీవో శ్రీహరి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈమేరకు ఆసక్తి ఉన్న మహిళలు ఆధార్, రేషన్ కార్డు, కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

## ఘనంగా వైసీపీ ఆవిర్భావ దినోత్సవం

వెంకటాచలం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సర్వేపల్లి క్రాస్ రోడ్డు వద్ద బుధవారం వైసీపీ 15వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆపార్టీ నేతలు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆపార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య, వైసీపీ మండలాధ్యక్షుడు మోహన్‌నాయుడు, నేతలు ఈపూరు రజనీకాంత్‌రెడ్డి, భాస్కర్‌నాయుడు, అడపాల ఏడుకొండలు, చికుర్తి నరసయ్య, దేగా శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో సరస్వతీ పూజ



పొదలకూరు : విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందజేస్తున్న ఆర్యవైశ్య సంఘం నేతలు



విడవలూరు : రామతీర్థం జడ్పీ హైస్కూల్లో నిర్వహించిన సరస్వతీదేవి పూజలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

పొదలకూరు, మార్చి 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నాగార్జున ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో బుధవారం సరస్వతీ పూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్‌లు సునీతారెడ్డి, లక్ష్మీదుర్గలు విద్యార్థులకు పరీక్షల ప్యాడ్లు, పెన్నులు, జామెంట్రీ బాక్సులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చీఫ్ అడ్వైజర్ అన్నం సుబ్బారావు, డైరెక్టర్స్ ఎ.చంద్రశేఖర్‌యాదవ్, జీఎస్‌రెడ్డి, డీన్ సీహెచ్.కృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ పాపయ్య, కృష్ణ, ఏఓజీవీఆర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● పట్టణంలోని డీఎస్‌ఆర్ బాలుర బాలికల హైస్కూల్‌లో సరస్వతీ పూజ సందర్భంగా రూరల్ జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు అమర్తలూరు చెంచయ్య ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రూరల్ జిల్లా ఆర్యవైశ్య సంఘం వర్కింగ్ సెక్రటరీ పొట్టి సుధాకర్, ఆర్యవైశ్య యువజన విభాగం అధ్యక్షులు రాజా సురేంద్ర, మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తస్నీరు సురేష్‌బాబు, మండల యువజన విభాగం అధ్యక్షులు పైడా కామేష్, టౌన్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గుర్రం మీరామధు, తదితరులు పాల్గొన్నారు.

● విడవలూరు : మండల పరిధిలోని రామతీర్థం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం సరస్వతీ పూజ నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం శేషయ్య, స్కూల్ కమిటీ ఛైర్మన్ దయాకర్, ఆవుల వాసు, అధ్వర్యంలో జరిగిన ఈ పూజల్లో పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులందరూ ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. నాశిన కృష్ణ విద్యార్థులకు ప్యాడ్‌లు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు వనమాల జనార్దన్, కటారి సుబ్రమణ్యం, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి




ప్రజా చైతన్య యాత్రలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్

కోవూరు, మార్చి 12(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి పార్టీలకతీతంగా కృషి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ అన్నారు. మండలంలోని పడుగుపాడు రామచంద్రారెడ్డి నగర్‌లో 1999లో నిర్మించిన షాదీ మంజిల్‌ను బుధవారం ఆయన ప్రజాచైతన్యయాత్రలో భాగంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదలు షాదీమంజిల్‌లో వివాహాలు చేసుకునే వసతి సౌకర్యాలు లేవన్నారు. వక్ఫ్‌బోర్డు సహకారంతో షాదీ మంజిల్‌ను అభివృద్ధి పరచాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తాము గ్రామాల్లో ప్రజాచైతన్య యాత్ర చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు గండవరపు శేషయ్య, సర్దార్ అహమ్మద్, షేక్‌బాబు, అఫ్రోజ్, చాంద్‌బాషా, ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.



## ప్రారంభానికి సిద్ధంగా రెవెన్యూ భవనం

రాపూరు, మార్చి 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పోలీసు స్టేషన్ ఆవరణలో ఉన్న రెవెన్యూ భవనం తుది మెరుగులు దిద్దుకుని ప్రారంభానికి సిద్ధమైంది. ఈ భవనంలో రెవెన్యూ, ట్రెజరీ, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. మూడు శాఖల ఆఫీసులు ఒకే దగ్గర ఉండడంవల్ల ప్రజలకు మరింత సౌకర్యంగా ఉండబోతున్నది. ఈనెల చివరివారంలో ఈ భవనాన్ని ప్రారంభించే అవకాశం ఉందని కాంట్రాక్టరు చెన్ను భాస్కర్ రెడ్డి తెలిపారు.

## గిరిజనుల అభ్యున్నతిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

● అసెంబ్లీలో ఎమ్మెల్యే సోమిరెడ్డి

తోటపల్లిగూడూరు, మార్చి12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాచర్ల వారిపాలెం సచివాలయం పరిధిలో మాచర్లవారిపాలెం, మల్లికార్జునపురం గ్రామాల్లో 180 గిరిజన కుటుంబాలకు ఆధార్ కార్డులు లేక ప్రభుత్వ సంక్షేమ పథకాలకు పేదలు దూరమవుతున్నారని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అసెంబ్లీ దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్‌తోపాటు ఐటీడీఏ అధికారులు, ఎంపీడీవోలు, సచివాలయ ఉద్యోగులతో సమీక్ష నిర్వహించి గిరిజన బాగోగుల గురించి దృష్టి పెట్టాలని కోరారు. సర్వేపల్లి నియోజక వర్గంలో సుమారు 40వేల మందికి పైగా గిరిజనులున్నారన్నారు. గత ఐదేళ్లలో గిరిజనులకు జరిగిన అన్యాయాలపై విచారణ జరిపి వారికి న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

## జనసేన పార్టీ నాయకుల సంబరం



కరపత్రాలను చూపుతున్న జనసేన నాయకులు

రాపూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ ఆవి ర్భావ దినోత్సవ వేడు కలు రాపూరు పట్టణంలో జనసేన మం డల అధ్యక్షుడు జల్లె ల రాజేష్ ఆధ్వర్యం లో బుధవారం ఘనంగా నిర్వహిం చారు. స్థానిక పిచ్చిరెడ్డి కాంప్లెక్స్ ఎదుట జనసేన నాయకులు, కార్యకర్తలు కేకు కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. అనంతరం జల్లెల రాజేష్ మాట్లాడుతూ 14వ తేదీన పిఠాపురంలో జరిగే ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు రాపూరు నుంచి సుమారు 200 మంది నాయకులు, కార్యకర్తలు తరలివెళ్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ వెంకటగిరి ఇన్‌చార్జ్ తోట కృష్ణయ్య, గుండు రాఘవయ్య, కొండాపురం కస్తూరి, పెంచలస్వామి పాల్గొన్నారు.

## కల్లు గీత కార్మికుల సంక్షేమానికి కృషి



నగదు అందజేస్తున్న సంఘం నేతలు

విడవలూరు, మార్చి 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కల్లు గీత కార్మికుల సంక్షేమానికి జిల్లా గౌడ సేవా సమితి, గౌడ కల్లుగీత పారిశ్రామికుల సంఘం కృషి చేస్తుందని ఆ సమితి జిల్లా అధ్యక్షుడు తోట ప్రభాకర్ గౌడ్ తెలిపారు. మండలంలోని దండిగుంటలో కల్లు గీస్తూ ఈత చెట్టుపై నుంచి కిందపడి గాయాలై చికిత్స పొందిన పోసిన వెంకటేశ్వర్లుని బుధవారం ఆయన పరామర్శించి రూ.10వేలు ఆర్థిక సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఉప్పాల రామకృష్ణయ్య, సభ్యులు తాతా రమణయ్య గౌడ్, పోసిన కృష్ణమ్మ, దాసరి వెంకటేశ్వర్లు గౌడ్, నిమ్మల మల్లికార్జున గౌడ్, కోసూరు చిన్న గోవింద్, టీడీపీ నాయకులు కుడుముల మల్లికార్జున, కొండా రఘు పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S

## తాళం వేసిన ఇంట్లో పట్టపగలు చోరీ

● 25 సవర్ల బంగారం, రూ.30వేల అపహరణ



బీరువాలో వేలిముద్రలు స్వీకరిస్తున్న క్లూస్ టీం సభ్యులు, ఎస్ఐ సుమన్

కావలి రూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కావలి పట్టణం తుమ్మల పెంట రోడ్డులోని ఒక లేఅవుట్‌లో తాళం వేసిన ఇంట్లో పట్టపగలు దుండగుడు జొరబడి చోరీకి పాల్పడ్డారు. బాధితులు, పోలీసుల కథనం మేరకు... ఈ లేఅవుట్‌లో నివాసం ఉండే తస్నీరు వసంతరావు గుడ్లూరు మండలం చినలాటరపీ పాఠశాలలో ఉపాధ్యాయుడు, ఆయన సతీమణి అంజనీదేవి బోగోలు మండలం జువ్వలదిన్నెలో ఉపాధ్యాయినిగా పని చేస్తున్నారు. బుధవారం ఉదయం 8 గంటలకు ఇద్దరూ ఇంటికి తాళం వేసుకుని పాఠశాలలకు వెళ్లారు. 10 గంటల ప్రాంతంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి పక్క ఇంట్లో నివాసముండే ఉపాధ్యాయుడు ప్రవీణ్ కుమార్ ఇంటి గోడ దూకి పోతుండటం గుర్తించిన స్థానికులు అతనిని వెంబడించడంతో దుండగుడు పరారయ్యాడు. ఈ విషయాన్ని స్థానిక లు ప్రవీణ్ కుమార్‌కు తెలపడంతో వెంటనే ఆయన పాఠశాల నుంచి వచ్చి ఇంటి పరిసరాలు పరిశీలించుకుని తమ ఇంటి పక్కనే ఉన్న వసంతరావు ఇంట్లో చోరీ జరిగినట్లు గుర్తించి బాధితులకు సమాచారం ఇచ్చారు. వారు పాఠశాల నుంచి వచ్చి చూసుకోగా ఇంటి మెయిన్ డోర్ పక్కన ఉన్న సర్వీస్ డోర్, దాని గ్రిల్ తాళాలు పగలగొట్టి ఇంట్లోకి ప్రవే శించిన దుండగుడు బెడ్ రూంలో బీరువా పగలగొట్టి 25 సవర్ల బంగారు ఆభరణాలతో పాటు, రూ.30వేల అపహరించుకు పోయినట్లు గుర్తించారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయగా 1వ పట్టణ ఎస్ఐ సుమన్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. నెల్లూరు నుంచి క్లూస్ టీం బృందం వచ్చి వేలిముద్రలు సేకరిం చారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## బాలుర అక్రమ రవాణా

● పట్టుకున్న ఐసీపీఎస్ అధికారులు

నెల్లూరు (హరనాథపురం), మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఒడిస్సాలోని రాయగడ్ నుంచి టాటానగర్ రైలులో అక్రమంగా తరలిస్తున్న బాలురను ఐసీపీఎస్ అధికారులు బుధవారం గుర్తించి నెల్లూరు రైల్వే స్టేషన్‌లో పట్టుకున్నారు. జితేంద్ర, శన్మాజీ, మదన్ ముండా, అజిత్ ముండా, చాడి బొద్ర, మణి మైజ్ గోద్రాలను వాళ్ల స్వంత ప్రాంతాల నుంచి బుధవారం కూలి నిమిత్తం చెన్నై, కేరళలోని కాటన్ మిల్లులో పని చేయించడానికి తీసుకెళుతున్నట్లు అధికారులు గుర్తించారు. మధ్యవర్తులైన అంకిత్ లాక్ర, గోపి సన్మేజ్ ద్వారా తాము పనులకు వెళుతున్నట్లు ఆ బాలురు అధికా రులకు తెలిపారు. జిల్లా బాలల సంరక్షణ విభాగం వారు ఆ పిల్లలకు కౌన్సెలింగ్ ఇచ్చి జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ నెల్లూరు వారి సహకారంతో కేసు ఫైల్ చేసి వారిని నెల్లూరు చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఎదుట హాజరు పరిచారు. ఆ తర్వాత విశ్వజనని ఓపెన్ షెల్టర్ హోమ్‌లో చేర్పించారు. జిల్లా బాలల సరంక్షణ అధికారి బీ సురేష్ ఆ బాలల తల్లిదండ్రులు ఆచూకీ తెలుసుకుని వారికీ బాలలను అప్పగించే ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ ఆర్జేడీ ఎస్ జయలక్ష్మి, పీడీ సీహెచ్ సుశీలాదేవి, జీఆర్‌పీ ఆర్‌పీఎఫ్, బీబీఏ, ఐసీపీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

## నకిలీ ఎస్ఐ గుట్టురట్టు



ఎస్ఐ డ్రస్సులో హరీష్

సంగం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): తాను ఎస్ఐగా సెలెక్ట్ అయి అనంతపురంలో ట్రైనింగ్ పూర్తి చేశానని స్థానికులను నమ్మించి ఎస్ఐ వేషధారణలో కారులో సంచరిస్తూ సోషల్ మీడియాలో ఫోటోలు కూడా హల్‌చల్ చేయడంతో సదరు యువకుడ్ని నకిలీ ఎస్ఐగా గుర్తించి కేసు నమోదు చేసిన సంఘటన బుధవారం జరిగింది. వివరాల మేరకు... ఆల్లూరు మండలం నార్త్ ఆమూలూరుకు చెందిన నన్నం హరీష్ అనే యువకుడు బీటెక్ చేసి పోలీస్ సెలక్షన్‌కు ప్రయత్నించి విఫలమ య్యాడు. హరీష్ చిన్నతనంలోనే తండ్రి మృతి చెందాడు. దీంతో హరీష్ తల్లి ఆమె తల్లిదండ్రుల స్వగ్రామమైన సంగం మండలంలోని సిద్దీపురంలో ఉంటోంది. హరీష్ మాత్రం తండ్రి స్వగ్రామంలోనే నాయనమ్మ, తాత వద్ద ఉండి చదువుకున్నాడు. ఈక్రమంలో హరీష్ ఇటీవల తల్లి ఉంటున్న సిద్దీపురం వచ్చి తాను ఎస్ఐగా సెలెక్ట్ అయి అనంతపురంలో ఎస్ఐగా ట్రైనింగ్ పూర్తిచేశానని నమ్మించాడు. ఈక్రమంలో గత కొంత కొద్ది రోజుల నుంచి పోలీస్ డ్రస్, టోపీ ధరించి కారులో సంచరిస్తున్నాడు. అంతేకాకుండా ఎస్ఐ వేషధారణలో ఉన్న ఫోటోలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. ఇతని వ్యవహారంపై అనుమానం వచ్చిన స్థానికులు వీఆర్వోకు సమాచారం అందించారు. దీంతో వీఆర్వో ద్వారా సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు యువకుడ్ని విచారించగా నకిలీ ఎస్ఐగా నిర్ధారణ అయింది. అయితే యువకుడు నకిలీ ఎస్ఐ వేషధారణలో ఎటువంటి మోసాలు, బెదిరింపులకు పాల్పడలేదని తెలిసింది. కేవలం పోలీస్ వృత్తిపై ఉన్న మమకారంతో నకిలీ ఎస్ఐ వేషధారణతో కారులో బయటకు వెళ్లడం, తిరిగి ఇంటికి రావడమే చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. దీంతో యువకుడిపై చీటింగ్ కేసు నమోదు చేసి స్టేషన్ బెయిల్‌పై విడుదల చేసినట్లు ఎస్ఐ రాజేష్ తెలిపారు.

## అప్పుల బాధతో ఆటో డ్రైవర్ అదృశ్యం

నెల్లూరు(క్రైం), మార్చి 12 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని టిడ్కో ఇళ్లలో నివసించే తురకా మల్లికార్జున అనే వ్యక్తి అదృశ్యమైనట్లు నవాబుపేట పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... భగత్‌సింగ్ కాలనీ పరిధిలోని టిడ్కో ఇళ్లలో మల్లికార్జున, రాజేశ్వరి దంపతులు నివసిస్తున్నారు. మల్లికార్జున ఆటో నడుపుకుంటూ కుటుంబా న్ని పోషిస్తున్నాడు. అప్పుల అధికంగా చేయడంతో అప్పిచ్చిన వారి ఒత్తిడి తట్టుకోలేక కొద్దిరోజుల కిందట స్టోన్‌హౌస్‌పేటలోని తన మేనత్త ఇంటికి వెళ్లిపోయాడు. ఈ నెల 8వ తేదీ అక్కడి నుంచి కూడా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల గాలించినా జాడ తెలియక పోవడంతో బుధవారం భార్య రాజేశ్వరి నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## టీ తాగి వచ్చేసరికి ఆటో దోచేశారు

నెల్లూరు(క్రైం), మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఓ ఆటో డ్రైవర్ తన ఆటోను రోడ్డు పక్కన నిలిపి టీతాగి వచ్చే సరికి గుర్తుతెలియని వ్యక్తులు ఆటోను దోచుకెళ్లిపోయారు. పోలీసుల సమాచారం మేరకు... కోవూరు మండలం పోతిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన షేక్ రఫీ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం రాత్రి 8 గంటల సమయంలో ఏపీ26 టీసీ7162 నెంబరు కలిగిన అప్పీ ప్యాసెంజర్ ఆటోను నగరంలోని బాబు ఐస్‌క్రీమ్ దుకాణం పక్కన పార్క్ చేసి టీ తాగేందుకు వెళ్లాడు. తిరిగి వచ్చి చూసే సరికి ఆటో కనిపించలేదు. చుట్టు పక్కల గాలించినా ఫలితం లేకపోవడంతో బుధవారం సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ఆటో బోల్తా - ముగ్గురికి తీవ్ర గాయాలు

సీతారామపురం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంధంవారిపల్లి గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి. సీతారామపురం గ్రామానికి చెందిన నారాయణ తన ఆటోలో చిన్ననాగంపల్లి నుంచి ప్రయాణికులను ఎక్కించుకొని సీతారామపురం వస్తుండగా గంధంవారిపల్లి గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై గేదెలు అడ్డు రావడంతో ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఉప్పారోలపల్లికి చెందిన మలపాటి రంగయ్య, పబ్బులేటిపల్లికి చెందిన యారావాలా భాగ్యమ్మ, గంధంవారిపల్లికి చెందిన వంగపాటి లక్ష్మీదేవి లకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు 108 వాహనం ద్వారా సీతారామపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఉదయగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ఉపాధ్యాయ సీనియారిటీ

# జాబితా క్రమబద్ధీకరణ

**ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాలను క్రమబద్ధీకరించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గత వైసీపీ హయాంలో జరిగిన అక్రమాలకు తావులేకుండా ఉపాధ్యాయ బదిలీ చట్టం రూపకల్పనకు ముసాయిదా విడుదల చేసింది. దీంతో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ఇప్పటివరకు జరిగిన తొమ్మిది డీఎస్సీల నియామకాల ప్రకారం ఉపాధ్యాయుల వివరాలు సేకరించి సీనియారిటీ జాబితాను సిద్ధం చేస్తున్నారు.**

- సాధారణ బదిలీల్లో అక్రమాలకు అడ్డుకట్ట
- ముసాయిదా విడుదల చేసిన ప్రభుత్వం
- అభ్యంతరాలు పరిశీలిస్తున్న విద్యా శాఖ



నెల్లూరు(విద్య), మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని అన్ని మేనేజ్‌మెంట్‌ల పాఠశాలల్లో పని చేస్తున్న సెకండరీగ్రేడ్, భాషా పండితులు, స్కూల్ అసిస్టెంట్లు, ప్రధానోపాధ్యాయులకు సంబంధించిన పూర్తి వివరాలను విద్యాశాఖ సేకరిస్తోంది. ఉపాధ్యాయుల బదిలీలు, ఉద్యోగోన్నతులకు సీనియారిటీ జాబితా ఎంతో కీలకం. ఈ నేపథ్యంలో గతంలో చాలామంది తమ తాత్కాలిక అవసరాల కోసం బదిలీలు, ఉద్యోగోన్నతుల్లో లబ్ధి పొందేందుకు వ్యక్తిగత సమాచారాన్ని సైతం అడ్డగోలుగా నమోదు చేసుకున్నారు. కొంతమంది అయితే తాము నియామకమైన డీఎస్సీ, నియామక తేదీలు, స్కూల్ మేనేజ్‌మెంట్ వివరాలను టిస్(టీచర్ ఇన్ఫర్మేషన్ సిస్టం)లో సైతం తప్పుగా పొందుపరిచారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత కూటమి ప్రభుత్వం టీచర్ల సీనియారిటీ జాబితాను వెంటనే క్రమబద్ధీకరించాలని విద్యాశాఖను ఆదేశించింది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖ అధికారులు ఇప్పటివరకు జరిగిన 1982, 1984, 1989, 1994, 1998, 2000, 2002, 2014, 2018 డీఎస్సీల ద్వారా నియమితులైన టీచర్ల వివరాలను సేకరించి సీనియారిటీ జాబితాను సిద్ధం చేస్తున్నారు. అధికారిక లెక్కల ప్రకారం ఇప్పటివరకు 12,400 మంది టీచర్ల జాబితాను సిద్ధం చేయగా వీటిలో 340 మంది ఉపాధ్యాయులు పలు కారణాలతో అభ్యంతరాలను తెలిపారు. దీనిపై అధికారులు పరిశీలన చేసి వాటిని పరిష్కరించేందుకు కసరత్తు చేస్తున్నారు.

**● అక్రమాలకు చెక్ పెట్టేందుకు..**

ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాను క్రమబద్ధీకరిస్తే అక్రమాలకు అడ్డుకట్ట వేయడంతోపాటు అర్హులకు న్యాయం జరుగుతుందని పలువురు ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. బదిలీల సందర్భంగా కొంతమంది టీచర్లు దీర్ఘకాలిక అనారోగ్యం, దివ్యాంగులుగా, ఇతర అనారోగ్య కారణాలతో తప్పుడు ధ్రువీకరణ పత్రాలు పొంది నచ్చిన మండలాల్లోని పాఠశాలల్లో తిష్ట వేస్తున్నారు. ఇప్పటివరకు విద్యా సంవత్సరం మధ్యలోనో చివరిలోనో ఆకస్మికంగా బదిలీలు నిర్వహించేవారు. వీటన్నిటికి చెక్ పెట్టేందుకు కూటమి ప్రభుత్వం రాష్ట్ర బదిలీల నియంత్రణ చట్టం-2025 అమల్లోకి తెచ్చేందుకు సన్నాహాలు చేస్తోంది. ఈ చట్టం అమల్లోకి వస్తే విద్యా సంవత్సరం మధ్యలో కాకుండా వేసవి సెలవుల్లో బదిలీల ప్రక్రియ జరగనుంది. దీంతో బదిలీలు, ఉద్యోగోన్నతికి సంబంధించి భవిష్యత్‌లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా శాశ్వతమైన సీనియారిటీ జాబితాను విద్యాశాఖ సిద్ధం చేస్తోంది. దీనిపై అత్యధికశాతం మంది ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తుండగా కొన్ని సంఘాలు, కొంతమంది టీచర్లు మాత్రం దీనిని వ్యతిరేకిస్తున్నారు. కొత్త పద్ధతిపై అభ్యంతరాలను వ్యక్తం చేస్తున్నారని పలువురు ఉపాధ్యాయ సంఘాల నాయకులు చెబుతున్నారు.



**త్వరలోనే పూర్తిస్థాయి జాబితా**

ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాను త్వరలోనే పూర్తిస్థాయిలో విడుదల చేస్తాము. ఇప్పటికే జాబితాను ఆన్‌లైన్‌లో విడుదల చేయగా 340 అభ్యంతరాలు స్వీకరించాము. వీటిలో అత్యధిక శాతాన్ని సరిదిద్దగా మరికొన్ని అభ్యంతరాలను పరిశీలిస్తున్నాము. అన్నిటినీ సరిదిద్ది జాబితాను పారదర్శకంగా ప్రకటిస్తాము.

- ఆర్.బాలాజీరావు, డీఈవో



రోడ్డుపై ఉన్న నిర్మాణ సామగ్రిని చూపుతున్న కమిషనర్ సూర్యతేజ

## కాలువలపై ర్యాంపులు తొలగించండి

**ఉద్యోగులకు కమిషనర్ ఆదేశం**

నెల్లూరు(సిటీ), మార్చి12,(ఆంధ్రజ్యోతి) : డ్రైనేజీ కాలువల్లో పూడిక తీతకు ఆటంకంగా మారిన ర్యాంపులను తొలగించాలని కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ మున్సిపల్ ఉద్యోగులను ఆదేశించారు. బుధవారం నగరంలోని రంగనాయకులపేట, పాతమున్సిపల్ కార్యాలయ ప్రాంతాలలో ఆయన పర్యటించారు. నివాసాల ముందు కొందరు మురుగు కాలువలపై ర్యాంపులు నిర్మించారని తెలిపారు. వీటి వల్ల పూడికతీత పనులకు ఆటకం గా మారిందని మండిపడ్డారు. ఇలాంటివి ఎక్కడున్నా తీసెయ్యాలని సూచించారు. రంగనాయకులపేటలో ఆదివారం రథోత్సవం ఉన్నందున రోడ్డుపై ఆక్రమణలను తొలగించాలని స్థానిక సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. పినాకినీ పార్కులో అదనపు సిబ్బందిని నియమించుకుని మెరుగైన నిర్వహణ చేపట్టాలన్నారు. 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్న సింగల్ యూజ్ ప్లాస్టిక్ ఉత్పత్తులను నిషేధించాలన్నారు. అనంతరం తన కార్యాలయంలో 2025-26 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ రూపకల్పనపై విభాగాధి పతులతో సమావేశం నిర్వహించారు. కాగా, కార్పొరేషన్ పాఠశాలల్లో చదువుతూ పదో తరగతి పరీక్షలు రాయబోతున్న విద్యార్థులకు మేయర్ స్రవంతి తన చాంబరులో స్టేషనరీ పంపిణీ చేశారు. నెల్లూరులోని 1425 మంది విద్యార్థులు తాజాగా పది పరీక్షలు రాసేందుకు సిద్ధమయ్యారని, వీరంతా మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి కార్పొరేషన్‌కు ఖ్యాతి తీసుకురావాలని ఆమె ఆకాంక్షించారు.

## దళారులను నమ్మి మోసపోవద్దు

**పీపీసీ ప్రత్యేక అధికారి వేణుగోపాల్**

నెల్లూరు రూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం అమ్మకాల్లో దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని ధాన్యం కొనుగోలు కేంద్రాల (పీపీసీ) నెల్లూరు రూరల్ ప్రత్యేక అధికారి, హౌసింగ్ పీడీ టీ వేణుగోపాల్ సూచించారు. బుధవారం వ్యవసాయ అధికారులు శ్రీనివాసులు, నాగ మోహన్‌తో కలిసి మాదరాజుగూడూరులోని పీపీసీని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ఏ గ్రేడ్ ధాన్యం పుట్టి రూ.19,720కు కొనుగోలు చేస్తుందని చెప్పారు. పీపీసీల్లో ధాన్యం అమ్ముకుంటే 48 గంటల్లో సదరు నగదు రైతు ఖాతాల్లో జమవుతుందని తెలిపారు. రైతులెవ్వరు దళారులకు ధాన్యం తెగనమ్ముకోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన సెంటర్లలో విక్రయాలు జరపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంకటేశ్వర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



పీపీసీ సెంటర్‌లో సమావేశమైన అధికారులు

### సీసీ రోడ్లు, డ్రైనేజీలకు శంకుస్థాపన

నెల్లూరు రూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని 2, 12 డివిజన్లలో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణాలకు బుధవారం టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి స్థానికులతో కలిసి శంకుస్థాపనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ ఏ ప్రాంతంలో అభివృద్ధి పని చేపట్టాలన్నా స్థానిక ప్రజల అభిప్రాయం తెలుసుకుంటామని చెప్పారు. గత ప్రభుత్వంలో శంకుస్థాపనల పేరిట టెంకాయలు కొట్టి వదిలేసే రకం నాయకులం తాము కాదని స్పష్టం చేశారు. కాగా, ధనలక్ష్మీపురం జడ్పీ హైస్కూల్లో పదోతరగతి విద్యార్థులకు మాజీ మేయర్ భానుశ్రీ స్టేషనరీ పంపిణీ చేశారు. హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ విజయభాస్కర్, నాయకులు మస్తానయ్య, సాబీర్‌ఖాన్, పవన్ కుమార్‌రెడ్డి, రవి పాల్గొన్నారు.

### వీఎస్‌యూ పీజీ కళాశాలలో విచారణ వాయిదా

కావలిటౌన్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): విక్రమ సింహపురి యూనివర్శిటీ కావలి పీజీ కళాశాలలో చోటుచేసుకున్న పలు సంఘటనలకు సంబంధించిన ఆరోపణలపై బుధవారం జరగాల్సిన త్రిసభ్య కమిటీ విచారణ వాయిదా పడింది. కమిటీ సభ్యులు అందుబాటులో లేనందున విచారణ వాయిదా వేశారు. వారం రోజుల్లో యూనివర్శిటీ అధికారులు విచారణ తేదీని ప్రకటిస్తారని ప్రిన్సిపాల్ తెలిపారు.

### విభేదాలు వీడి టీడీపీ నేతల నవ్వులు

కావలి, మార్చి 12(ఆంధ్ర జ్యోతి): టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు కుమార్తె హరిప్రియ వివాహ వేడుకలో టీడీపీ అగ్ర నేతల నవ్వుల హరివిల్లు అందరినీ ఆకట్టు కున్నాయి. ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డిల మధ్యలో కావలి నియోజకవర్గ టీడీపీ మాజీ ఇన్‌చార్జి మాలేపాటి సుబ్బానాయుడు కూర్చుని ఉండగా వారి పక్కన ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు కూర్చున్నారు. తొలుత బీద రవిచంద్ర, క్రిష్ణారెడ్డిలు పక్కపక్కనే కూర్చుని ఉండగా కొంత సేపటికి మాలేపాటి సుబ్బానాయుడు అక్కడకు చేరుకున్నారు. దీంతో ఆయనను ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి ఆహ్వానించి వారి మధ్యలో కూర్చోపెట్టుకున్నారు. అయితే అంతవరకు బాగానే ఉన్నా ఆ తర్వాత వారు ముగ్గురు ఆనందంగా నవ్వుకోవడం దానిని బొల్లినేని ఆస్వాదించడం వివాహ వేడుకలలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అయితే వారు ఏమి మాట్లాడుకున్నారో...ఎందుకు నవ్వుకున్నారో ఎవరికీ తెలియదు కానీ ఎడమోహం, పెడ మొహంగా ఉండిన క్రిష్ణారెడ్డి, మాలేపాటిలు ఆనందంగా నవ్వుకోవడం మాత్రం టీడీపీ శ్రేణులలో ఉత్సాహాన్ని నింపింది. ఆ నవ్వులు అంత వరకేనా.. కొనసాగుతాయా అనేది చర్చనీయాంశమైంది.



### 13 జిల్లాల్లో అగ్నివీర్ నియామకాలకు నోటిఫికేషన్

గుంటూరు, మార్చి 12(ఆంధ్రజ్యోతి): 2025-26 సంవత్సరానికి 13 జిల్లాల్లో అగ్నివీర్ నియామకాలకు నోటిఫికేషన్ వెలువడిందని ఆర్మీ రిక్రూటింగ్ గుంటూరు బ్రాంచ్ కార్యాలయం డైరెక్టర్ కల్నల్ పునీత్‌కుమార్ తెలిపారు. గుంటూరు, కర్నూలు, నెల్లూరు, అనంతపురం, కడప, ప్రకాశం, చిత్తూరు, బాపట్ల, పల్నాడు, నంద్యాల, తిరుపతి, అన్నమయ్య, శ్రీ సత్యసాయి జిల్లాల్లో ఆసక్తిగల అభ్యర్థులు అగ్నివీర్ జనరల్ డ్యూటీ, టెక్నికల్, కార్యాలయ సహాయకులు/స్టోర్ కీపర్ టెక్నికల్, వృత్తి నిపుణుల పోస్టుల కోసం దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు ప్రక్రియ ఆన్‌లైన్‌లో జరుగుతుందని తెలిపారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.జేవో ఐఎన్ఐఎన్‌డీఐఎన్ఏ ఆర్ఎంవై.ఎన్ఐసీ.ఐఎన్ వెబ్‌సైట్‌లో ఏప్రిల్ 10 లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఒక అభ్యర్థి రెండు వేర్వేరు అగ్నివీర్ విభాగాలకు దరఖాస్తు చేసుకోవచ్చని.. ఆన్‌లైన్ ఉమ్మడి ప్రవేశ పరీక్ష(సీఈఈ) తొలిసారిగా తెలుగు సహా 13 వేర్వేరు భాషల్లో జరుగుతుందని వెల్లడించారు. అన్ని కేటగిరీలకు ఎన్‌సీసీ ఏ, బీ, సీ సర్టిఫికెట్ కలిగిన, ప్రతిభావంతులైన క్రీడాకారులు, టెక్నికల్ కేటిగిరీ పోస్టుల కోసం ఐటీఐ/డిప్లొమా అర్హత కలిగిన అభ్యర్థులకు అదనపు మార్కులు ఇస్తారని తెలిపారు.

### లక్ష్య సాధనకు శ్రమించాలి

**● డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి**

నెల్లూరు(విద్య), మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు తాము ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు నిరంతరం శ్రమించాలని నారాయణ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీ శ్రీనివాసులరెడ్డి సూచించారు. నగరంలోని ఆ కళాశాలలో బుధవారం కెరీర్ గైడెన్స్ కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు తమ లక్ష్యాలను సాధించేందుకు అకుంఠిత దీక్ష, పట్టుదలతో రాణించాలన్నారు. ఉద్యోగాలు చేయడమేకాక పరిశ్రమలు, సంస్థలు స్థాపించే స్థాయికి ఎదిగేలా పునాదు లు వేసుకోవాలన్నారు. అనంతరం పలు అంశాలపై విద్యార్థులకు అవగా హన కల్పించారు. ఈ కార్యక్రమంలో గూడూరు నారాయణ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీ రవిప్రసాద్, విశాఖపట్నం ఎంఎస్ఎంఈ ఏడీ ఎస్ఎల్ఎన్ కుమారి, జిల్లా పరిశ్రమల కేంద్రం డీడీ బాషా, అధ్యాపకులు పాల్గొన్నారు.

### పార్కులు ఆధునీకరించండి

నెల్లూరు(సిటీ), మార్చి12,(ఆంధ్రజ్యోతి) : నగరంలోని పార్కులన్నింటినీ ఆధునీకరించాలని జనతా వాకర్స్ అసోసియేషన్ నాయకుడు ముక్కు రాధాకృష్ణగౌడ్ కోరారు. ఈ మేరకు బుధవారం కార్పొరేషన్ కార్యాలయంలో డీసీ చెన్నుడు, ఎస్ఈ రామ్మోహన్‌రావుకు వినతి పత్రం అందచేశారు. పార్కులలో వాకింగ్ ట్రాక్లు, యోగా సెంటర్లు, మినీ జిమ్ములు, స్విమ్మింగ్ పూల్స్, షటిల్ కోర్టులు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలకు ఆహ్లాదం పంచే విధంగా పచ్చదనాన్ని పెంపొందించాలని తెలిపారు. ప్రజారోగ్యానికి సంబంధించిన అవగాహన కార్యక్రమలు నిర్వహించేందుకు వీలు కల్పించాలని కోరారు.



## రైతులను ఇబ్బంది పెడితే చర్యలు తప్పవు

**● ధాన్యం కొనుగోళ్లపై సమీక్షలో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి**

నెల్లూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైతులను ఇబ్బంది పెడితే చర్యలు తప్పవని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి హెచ్చరించారు. నెల్లూరులోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ధాన్యం కొనుగోళ్లపై ఆయన అధికారులు, రైతు నాయకులతో బుధవారం సమీక్షించారు. కనీస మద్దతు ధరకు తగ్గించి ధాన్యం కొనుగోలు చేసినా, తేమ పేరుతో ఎక్కువ ధాన్యం తీసుకున్నా మిల్లర్లపై కఠినంగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకొని రైతుల అవసరాలకు సరిపడా లారీలను పంపాల న్నారు. కొరత లేకుండా గోనె సంచులను సరఫరా చేయాలని సూచించారు. వైసీపీ ప్రభుత్వంలో పుట్టికి 250 కేజీలు అదనంగా తీసుకున్నారని, కూటమి ప్రభుత్వంలో అటువంటి దుర్మార్గాలకు పాల్పడితే సహించేది లేదని సోమి రెడ్డి స్పష్టం చేశారు. అవసరమైతే రైతు సమస్యలను జిల్లాలోని ఎమ్మెల్యేలు అందరం సమన్వయం చేసుకొని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళతామని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖాధికారి సత్యవాణి, సివిల్ సప్లయిస్ డీఎం అర్జునరావు, జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి అంకయ్య, జిల్లా సహకార శాఖాధికారులు, రైతు సంఘాల నాయకుడు రాధాకృష్ణమ నాయుడు, కోటిరెడ్డి, శ్రీరాములు, శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోళ్లపై రైతు నాయకులు, అధికారులతో సమీక్షిస్తున్న సోమిరెడ్డి

### ప్రసాదమూర్తికి సాహితీ ఫౌండేషన్ అవార్డు

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : చిన్ని నారాయణ రావు సాహితీ ఫౌండేషన్ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా నలుగురికి సాహితీ అవార్డులు ప్రదానం చేస్తున్నట్లు ఫౌండేషన్ అధ్యక్షుడు చిన్ని నారాయణరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కలనేత కవితా సంపుటితో సాహిత్య అడుగులలో ప్రవేశించి 14 పుస్తకాలను తెలుగు సాహిత్య పాఠకులకు అందించిన కవి బీ ప్రసాదమూర్తికి ఈ అవార్డుతోపాటు సత్యవేటి శ్రీకాంత్, తుంగా రాజగోపాల్‌రెడ్డి, నాగభైరవ స్మారక సాహితీ పురస్కారాలను తమ ఫౌండేషన్ అందజేస్తుందని తెలిపారు. ఈ పురస్కారాలకు పీ శ్రీనివాసగౌడ్, కొమ్మవరపు విల్సన్ బాబు, అవధానుల మణిబాబును ఎంపిక చేశామని తెలిపారు. ఈ అవార్డులు త్వరలో జరగబోయే ద్వితీయ వార్షికోత్సవంలో ప్రధానం చేస్తామన్నారు.

### 16న సాహిత్య సదస్సు

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 12(ఆంధ్రజ్యోతి) : విశాలాక్షి సాహిత్య మాస పత్రిక ఆధ్వర్యంలో ఈనెల 16న సాహిత్య సదస్సు జరుగుతుందని ప్రతిక వ్యవస్థాపకుడు కోసూరు రత్నం, ఎడిటర్ ఈతకోట సుబ్బారావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమం టౌనుహాలు ఏసీ హాలులో సాయంత్రం 5గంటలకు జరుగుతుందని, సాహితీ ప్రియులు తరలిరావాలని కోరారు.

### దర్గా స్వాగత ద్వారాల పనులు నేడు పునఃప్రారంభం

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని బారాషహీద్ దర్గా స్వాగత ద్వారాల పనులు గురువారం పునఃప్రారంభం కానున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో ఆ ద్వారాల పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. తిరిగి ప్రారంభించేందుకు గురువారం శంకుస్థాపన కార్యక్రమం జరుగుతుంది. ఆ మేరకు బుధవారం శంకుస్థాపన ఏర్పాట్ల పనులను కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, మైనార్టీ నాయకుడు షంషుద్దీన్, నగర పాలక సంస్థ ఇంజనీర్లు పరిశీలించారు.

### ‘కిమ్స్’లో బైఫర్‌కేషన్ స్టంటింగ్ శస్త్రచికిత్స




మీడియాతో మాట్లాడుతున్న డాక్టర్ శ్రీనివాసరాజు

నెల్లూరు (వైద్యం), మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని కిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో గుండెకు సంబంధించి అత్యాధునిక బైఫర్‌కేషన్ స్టంటింగ్ శస్త్రచికిత్స చేసినట్లు ప్రముఖ గుండె వైద్య నిపుణుడు డాక్టర్ సీఎస్ శ్రీనివాసరాజు వెల్లడించారు. ఇలాంటి శస్త్రచికిత్స రాష్ట్రంలోనే మొదటిదని తెలియచేశారు. బుధవారం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరానికి చెందిన రమణ మూర్తి(54) ఛాతీలో నొప్పితో బాధపడుతూ ఆసుపత్రికి వచ్చారని చెప్పారు. పరీక్షలు చేయగా గుండెకు రెండు వైపుల వెళ్లే రక్త నాళాలు మూసుకు పోయాయని తెలిసిందన్నారు. ఇలాంటి స్థితిలో సాధారణంగా బైపాస్ సర్జరీ చేయాల్సి వస్తుందన్నారు. అయితే ఇటీవలే అందుబాటులోకి వచ్చిన బైఫర్‌కేషన్ స్టంటింగ్ విధానం ద్వారా చికిత్సను విజయవంతంగా నిర్వ హించామని చెప్పారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన మేధో సదస్సులో ఫ్రాన్స్ గుండె వైద్యనిపుణులు వెల్లడించిన విధానాలకు అనుగుణంగా ఈ శస్త్రచికిత్సను విజయవంతం చేశామని తెలిపారు. ప్రస్తుతం బాధితుడు పూర్తిగా కోలుకోవటంతో డిశ్చార్జ్ చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి చీఫ్ ఆపరేటింగ్ అధికారి డాక్టర్ సతీష్‌కుమార్, డాక్టర్ సాహెబ్ పీర్, డాక్టర్ నాగరాజు, డాక్టర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

### కోనేరు మార్కెట్‌లో 55 షాపులకు 22న బహిరంగ వేలం

నెల్లూరు(వ్యవసాయం), మార్చి 12(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి కూరగాయల మార్కెట్ పక్కనున్న కోనేరు మార్కెట్ లోని 55 దుకాణాలకు ఈనెల 22వతేదీన బహిరంగ వేలం నిర్వహి స్తున్నట్లు నెల్లూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యద ర్శి శ్రీనివాసులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కోనేరు మార్కెట్‌లో ఏ, బీ, సీ బ్లాకుల్లో ఖాళీగా ఉన్న 55 షాపులను హైకోర్టు ఉత్తర్వుల మేరకు అద్దె ప్రాతిపదికన కేటాయించేందుకు వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నెల్లూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ నుంచి వలంటరీ ట్రేడ్ లైసెన్సు పొంది ఉన్న పండ్ల వ్యాపారులు మాత్రమే ఈ వేలంలో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. వేలంలో పాల్గొనే వ్యాపారులు రూ.200 చెల్లించి దరఖాస్తు ఫారాలను 20వతేదీ సాయంత్రం 5గంటలలోగా పొందాలని సూచించారు. పూర్తిచేసిన దరఖాస్తులతోపాటు సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ, అగ్రికల్చరల్ మార్కెట్ కమిటీ, నెల్లూరు పేరున రూ.25వేల బ్యాంకు చెక్కు, డిమాండ్ డ్రాఫ్ట్‌తో కలిపి 21వతేదీన మధ్యాహ్నం 2గంటలలోగా అందజేయాలన్నారు. 22వతేదీ ఉదయం 11గంటలకు వ్యవసాయ మార్కెట్ కమిటీ నెల్లూరు ప్రధాన కార్యాలయంలో ప్రాంతీయ సంయుక్త మార్కెటింగ్ సంచాలకుల ఆధ్వర్యంలో వేలం జరుగుతుందని తెలిపారు.



## రాష్ట్రం యూనిట్‌గా ఎస్సీ వర్గీకరణ చేయాలి

**● ఎమ్మార్పీఎస్ జాతీయ వ్యవస్థాపకుడు బ్రహ్మయ్య**

నెల్లూరు (హరనాథపురం), మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రం యూనిట్ గా ఎస్సీ వర్గీకరణ చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ వ్యవస్థాప కుడు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం నగరం లోని అంబేడ్కర్ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 1996లో నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వేసిన రామ చంద్రరావు కమిషన్ సిఫారసు ప్రకారం 1999లో ఎస్సీ వర్గీకరణ చేశారన్నారు. అదేవిధంగా 2007లో ఉషా మెహర కమిషన్ నివేదిక కూడా రాష్ట్రం యూనిట్‌గానే ఎస్సీ వర్గీకరణ చేయాలని సూచించిందని చెప్పారు. ప్రస్తుతం ఎస్సీ వర్గీకరణ కమిషన్ చైర్మన్ రాజీవ్‌రంజన్ మిశ్రా నివేదిక ప్రకారం ఎస్సీ వర్గీకరణ జనాభా దామాషాను అనుసరించి ఏ బీ సీ గ్రూపుల్లో మాదిగ, మాదిగ ఉపకులాలకు 7.5 శాతంగా ఉండటాన్ని తాము స్వాగతిస్తున్నామని చెప్పారు. తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా రాష్ట్రం యూనిట్‌గా వర్గీకరణ చేశారని గుర్తు చేశారు. ఏపీలోనూ అదేవిధంగా చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కో ఆర్డినేటర్ బెల్లంకొండ గోపి మాదిగ, కోలగట్ల రమేష్ మాదిగ, జిల్లా మహిళా అధ్యక్షురాలు ఆత్మకూరు స్వర్ణక్క మాదిగ, జిల్లా కో కన్వీనర్ చెరుకూరు సోమయ్య మాదిగ, చంటి మాదిగ, కాకులూరు పెంచలయ్య మాదిగ తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బ్రహ్మయ్య మాదిగ, పక్కన నాయకులు

### కరాటే రాష్ట్రస్థాయి పోటీ విజేతలకు బహుమతుల పంపిణీ



పోటీల విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న ఇంతియాజ్, ఇబ్రహీం తదితరులు

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని పురమందిరంలో కరాటే మాస్టర్ ఇబ్రహీం ఆధ్వర్యంలో కాడెట్, సబ్ జూనియర్, జూనియర్ స్క్వేర్, మార్షల్ ఆర్ట్స్ పోటీలు రాష్ట్రస్థాయిలో జరిగాయి. జిల్లా నలుమూలల నుంచి విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ఆంధ్రప్రదేశ్ చీఫ్ జనరల్ కార్యదర్శి షేక్ ఇంతియాజ్ బహుమతులు అందజేశారు. ప్రతి విద్యార్థి చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు నన్నే సాహెబ్, తదితరులు పాల్గొన్నారు.

# నింగి నుంచీ నిఘా




డ్రోన్లను వాడనున్న పోలీసు శాఖ

జిల్లాకు 73కావాలని ప్రతి పాదనలు

సబ్ డివిజన్ల వారీగా ఆపరేటింగ్ సిబ్బంది నియామకం

తాజాగా తిరుపతి, చంద్రగిరిలో పరిశీలన

**హమ్మయ్య.. ఊరు శివారుకు వచ్చాం. ఎవరూ చూడట్లేదు. రోడ్డు పక్కన.. ఆ చెట్టు కింద సెట్టింగ్ వేద్దామని మద్యం సీసాలు ఓపెన్ చేస్తున్నారా? గంజాయి ప్యాకెట్లు విప్పుతున్నారా?**

**పోలీసుల్లేరు. సీసీ కెమెరాలూ లేవు. ఇష్టారాజ్యంగా వాహనాన్ని నడపవచ్చని అనుకుంటున్నారా? శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా.. గంజాయి అమ్మినా ఏమీ కాదనుకుంటున్నారా?**



బహిరంగంగా మద్యం తాగుతూ డ్రోన్ కెమెరాకు చిక్కిన మందుబాబులు

**ఇలాంటి వారందరిపైనా డ్రోన్లతో నిఘా పెట్టేందుకు పోలీసు శాఖ చర్యలు చేపట్టింది. పోలీసులనుంచి తప్పించుకున్నా.. డ్రోన్లకు చిక్కాల్సిందే.**

**- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి**

చంద్రగిరి మండలం ఎం.రంగంపేట వద్ద డ్రోన్‌తో నిఘా

జిల్లా పోలీసు శాఖలోనూ టెక్నాలజీని అంది పుచ్చుకుంటున్నారు. శాంతిభద్రతల వినియోగంలో డ్రోన్ల వినియోగం పెంచనున్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక పోలీసుశాఖ సాంకేతిక నైపుణ్యంతో అసాంఘిక కార్యకలాపాల ఆటకట్టించడానికి చర్యలు తీసుకుంటోంది. జిల్లాకు నిత్యం దేశ, విదేశాల నుంచి దాదాపు లక్ష మంది యాత్రికులు, వీఐపీలు వస్తుంటారు. ఈ క్రమంలో భద్రతా చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. ఇక, జిల్లాలో తొమ్మిది సబ్ డివిజన్లు, 49 పోలీసు స్టేషన్లు, తిరుపతి, తిరుమలలో ట్రాఫిక్ స్టేషన్లు, మరో రెండు సెంట్రల్ క్రైం స్టేషన్లు, సైబర్ క్రైం కార్యాలయం వుంది. వీటన్నింటికీ కలిపి ప్రస్తుతం మూడు డ్రోన్లు మాత్రమే వున్నాయి. మరో 73 డ్రోన్లు కావాలని అధికారులు ప్రతిపాదనలు పెట్టారు. ఆ డ్రోన్లు వస్తే నింగి నుంచీ నిఘా పెట్టనున్నారు. జూదం, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం, మహిళలకు వేధింపులు, ట్రాఫిక్ సమస్య, శాంతి భద్రతల పరిరక్షణ, పండుగ సమయాల్లో బందోబస్తు నిర్వహణ, ఇతర నిఘా కార్యకలాపాలకు డ్రోన్లు వినియోగించనున్నారు. బస్టాండు, రైల్వే స్టేషన్ తదితర రద్దీ ప్రాంతాల్లో డ్రోన్ల ద్వారా పర్యవేక్షించనున్నారు. పోలీసులు వెళ్లలేని ప్రదేశాలకు వాటిని పంపి అక్కడ పరిస్థితులు సమీక్షిస్తారు. అసాంఘిక కార్యకలాపాలు, ఈవ్ టీజింగ్, ఒంటరిగా వెళ్ళే మహిళలను బెదిరించడం, చోరీలకు పాల్పడడం, చైన్ స్నాచింగ్‌లు చేస్తున్న వారికి డ్రోన్లతో చెక్ పెట్టనున్నారు. నేరాల విజువల్స్ డ్రోన్లలోని కెమెరాల్లో సేవ్ అవుతాయి. వాటి ద్వారా త్వరితగతిన దర్యాప్తు చేసే అవకాశం ఉంటుందని పోలీసు అధికారి ఒకరు చెప్పారు. కమాండ్ కంట్రోలు సెంటర్‌కు ఈ డ్రోన్లలోని కెమెరాలు అనుసంధానమై ఉంటాయి. ట్రాఫిక్ ఎందుకు జామ్ అయిందనేది వీటిద్వారా గుర్తించవచ్చు.

**20 మంది సిబ్బందికి ప్రత్యేక శిక్షణ**

డ్రోన్ల ఆపరేటింగ్‌పై జిల్లాలో దాదాపు 20 మంది సిబ్బందికి ఇటీవల 10 రోజుల పాటు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. మరో 10 మంది టెక్నీషియన్లను కేటాయించారు. డ్రోన్లు ఎగురవేయడమే కాకుండా వాటిని ఎలా తిప్పాలి? ఎక్కడ.. ఎలా వినియోగించాలి? అనే అంశాలపై శిక్షణ ఇచ్చారు. డ్రోన్లు రాగానే ఆయా స్టేషన్లకు అందచేయనున్నారు.

## నిఘా మరింత పటిష్ఠం

తిరుపతిని గంజాయి, నేరరహిత జిల్లాగా తీర్చిదిద్దడానికి డ్రోన్లు ఎంతో ఉపయోగపడతాయి. నేరస్థులపై మరింత నిఘా పెంచుతాం. గంజాయి రవాణా, వినియోగం, విక్రయాలకు పాల్పడే వారు పోలీసుల నుంచి తప్పించుకున్నా డ్రోన్ల నిఘా నుంచి తప్పించుకోవడం సాధ్యమయ్యే పనికాదు.

- హర్షవర్ధనరాజు, ఎస్పీ

## తిరుపతి, చంద్రగిరిపై డ్రోన్ల నిఘా

● పనితీరుపై ప్రాథమిక పరిశీలన

తిరుపతి, చంద్రగిరి ప్రాంతాల్లో బుధవారం పోలీసులు మూడు డ్రోన్లతో నిఘా పెట్టారు. నిర్మానుష్య, మారుమూల ప్రాంతాల్లో డ్రోన్లు ఎగురవేసి ఇవి ప్రాథమికంగా ఎలా పనిచేస్తాయి? ఎలాంటి ఫలితాలు ఇస్తున్నాయనేది పరిశీలించారు. ముఖ్యంగా తిరుపతిలోని అటవీ ప్రాంతం, పోలీసులు వెళ్లలేని శివారు ప్రాంతాల్లో వీటిని ఎగుర వేశారు. చంద్రగిరిలోని శేషాచలం అడవి ఎక్కువగా ఉన్న ఏరియాలో డ్రోన్లను పంపారు. కాగా, తిరుపతి ప్రాంతంలో కొందరు మందుబాబులు బహిరంగంగా మద్యం తాగడాన్ని గుర్తించి పట్టుకున్నారు. వారికి ఈగల్ టీమ్ ద్వారా కౌన్సెలింగ్ ఇప్పించారు. డ్రోన్ల సాయంతో హైవేలపై హాట్‌స్పాట్‌లు గుర్తించారు.




### శెట్టిపల్లె భూములకు పరిష్కారమేదీ?



తిరుపతి శివారు శెట్టిపల్లె భూసమస్య 30 ఏళ్లుగా పరిష్కారం కాలేదు. గత ఐదేళ్లలో సమస్యను పరిష్కరించకపోగా, 2019వరకు తుడా పరిధిలో ఉన్న ఆ గ్రామాన్ని కార్పొరేషన్‌లో కలిపేశారు. ఎలాంటి అభివృద్ధి పనులు జరగలేదు. తిరిగి తుడా పరిధిలోకి చేర్చి సమస్యను పరిష్కరించాలి. తిరుపతిలో ప్రభుత్వ ఇంటర్, డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేయాలి. 30ఏళ్ల కిందటి అండర్‌డ్రైనేజీ వ్యవస్థ పాడైంది. కొత్తగా ఏర్పాటు చేయాలి.

**- ఆరణి శ్రీనివాసులు, తిరుపతి ఎమ్మెల్యే**

### 'తుడా'లో అవినీతిపై చర్యలు తీసుకోండి



వైసీపీ ప్రభుత్వంలో 'తుడా'లో జరిగినంత అవినీతిపై దేశంలోనే ఎక్కడా జరిగి ఉండదు. తుడా నిధులు రూ. 246 కోట్లను చంద్రగిరి నియోజకవర్గంలోని ఎంపీడీవోల ఖాతాలకు బదిలీ చేసి, అవినీతికి పాల్పడ్డారు. చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పేరుతో ఏర్పాటు చేసినా 8 వేల బెంచీలకు తుడా నుంచి ఒక్కోదానికి రూ.7800 చొప్పున చెల్లించారు. వీటినే మండలాల ద్వారా ఒక్కోదానికి రూ.10839 చొప్పున (జీఎస్టీతో కలిపి) 12 వేల బెంచీలు ఏర్పాటు చేశారు. వాస్తవానికి ఈ బెంచీల ధర రూ.2500 నుంచి రూ.2800 మాత్రమే. ఇందులోనే సుమారు రూ.20 కోట్ల అవినీతి జరిగింది. తుడా ఛైర్మన్‌గా ఉన్న సమయంలో రూ.5.16 కోట్ల డీజల్ ఖర్చులు చూపారు. ఇంత సీఎంకు కూడా అయి ఉండదు. ఆయన దగ్గర.. రియల్ ఎస్టేట్‌లో పనిచేయడానికి 65 మందిని నియమించుకుని తుడా ద్వారా ప్రతి నెలా రూ.4 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు జీతాలు చెల్లించారు. తుమ్మలగుంట చెరువు 88 ఎకరాలుంటే పార్క్‌కు రూ.46 కోట్లు వెచ్చించి, చెరువు పక్కన కబ్జా చేసిన మఠం భూముల విలువ పెంచుకున్నారు. నర్సరీ గార్డెన్‌లో 33 వేల చెట్లు పెట్టారని చూపినా ఆ ఆనవాళ్లేలేవు. తుడాకు కెమెరాలు, డ్రోన్‌లు, కంప్యూటర్ల అవసరం లేకున్నా రూ.40 లక్షలు చెల్లించారు. చంద్రగిరి నియోజకవర్గంలో ఆరు మండలాల్లో మెడికల్ క్యాంప్‌లకు రూ.10.50 కోట్లు తుడా నిధులు ఖర్చు చేశారు. కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేసుకొన్నా ఇంత కాదు. సమావేశాలకు రూ.50 లక్షలు ఖర్చు చేసారు. ఇలా విచ్చలవిడిగా సాగిన తుడా నిధుల దుర్వినియోగంపై విజిలెన్సు విచారణకు ఫిర్యాదు చేసి, ఐదు నెలలు అవుతున్నా చర్యలు తీసుకోలేదు. దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలి.

**- పులివర్తి నాని, చంద్రగిరి ఎమ్మెల్యే**

## నామమాత్రంగా వైసీపీ ఆవిర్భావ దినోత్సవం

● మాజీ మంత్రి రోజా సహా మెజారిటీ ముఖ్యనేతల గైర్హాజరు ● పోరుబాటకూ అదే పరిస్థితి

తిరుపతి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): గడచిన ఐదేళ్లూ ఆర్భాటంగా ఆవిర్భావ దినోత్సవాలు నిర్వహించిన వైసీపీ నేతలు.. అధికారం కోల్పోయాక అతీ గతీ లేకుండా పోతున్నారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బుధవారం జిల్లాలో ఆ పార్టీ నాయకులు, శ్రేణుల తీరు దాన్ని ప్రతిబింబించింది. చాలా మండలాల్లో ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాలు నిర్వహించనే లేదు. కొన్ని చోట్ల నామమాత్రంగానే చేశారు. కొన్ని చోట్ల వేడుకల నిర్వహణలోనూ వర్గపోరు కనిపించింది. ఇక జిల్లా కేంద్రంలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పోరుబాటకూ శ్రేణులు కరువయ్యారు. ఐదు నియోజకవర్గాల నుంచీ సమన్వయకర్తలే రాలేదు. అలాంటి వారిలో మాజీ మంత్రి రోజా కూడా వుండడం గమనార్హం. తిరుపతిలో తన నివాసం వద్ద మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి నివాసం వద్ద ఆయనతో పాటు మేయర్ డాక్టర్ శిరీష, తిరుపతి, చంద్రగిరి, సత్యవేడు సమన్వయకర్తలు అభినయ్‌రెడ్డి, మోహిత్‌రెడ్డి, రాజేశ్ పార్టీ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొని పతాకాలు ఆవిష్కరించారు. కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన పోరు బాట కార్యక్రమంలోనూ భూమన కరుణాకర్‌రెడ్డి, అభినయ్‌రెడ్డి, మోహిత్‌రెడ్డి, నూకతోటి రాజేశ్, మేయర్ శిరీష మాత్రమే పాల్గొన్నారు.

**మెజారిటీ ఇన్‌చార్జులు గైర్హాజరు**

తిరుపతి ఎంపీ గురుమూర్తి, మాజీ మంత్రి ఆర్కే రోజా, మాజీ ఎమ్మెల్యేలు బియ్యపు మధుసూదన్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్య, గూడూరు సమన్వయకర్త ఎమ్మెల్సీ మురళీధర్, వెంకటగిరి సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్ తదితర ముఖ్యులు పార్టీ ఆవిర్భావ వేడుకల్లో కనిపించలేదు. మాజీ మంత్రి రోజా శ్రీలంకలో ఉన్నట్లు సమాచారం. ఎంపీ గురుమూర్తి తాడేపల్లిలో జరిగిన కార్యక్రమానికి, గూడూరు నేత మురళీధర్ నెల్లూరులో జరిగిన పోరుబాటకూ హాజరైనట్టు సమాచారం. దీంతో తిరుపతి కలెక్టరేట్ వద్ద జరిగిన పోరుబాటలోనూ, ఆయా నియోజకవర్గాలలో జరిగిన ఆవిర్భావ కార్యక్రమాల్లోనూ నేతలు లేకపోవడం కొట్టొచ్చినట్టు కనిపించింది. బాలాయపల్లి, డక్కిలి, రేణిగుంట, ఏర్పేడు, తొట్టంబేడు, బీఎన్ కండ్రిగ, కేవీబీపురం, చిన్నగొట్టిగల్లు, పాకాల, ఎర్రావారిపాలెం, వడమాలపేట తదితర పదికి పైగా మండలాల్లో పార్టీ ఆవిర్భావ వేడుకలు జరగలేదు. సూళ్ళూరుపేట, నాగలాపురం, పిచ్చాటూరులలో వర్గాలుగా విడిపోయి కార్యక్రమాలు నిర్వహించారు. మిగిలిన మండలాల్లో నామమాత్రంగానే కార్యక్రమాలు జరిగాయి.

## రచ్చరచ్చగా యువత పోరు

● గేటు తాళాలు విరిచి కలెక్టరేట్‌లోకి దూసుకెళ్లిన శ్రేణులు

● మరికొందరి అత్యుత్సాహంతో వాహనదారులకు ఇబ్బందులు





కలెక్టరేట్ వద్ద వైసీపీ శ్రేణులతో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు భూమన - బందోబస్తు విధులకు వచ్చి ఫిట్స్‌తో పడిపోయిన వెంకటగిరి కానిస్టేబుల్ మునేంద్రబాబు

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 12(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ వద్ద బుధవారం వైసీపీ తలపెట్టిన 'యువత పోరు' నిరసన కార్యక్రమం రచ్చరచ్చగా మారింది. వైసీపీ శ్రేణుల చర్యలతో వాహనదారులు, స్థానికులు ఇబ్బంది పడ్డారు. ఓపెన్ టాపు జీపు.. ఆ వెనుక వందలాది బైకులతో హారన్లు మోగిస్తూ వైసీపీ శ్రేణులు కలెక్టరేట్‌కు చేరుకున్నారు. ఇది స్థానికులను ఇబ్బందులకు గురిచేసింది. ఆందోళనలో కొందరు అత్యుత్సాహం చూపారు. కలెక్టరేట్ ఒకవైపున్న ప్రధానగేటు తాళాలు విరగ్గొట్టి లోపలకు చొచ్చుకొచ్చారు. ఆ సమయంలో పోలీసులూ చెట్లకింద రిలాక్స్‌డ్‌గా ఉన్నారు. అదనపు ఎస్పీ రవి మనోహరాచారి ఆగ్రహం వ్యక్తంచేయడంతో వీరంతా పరుగుతీసి ఆందోళనకారులను బలవంతంగా తీసుకెళ్లి.. ఆ గేటుకు మరో తాళం వేశారు. రోప్‌తో గేటు కట్టారు. ఈ ఘటనతో కాసేపు ఉద్రిక్తత నెలకొంది. బందోబస్తుకు వచ్చిన వెంకటగిరికి చెందిన కానిస్టేబుల్ మునీంద్ర తీవ్ర అస్వస్థతకు గురై ఫిట్స్ వచ్చాయి. సహచరులు అతడిని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కాగా, ఆందోళన నేపథ్యంలో కలెక్టరేట్ వద్ద భారీ ఎత్తున బారికేడ్లు పెట్టి పోలీసులు మొహరించారు. కలెక్టరేట్ ఉద్యోగులనూ ఐడీ కార్డులు చూసి అనుమతించారు. కాగా, ఆందోళన సందర్భంగా వైసీపీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకుండా కూటమి ప్రభుత్వం మోసం చేస్తోందన్నారు. నిరుద్యోగ భృతి, ఉద్యోగాలు ఇవ్వకుండా యువతను మభ్యపెడుతోందని ఆరోపించారు. అనంతరం భూమనతో పాటు మేయర్ శిరీష, చంద్రగిరి, తిరుపతి, సత్యవేడు వైసీపీ సమన్వయకర్తలు చెవిరెడ్డి మోహిత్, అభినయ్‌రెడ్డి, నూకతోటి రాజేష్ తదితరులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ ఆందోళనకు ముఖ్యనేతలు, పలువురు నియోజకవర్గ సమన్వయకర్తలు, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, పలువురు కార్పొరేటర్లు రాలేదు. కాగా, కొందరు వైసీపీ శ్రేణులు రోడ్డుపైకి చేరుకోవడంతో హైవేలో ఎక్కడ చూసిన వాహనాలు నిలిచిపోయాయి. వాహనదారులు ఇబ్బంది పడ్డారు.

**రంజాన్ వేళలు**

ఇఫ్తార్ (గురువారం) : 6.26

సహరి (శుక్రవారం) : 5.02




## టీటీడీ సీవీఎస్వోగా ఎస్పీకి అదనపు బాధ్యతలు



తిరుపతి(నేరవిభాగం) మార్చి 12(ఆంధ్రజ్యోతి): టీటీడీ సీవీఎస్వోగా జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజుకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు ఆ పోస్టులో చిత్తూరు ఎస్పీ మణికంఠ చందోలు కొనసాగారు. జనవరి 8న తిరుపతిలో జరిగిన తొక్కిసలాట నేపథ్యంలో టీటీడీ సీవీఎస్వో శ్రీధర్‌పై బదిలీ వేటు పడింది. ఆ స్థానంలో చిత్తూరు ఎస్పీ మణికంఠకు ప్రభుత్వం తాత్కాలికంగా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించింది ఆయన చిత్తూరు నుంచీ టీటీడీ నిఘా, భద్రతా వ్యవహారాలను పర్యవేక్షించడం ఇబ్బందిగా మారడంతో తిరుపతి ఎస్పీకి బాధ్యతలు అప్పగించడం సమంజసమని డీజీపీ ప్రభుత్వానికి నివేదించారు. దీంతో తిరుపతి ఎస్పీని టీటీడీ సీవీఎస్వోగా పూర్తి అదనపు బాధ్యతలతో నియమిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. శ్రీవారి ఆశీస్సులతో తనకు ఈ అవకాశం లభించిందని, టీటీడీ ఉన్నతాధికారులతో కలిసి భక్తులకు ఎలాంటి సేవలు అందించాలో ఆ దిశగా పనిచేస్తానని హర్షవర్ధన్‌రాజు చెప్పారు.

## ద్విచక్రవాహనంపై నుంచి పడి ఏఎస్ఐ గురుస్వామి మృతి



గురుస్వామి (ఫైల్ ఫొటో)

వడమాలపేట, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం వెనుక కూర్చుని వడమాలపేట ఏఎస్ఐ వై.గురుస్వామి(60) బుధవారం అప్పలాయగుంట వద్ద వస్తుండగా కిందపడి మృతి చెందారు. బైకు వెనుక ఒకవైపు కూర్చుని వస్తుండగా, ఉన్నట్లుండి కిందపడ్డారు. తలకు తీవ్రగాయమైంది. అక్కడే ఉన్న ఆరోగ్య సిబ్బంది ప్రథమ చికిత్స చేశారు. నిమిషాల వ్యవధిలోనే ఆయన మృతి చెందారు. గుండెపోటు వల్ల పడ్డారా అనే అనుమానాలూ వ్యక్తమవుతున్నాయి. కాగా, గురుస్వామి స్వస్థలం కార్వేటినగరం మండలం ఆర్కేవీబీ పేట. ప్రస్తుతం ఏర్పేడులో స్థిరపడ్డారు. రెండున్నరేళ్ల కిందట శ్రీకాళహస్తి నుంచి బదిలీపై వచ్చారు. ఈయనకు ఇద్దరు కుమారులున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించాక.. స్వగ్రామానికి తీసుకెళ్లారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ధర్మారెడ్డి చెప్పారు.



కనులపండువగా

## శ్రీనివాసుడి తెప్పోత్సవం

శ్రీవారి సాలకట్ల తెప్పోత్సవాల్లో భాగంగా నాలుగోరోజు బుధవారం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామి తెప్పపై విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను మాడవీధుల్లో ఊరేగించి శ్రీవారి పుష్కరిణి వద్దకు తీసుకువచ్చారు. సుందరంగా అలంకరించిన తెప్పపై రాత్రి 7 నుంచి 8 గంటల వరకు ఉత్సవమూర్తులు ఐదు చుట్లు విహరించి భక్తులను అనుగ్రహించారు. చివరి రోజైన గురువారం శ్రీవారు ఏడుసార్లు తెప్పపై విహరించనున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి





# అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షల విరాళం

తిరుమల శ్రీవారి అన్నప్రసాదం ట్రస్టుకు బెంగళూరుకు చెందిన మహాలక్ష్మి బుధవారం రూ.10 లక్షలు విరాళంగా అందించారు. ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును శ్రీవారి ఆలయం ముందు టీటీడీ సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో డిప్యూటీఈవో లోకనాథంకు దాత అందజేశారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



జస్టిస్ మాల



జస్టిస్ పీబీ భజంత్రీ



నిమ్మగడ్డ రమేష్‌కుమార్



శోభా చంద్రశేఖర్

## శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల శ్రీవారిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్ మాల, పట్నా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీబీ భజంత్రీ శ్రీవారి సేవలో పాల్గొన్నారు. అలాగే, రాష్ట్ర ఎన్నికల మాజీ కమిషనర్ నిమ్మగడ్డ రమేష్‌కుమార్, తమిళ సినీ హీరో విజయ్ తల్లి శోభా చంద్రశేఖర్ కూడా స్వామిని దర్శించుకున్నారు. వీరందరికీ ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

## శ్రీవారి సర్వదర్శనానికి 6 గంటలు

తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి దర్శనానికి 6 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 10 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.3.86 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 66,393

తలనీలాలు సమర్పించినవారు: 19,490





● నేడు వరల్డ్ కిడ్నీ డే



కిడ్నీ..శరీరంలో కీలకభూమిక పోషించే అవయవం. రెండు కిడ్నీలు శరీరంలోని వ్యర్థాలను శుభ్రం చేస్తూ మంచి రక్తాన్ని సరఫరా చేస్తాయి. ఈ అవయవాల్లో ఏర్పడే చిన్నపాటి రాళ్లను ఆరంభంలోనే గుర్తించి తొలగించకపోతే తీవ్ర అనారోగ్యం కలగజేస్తాయి. నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకంగా పరిణమిస్తాయి. ఈనేపథ్యంలోనే కిడ్నీవ్యాధిగ్రస్థులైన పేదలకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. రెక్కాడితేగాని డొక్కాడని బతుకులకు ఆరోగ్య భరోసా ఇస్తోంది.

- తిరుపతి (వైద్యం), ఆంధ్రజ్యోతి



డయాలసిస్ చేసుకుంటున్న కిడ్నీ బాధితులు

**కిడ్నీ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వ అండ**

**1440 మందికి డయాలసిస్ సేవలు**

**క్రమం తప్పకుండా నెలవారీ పింఛను**

# బాధితులకు 'దయా'లసిస్



జిల్లాలో 1440 మంది వరకు కిడ్నీ వ్యాధిబారిన పడి ప్రభుత్వ సాయంతో డయాలసిస్ చేయించుకుంటున్నారు. వీరికోసం ప్రభుత్వం నెఫ్రోప్లస్ ఆధ్వర్యంలో నాలుగు డయాలసిస్ కేంద్రాలను నిర్వహిస్తోంది. తిరుపతి స్విమ్స్‌లో అతి పెద్ద కేంద్రం పనిచేస్తోంది. నెలలో ఇక్కడ 870 మంది డయాలసిస్ సేవలు పొందుతున్నారు. రుయాలో 119, శ్రీకాళహస్తిలో 40, నగరిలో 25 మందికి డయాలసిస్ చేస్తున్నారు. కొన్ని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లోనూ ఈ సేవలను అందిస్తున్నారు.

### వైసీపీ ప్రభుత్వంలో హయాంలో నిర్లక్ష్యం

గత వైసీపీ ప్రభుత్వం కొవిడ్‌ను సాకుగా చూపి కిడ్నీ బాధితులకు 108 వాహనం ద్వారా కల్పించాల్సిన ఉచిత రవాణాకు స్వస్తి పలికింది. నెలకు ఇవ్వాల్సిన రూ.10 వేల పింఛను కూడా అరకొరగానే అందించింది. దూర ప్రాంతాల నుంచి డయాలసిస్ కోసం వచ్చే వారికి ఈ మొత్తం రవాణా ఖర్చులకు కూడా సరిపోయేది కాదు. పింఛను అందక డయాలసిస్ కూడా చేయించుకునేందుకు రవాణా ఖర్చులు లేక కొందరు మృత్యువాత పడిన సందర్భాలున్నాయి. దీనికితోడు డయాలసిస్ కేంద్రాల్లో మందుల కొరత, వైద్య పరికరాల కొరత తీవ్రంగా ఉండేది. ఏడాది కిందట బాధితులు స్విమ్స్ వద్ద దీనిపై ఆందోళనకు కూడా దిగాల్సివచ్చింది.

### కూటమి సారథ్యంలో మెరుగైన సేవలు

కూటమి ప్రభుత్వం ప్రజారోగ్యభద్రతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. కిడ్నీ వ్యాధి బాధితులకు పింఛన్లు సక్రమంగా అందడం లేదని గుర్తించింది. ప్రతినెలా నిర్దేశిత సమయానికి అందించేలా చర్యలు తీసుకుంది. ఈ విషయంలో జిల్లా యంత్రాంగానికి స్పష్టమైన ఆదేశాలను జారీ చేసింది. ఫలితంగా ప్రతి నెలా క్రమం తప్పకుండా నిరుపేదలైన బాధితులకు రూ.10 వేల పింఛను అందజేస్తోంది. డయాలసిస్‌కు వచ్చి వెళ్లేందుకు 108 వాహన సదుపాయాన్ని కూడా కల్పించింది.

### క్రమం తప్పకుండా ఇస్తున్నారు.

డయాలసిస్ అవసరమైనప్పటి నుంచి ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడ్డాను. గడిచిన మూడేళ్లలో డయాలసిస్ కోసం వెళ్లడానికి కూడా డబ్బులుండేవి కావు. కూటమి ప్రభుత్వం వచ్చాక పద్ధతిగా పింఛను ఇస్తున్నారు. ఉద్యోగుల జీతాల కంటే ముందుగానే మాలాంటి వాళ్లకు నెలకు రూ.10వేలు ఇస్తున్నారు.

- మునస్వామి, కేవీఆర్‌పురం

### ఏడాది క్రితం ఎన్ని కష్టాలో..

ఏడాది కిందట పింఛను కోసం నానా అగచాట్లు పడ్డాను. అధికారుల చుట్టు తిరిగినా నెలలు తరబడి ఇవ్వలేదు. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. నాలుగు నెలలుగా క్రమం తప్పకుండా పింఛను అందుతోంది. ఇప్పుడు బాగానే ఉంది.

- వెంకటేష్, వరదయ్యపాళెం





### పింఛనే బతుకు మార్గమైంది..

గతంలో పింఛను సక్రమంగా అందక చాలా ఇబ్బందులు పడేదాన్ని. మందులు కొనుక్కోడానికి చేతిలో డబ్బులు లేక నరకం అనుభవించాను. ప్రస్తుతం ఆ సమస్య లేదు. ప్రతి నెలా రూ.10 వేల పింఛను అందుతోంది. ఆ మొత్తం మందులకే కాదు జీవనోపాధికి కూడా తోడ్పడుతోంది

- శకుంతల, మంగళం(తిరుపతి)



● ఆకట్టుకున్న 'విరించి-2కె25' ప్రదర్శనలు

● పద్మావతి వర్సిటీలో వేడుకలు ప్రారంభం

# సాంస్కృతికోత్సాహం







తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీ బుధవారం సాంస్కృతిక ప్రదర్శనలకు వేదికైంది. సంగీత సాహిత్య సమలంకృతే.. స్వర రాగ పదయోగ సమ భూషితే.. అంటూ రెండు రోజుల పాటు విరించి-2కె25 పేరిట జరిగే కళావేడుకలు బుధవారం ప్రారంభమయ్యాయి. యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ వెన్నం ఉమ, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్.రజని, కూచిపూడి నృత్యకారిణి డాక్టర్ హిమబిందు కనోజ్ ఈ ఉత్సవాన్ని ప్రారంభించారు. క్రీడా, సాంస్కృతిక అంశాల ద్వారా సృజనాత్మకత, మానసిక వికాసం ఏర్పడతాయన్నారు. యూనివర్సిటీలో సంగీత, సాహిత్యాల్లో బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో అద్వితీయమైన కృషి సాగిందన్నారు.



ఇటీవల నోయిడాలోని అమెటి యూనివర్సిటీలో నిర్వహించిన జాతీయ స్థాయి యువజనోత్సవాల్లో తమ విద్యార్థులు విజేతలుగా నిలిచారని గుర్తుచేశారు. అనంతరం నిర్వహించిన వివిధ సంగీత, నృత్య ప్రతిభా పోటీలు ఆకట్టుకున్నాయి. ఇందిరా ప్రియదర్శినీ ఆడిటోరియంలో సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో పలువురు అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



### మిస్ విరించిగా హీనా సయ్యద్

విరించిలో భాగంగా ఫ్యాషన్ షో నిర్వహించారు. లా డిపార్ట్‌మెంట్‌కు చెందిన హీనా సయ్యద్ మొదటి స్థానంలో నిలిచి మిస్ విరించిగా ఎంపికయ్యారు. ఎల్ఎల్‌బీ విద్యార్థిని నాగభవానీ ద్వితీయ, సీఎస్ఈ విద్యార్థిని ఎన్.మనస్విని మూడవ స్థానంలో నిలిచారు.

ఉపాధ్యాయుడి

# సస్పెన్షన్

నాయుడుపేట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేటలోని పాఠశాలలో పనిచేస్తున్న గణిత ఉపాధ్యాయుడు ప్రభాకర్‌ను హనీట్రాప్ అంశంపై సస్పెండ్ చేస్తున్నట్లు డీఈవో బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓ దళిత విద్యార్థినిపై హనీట్రాప్ జరిగిందన్న అభియోగంపై గూడూరు డీవైఈవో, విచారణ అధికారి సనత్‌కుమార్ ఇచ్చిన ప్రాథమిక నివేదిక మేరకు ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.

మామండూరులో ఈతకు వెళ్లి

## బీటెక్ విద్యార్థి మృతి



ఆకాష్ మృతదేహం

రేణిగుంట, మార్చి 12, (ఆంధ్రజ్యోతి): రేణిగుంట మండలం మామండూరులో ఈతకు వెళ్లి బీటెక్ విద్యార్థి మృతి చెందాడు. ఈ సంఘటన బుధవారం మధ్యాహ్నం జరిగింది. రేణిగుంట అర్బన్ ఎస్ఐ అరుణ్ కుమార్ తెలిపిన ప్రకారం.. తిరుపతిలోని ఓ కళాశాలలో బీటెక్ చదువుతున్న 10 మంది విద్యార్థులు మామండూరుకు వెళ్లారు. ఇక్కడ అటవీ సిబ్బంది దగ్గర టిక్కెట్లు కొని గెస్ట్‌హౌస్‌లో విశ్రాంతి తీసుకున్నారు. ఆ తర్వాత నీటిలో ఈత కొడుతుండగా ఆకాష్ (20) మునిగిపోయాడు. సహచరులు అతడిని వెలికితీసి పోలీసులకు, 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. అంబులెన్స్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని విద్యార్థిని రుయాస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతిచెందాడు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్వీయూలో మాస్టర్ ప్లాన్

# రోడ్ల నిర్ణయం రద్దు

● శాసన మండలిలో మంత్రి నారాయణ ప్రకటన ● విద్యార్థి సంఘాల హర్షం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 12 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో ఎస్వీయూ విద్యార్థులు.. పూర్వ విద్యార్థులు చేపట్టిన ఆందోళనకు.. ఇప్పుడు ఫలితం లభించింది. ఎస్వీయూలో మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్ణయాన్ని రద్దు చేస్తున్నట్లు బుధవారం శాసన మండలిలో మంత్రి నారాయణ ప్రకటించారు. దీనిపై విద్యార్థి సంఘాలు హర్షం వ్యక్తంచేశాయి. చంద్రగిరి- తిరుపతి రోడ్డుకు, అలిపిరి- జూపార్క్‌ను కలిపే మూడు రోడ్లను రూ. 4 కోట్లకు పైగా ఎస్వీ యూనివర్సిటీ లోపలి నుంచే వేయాలని గతంలో నిర్ణయించారు. జూపార్క్ సమీపంలో గల ఒబెరాయ్ హోటల్‌ను అనుసంధానించడానికే ఈ రోడ్ల నిర్మాణం చేపడుతున్నారంటూ అప్పట్లో తీవ్ర విమర్శలు వచ్చాయి. ఎస్వీయూనివర్సిటీ విద్యార్థులు, పూర్వ విద్యార్థులు కూడా మాస్టర్ ప్లాన్ రోడ్లను వ్యతిరేకించారు. అనేక విద్యార్థి సంఘాలు ఒక్కటిగా యూనివర్సిటీ వేదికగా పటిష్ట ఉద్యమాన్ని చేపట్టారు. అయినా, అప్పట్లో ప్రజాప్రతినిధులు సానుకూలంగా స్పందించలేదు. ఆ కూటమి పార్టీలు అధికారంలోకి వచ్చాయి. ఈ క్రమంలో యూనివర్సిటీ మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్ణయాన్ని ప్రస్తుత ప్రభుత్వం రద్దు చేసింది. ఈ నిర్ణయం మంచి పరిణామమని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల ఆనంద్‌గౌడ్ హర్షం వ్యక్తంచేశారు. శాసనమండలిలో ఈ అంశాన్ని లేవనెత్తిన ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డికీ, మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్ణయాన్ని రద్దు చేస్తున్నట్టు ప్రకటించిన మంత్రి నారాయణకు కృతజ్ఞతలు తెలిపారు.

## తిరుచానూరులో ఐజీఎన్‌సీఏ ప్రాంతీయ కేంద్రం



ప్రారంభ కార్యక్రమంలో డాక్టర్ సచ్చిదానందజోషి, డైరెక్టర్ ప్రియాంకమిశ్రా, సంస్కృత వర్సిటీ వీసీ కృష్ణమూర్తి, రిజిస్ట్రార్ వెంకటనారాయణ, పులివర్తి సుధారెడ్డి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 12 (ఆంధ్రజ్యోతి): అపురూపమైన భారతీయ కళా వారసత్వాన్ని పరిరక్షించుకోవలసిన అవసరం ఉందని పలువురు పేర్కొన్నారు. జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం సహకారంతో ఇందిరాగాంధీ నేషనల్ సెంటర్ ఫర్ ద ఆర్ట్స్ (ఐజీఎన్‌సీఏ) ద్వారా తిరుచానూరులో బుధవారం 10వ ప్రాంతీయ కేంద్రాన్ని ప్రారంభించారు. సంస్కృత వర్సిటీకి మాజీ స్పీకర్ దివంగత మాడభూషి అనంతశయనం అయ్యంగార్ గతంలో ఇచ్చిన భవనంలో దీనిని నిర్వహించనున్నారు. కేంద్రాన్ని ఐజీఎన్‌సీఏ మెంబర్ సెక్రటరీ డాక్టర్ సచ్చిదానందజోషి, డైరెక్టర్ ప్రియాంకమిశ్రా, సంస్కృత వర్సిటీ వీసీ ప్రొఫెసర్ కృష్ణమూర్తి, రిజిస్ట్రార్ వెంకటనారాయణ, పులివర్తి సుధారెడ్డి ప్రారంభించారు. వైష్ణవ ఆగమాలు, శిల్ప కళల్ని ప్రోత్సహించి ఆధునిక తరానికి అందించాలని సంకల్పించడం గొప్ప విషయమన్నారు.. కాశీ నుంచీ తెచ్చిన అగస్త్య మహర్షి ప్రతిమను ఈ సందర్భంగా ప్రదర్శించారు. కార్యక్రమంలో పద్మ సుబ్రమణ్యం, ఢిల్లీకి చెందిన విద్యావేత్త మాళవికాజోషి, పాండిచ్చేరి రీజినల్ సెంటర్ డైరెక్టర్ రాఘవన్, అసిస్టెంట్ డైరెక్టర్ అనితాసూరి, ప్రొఫెసర్ సుమిత్, సంస్కృత వర్సిటీ డీన్ ప్రొఫెసర్ దక్షిణామూర్తిశర్మ, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్లు కనపాల కుమార్, పీఆర్వో రమేష్‌బాబు పాల్గొన్నారు.

# 'ఫిట్‌లెస్' వాహనాలు!

● పలు ప్రైవేటు బస్సుల పరిస్థితి ఇదీ

● చోద్యం చూస్తున్న అధికారులు



బోల్తా పడ్డ పాఠశాల బస్సు (ఫైల్ ఫొటో)

తడ, మార్చి 12(ఆంధ్రజ్యోతి): రవాణాకు ఉపయోగించే బస్సుల్లో చాలావరకు పూర్తిస్థాయిలో ఫిట్‌నెస్ ఉండటం లేదు. అవి ఎప్పుడు.. ఎక్కడ.. ఎలా ఆగిపోతాయో, ప్రమాదాల బారిన పడతాయో తెలియని పరిస్థితి. వీటిపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారు. పారిశ్రామికంగా సూళ్లూరుపేట నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందింది. నాయుడుపేట మండలం మేనకూరు.. తడ మండలం మాంబట్టుతోపాటు సత్యవేడు నియోజకవర్గ పరిధిలో శ్రీసిటీ సెజ్‌లు ఉన్నాయి. 250కు పైగా పరిశ్రమలు ఏర్పాటు కావడం, సుమారు లక్ష మంది వరకు ఉద్యోగులు, కార్మికులు ఆయా పరిశ్రమల్లో పనిచేస్తున్నారు. వీరికోసం ప్రైవేట్ బస్సులను ఏర్పాటు చేసుకున్నారు. 500కు పైగా బస్సులు ఆయా ఉద్యోగులను, కార్మికులను పరిశ్రమలకు చేర్చేపనిలో ఉన్నాయి. మరోవైపు ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు విద్యార్థుల కోసం బస్సులను ఏర్పాటు చేశాయి. ఇవి కూడా సుమారు వంద వరకు ఉన్నాయి. ఇలా జనాన్ని తీసుకెళ్లే ఈ ప్రైవేటు బస్సులు.. ఫిట్‌నెస్ సమస్యను ఎదుర్కొంటున్నాయి. కాలంచెల్లిన బస్సులకు తూతూమంత్రంగా మరమ్మతులు చేసి, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు పొంది వినియోగిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. వాస్తవంగా విద్యార్థులను తరలించే బస్సులు 15 ఏళ్ల తరువాత వినియోగించరాదు. కిటికీలకు ప్రత్యేక గ్రిల్స్ ఏర్పాటు చేయాలి. ఇలా భద్రతాపరమైన చర్యలతో పాటు సరైన సమయానికి మరమ్మతులు చేయిస్తూ ప్రభుత్వ నిబంధనల మేరకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లను పొందాలి. ఇంత తతంగాన్ని ఆయా బస్సుల యజమానులు చేయకనే సంబంధిత రవాణాశాఖ అధికారులను మభ్యపెట్టి ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు తీసుకుంటున్నారన్న విమర్శలున్నాయి. కొన్ని బస్సులు ప్రమాదాల బారిన పడటం లేదా ఎక్కడ పడితే అక్కడ ఆగిపోవడంతో ఈ విమర్శలకు బలమిస్తున్నాయి. గత నెల 21న ఓ స్కూల్ బస్సు బోల్తా పడగా.. ఇటీవల ఓ పరిశ్రమకు చెందిన బస్సు కార్మికులను తీసుకువెళ్తూ వరదయపాళెం మండలం సామంతమల్లాం సమీపంలో బోల్తా కొట్టింది. ఈ రెండు ఘటనల్లో చిన్నపాటి గాయాలతోనే బయటపడ్డారు. భవిష్యత్తులో పెద్ద ప్రమాదాలు జరగకుండా రవాణాశాఖ అధికారులు బస్సుల ఫిట్‌నెస్‌పై దృష్టిపెట్టి.. కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.



రోడ్డుపై బస్సుకు మరమ్మతులు చేపడుతున్న సిబ్బంది

స్టీరింగ్ రాడ్ విడిపోయి

## ఆగిన బడి బస్సు

గూడూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): గూడూరులోని సంఘం థియేటర్ సెంటర్ కూడలి వద్ద బుధవారం ఓ ప్రైవేటు పాఠశాల బస్సు వెళుతుండగా స్టీరింగ్ రాడ్ విడిపోయింది. దీంతో అతికష్టం మీద బస్సును డ్రైవరు నిలిపేశారు. దీంతో కొంత సేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పట్టణంలో.. తక్కువ వేగంతో వెళ్తుండటం వల్ల సరిపోయింది కానీ.. అదే, శివారు ప్రాంతాల్లో వేగంగా వెళ్తుంటే మాత్రం ప్రమాదం తీవ్రంగా ఉండేదన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ బస్సుల కండిషన్ విషయంలో రవాణాశాఖ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి అనుమతులిస్తే ఇలాంటివి చోటు చేసుకోవని స్థానికులు అంటున్నారు.

## రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు




స్పీడ్‌గన్‌ను పరిశీలిస్తున్న డీఎస్పీ గీతాకుమారి

చిల్లకూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాలను నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టడం జరిగిందని డీఎస్పీ గీతాకుమారి అన్నారు. బుధవారం మండలంలోని వరగలి క్రాస్‌రోడ్డు సమీపంలో స్పీడ్ గన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్పీడ్ గన్ ద్వారా అతివేగంగా వచ్చే వాహనాలను, వ్యతిరేక దిశలో వెళ్లే వాహనాలను, హెల్మెట్, ధృవీకరణ పత్రాలు లేని వాహనదారులను గుర్తించి జరిమానా విధించడం జరుగుతుందన్నారు. వాహనదారులు నిబంధనలు పాటిస్తూ వాహనాలను నడపాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ సురేష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజలో పాల్గొన్న పరిశ్రమ ప్రతినిధులు, గ్రామస్తులు

ఓజిలి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం అత్తివరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం ప్రహరీ నిర్మాణానికి బుధవారం భూమిపూజ నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రానికి ప్రహరీ లేకపోవడంతో ఎదురవుతున్న ఇబ్బందులను గుర్తించిన టీడీపీ సీనియర్ నేత, కుందాం సొసైటీ మాజీ చైర్మన్ కనుమూరు గోపాలరెడ్డి అత్తివరం పంచాయతీ పరిధిలోని బీజేడీ ఆక్సైడ్స్ ప్రవేట్ లిమిటెడ్ కంపెనీ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన పరిశ్రమ యాజమాన్యం కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద రూ.8 లక్షలు ఇచ్చేందుకు అంగీకరించింది. దీంతో బుధవారం ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎల్లు గురుమూర్తి, అనిల్‌రెడ్డి, పరిశ్రమ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఆంజనేయస్వామి ఆలయంలో చోరీకి యత్నం

నాయుడుపేట టౌన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అగ్రహార పేటలో వెలసిన ఆంజనేయస్వామి ఆలయంలో చోరీ యత్నం జరిగింది. మంగళవారం అర్ధరాత్రి ఆలయ ప్రధాన గేటు తాళాలు పగలగొట్టి లోపలకు ప్రవేశించిన దొంగలు హుండీ చోరీకి యత్నించారు. హుండీ తలుపు తెరుచుకోకపోవడంతో వెళ్లిపోయారు. ముగ్గురు యువకులు మోటరు సైకిల్‌పై వచ్చి చోరీకి యత్నించినట్లు సీసీ కెమెరాలో నమోదై ఉంది. పోలీసులు సంఘటనాస్థలికి చేరుకొని వివరాలు నమోదు చేసుకొని సీసీ ఫుటేజీలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మోడల్ స్కూల్లో ఇంటర్ ప్రవేశానికి నోటిఫికేషన్

వెంకటగిరి టౌన్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియట్ ప్రవేశానికి నోటిఫికేషన్ జారీ చేసినట్లు ప్రిన్సిపాల్ తులసీ జ్యోతి బుధవారం తెలిపారు. ఈనెల 17 నుంచి మే 22వ తేదీ వరకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఎంఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

## జాతీయస్థాయి ఆర్చరీ పోటీలకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

గూడూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఎల్ఏపీ పాఠశాల కరస్పాండెంట్ శ్రీకాంత్‌రెడ్డి అభినంచారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఇటీవల విజయవాడలో జరిగిన అంతర్ జిల్లాల ఆర్చరీ పోటీల్లో తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు లక్ష్మీ షణ్ముకమనదీప్, లోహిత్ కుమార్ యాదవ్, చంద్రతేజ, చరిత్ జాతీయస్థాయికు ఎంపిక య్యారని తెలిపారు. ఈనెల 20నుంచి 29వ తేదీ వరకు గుంటూరులోని నాగార్జున యూనివర్సిటీలో జరగనున్న పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో కోచ్ శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ ఆవిర్భావ దినోత్సవం

గూడూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): గూడూరు పట్టణంలో బుధవారం వైసీపీ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమం నామమాత్రంగా జరిగింది. అంబేడ్కర్ నగర్‌లోని వైఎస్సార్ విగ్రహానికి వైసీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. శుభాన్, అఖిల్, రాఘవరెడ్డి, పూర్ణ తదితరులు పాల్గొన్నారు. వైసీపీ ఆవిర్భావ దినోత్సవంలో నియోజకవర్గ ఇన్‌చార్జి కానీ, సీనియర్ నాయకులు కానీ పాల్గొనకపోవడం చర్చనీయాంశం అయింది.

**ఓజిలి:** స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద వైఎస్సార్ విగ్రహానికి ఆ పార్టీ నాయకులు నివాళులర్పించారు. బస్టాండు వద్ద పార్టీ జెండా ఎగురవేశారు. మండల కన్వీనరు హరినాథరెడ్డి, ఎంపీపీ అరుణమ్మ, వైస్ ఎంపీపీ ప్రసాద్‌నాయుడు, ఆరిమేనిపాడు ఎంపీటీసీ గుంటమడుగు రఘురామరాజు తదితరులు పాల్గొన్నారు.

**కోట:** స్థానిక క్రాస్‌రోడ్డులో వైఎస్సార్ విగ్రహానికి వైసీపీ మండల కన్వీనర్ సంపత్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నివాళులర్పించారు. సాయిప్రసాద్‌రెడ్డి, హరిచంద్రారెడ్డి, చెంచురాఘవరెడ్డి, నాగూర్‌రెడ్డి, రమణయ్య, జగదీష్, విజయసారధిరెడ్డి, పాముల సురేంద్ర, సుధారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**నాయుడుపేట టౌన్:** పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య నివాసం వద్ద వైసీపీ పట్టణ అధ్యక్షుడు కలికి మాధవరెడ్డి ఆధ్వర్యంలో ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, తంబిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి, కామిరెడ్డి రాజారెడ్డి, కురుగొండ ధనలక్ష్మి, బైనా మల్లికార్జున్‌రెడ్డి, జయరామయ్య పాల్గొన్నారు.

**వాకాడు:** మండలంలోని అశోక్‌పిల్లర్ సమీపంలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించారు. వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి కొడవలూరు భక్తవత్సల్ రెడ్డి, ఏనుగు సుధాకర్‌నాయుడు, దువ్వూరు విజయభాస్కర్‌రెడ్డి, వాకాటి జనార్ధన్‌రెడ్డి, వాకాటి రవి, తదితరులు పాల్గొన్నారు.

**వెంకటగిరి టౌన్:** స్థానిక ఎన్‌జేఆర్ భవన్‌లో వైపీపీ పట్టణ కన్వీనర్ పులి ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ ఆవిర్భవ దినోత్సవం నిర్వహించారు వైసీపీ కౌన్సిలర్ వహిద, ఆరి శంకరయ్య, కల్యాణి, సుజాత, పేచీరాజ్, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**సూళ్లూరుపేటలో వేర్వేరుగా**

**సూళ్లూరుపేట:** పట్టణంలో వైసీపీ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య వ్యతిరేకం వర్గం, అనుకూల వర్గం వేర్వేరుగా నిర్వహించాయి. స్థానిక ఆర్అండ్‌బీ బంగ్లా వద్ద మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ జెండా ఎగరవేశారు. ఆర్టీసీ బస్టాండు వద్ద వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించారు. అదేవిధంగా వైసీపీ పట్టణ అధ్యక్షుడు వేలపాలెం కృపాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎంపీపీ అల్లూరు అనిల్‌రెడ్డి కార్యాలయం వద్ద పార్టీ జెండా ఎగురవేశారు. తడ ఎంపీపీ కొళవి రఘురెడ్డి, వైసీపీ నాయకులు తిరుపాల్, గండవరం సురేష్ రెడ్డి, జెట్టి వేణుయాదవ్, కళత్తూరు సునీల్ రెడ్డి, యుగంధర్, అలవల సురేష్, మీజూరు రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేత్రదానం



ప్రణీత్(ఫైల్‌ఫొటో)

సూళ్లూరుపేట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సాయినగర్‌కు చెందిన ప్రణీత్(21) అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల అంగీకారంతో ఆయన నేత్రాలను ఆచార్య భరద్వాజ సేవా సంస్థ ఆధ్వర్యంలో సేకరించి చెన్నై శంకరనేత్రాలయకు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు చంద్రబాబు, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

## ఉరేసుకుని బిహార్‌వాసి ఆత్మహత్య



మృతిచెందిన ఇస్మాయిల్

గూడూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక అడివయ్య కాలనీ సమీపంలోని బేల్దారి కాలనీలో నివాసం ఉంటున్న బిహార్ రాష్ట్రానికి చెందిన మహ్మద్ ఇస్మాయిల్(35) ఆత్మహత్య చేసుకున్నాడు. రెండో పట్టణ సీఐ శ్రీనివాస్ తెలిపిన వివరాలు... మహ్మద్ ఇస్మాయిల్(35) మూడేళ్లుగా బేల్దారికాలనీలోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటూ బేల్దారి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. అతని కుటుంబ సభ్యులు బిహార్‌లోనే ఉంటున్నారు. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో తీవ్ర మనస్థానానికి గురైన ఇస్మాయిల్ తాను అద్దెకు ఉంటున్న ఇంట్లో ఫ్యాన్‌కు బుధవారం ఉరేసుకుని మృతి చెందాడు. స్థానికుల ద్వారా సమాచారం అందడంతో పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు.

# ట్రాఫిక్ సమస్య తీరదా?



సంగం థియేటర్ సెంటర్ వద్ద నిలిచిపోయిన వాహనాలు

గూడూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ట్రాఫిక్ సమస్య జటిలంగా మారుతుండడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో సంగం థియేటర్ సెంటర్ నుంచి టవర్‌క్లాక్ సెంటర్ వరకు తరచుగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. ప్రధానంగా పట్టణంలోకి ఆర్టీసీ బస్టాండు నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లే ప్రధాన రహదారి సంగం థియేటర్, కుమ్మరవీధి సెంటర్ మీదుగా ఆస్పత్రి రోడ్డు గుండా రాకపోకలు సాగించాల్సి ఉంటుంది. ఈ మార్గం ద్వారానే ఇటు చిల్లకూరు, జాతీయ రహదారి వైపు, అటు వెంకటగిరి, రాపూరు మార్గాల్లోనూ రాకపోకలు సాగిస్తుంటారు. ప్రధాన రహదారి కావడంతో నిత్యం వాహనాల రద్దీ ఉంటుంది. అంతే కాకుండా పలు ప్రభుత్వ కార్యాలయాలు, ఏరియా ఆస్పత్రి, విద్యాసంస్థలు, సమీప గ్రామాల నుంచి పట్టణంలోకి వచ్చేవారు ఈ మార్గంలోనే రాకపోకలు సాగించాల్సి ఉంటుంది. దీంతో ఉదయం 9 గంటల నుంచి, సాయంత్రం 7 గంటల వరకు ఈ మార్గంలో ట్రాఫిక్ ఎక్కువగా ఉంటుంది. ఇదే సమయంలో మేతకు వెళ్లే పశువులు కూడా ఈ దారి నుంచే వెళుతుండంతో ట్రాఫిక్‌లో చిక్కుకుపోవాల్సి వస్తోందని వాహనదారులు ఆవేదన చెందుతున్నారు. ఈ రహదారి వెంబడే దుకాణాలు, ఆస్పత్రులు ఉండడంతో వాహనాల పార్కింగ్ వల్ల రాకపోకలకు అడ్డంకిగా మారుతోంది. ఒక్కసారి ట్రాఫిక్ నిలిచిపోతే సుమారు అర కిలోమీటర్ వరకు వాహనాలు బారులు తీరుతున్నాయి. అధికారులు స్పందించి పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# సమాజ నిర్మాణంలో మహిళలే కీలకం



మహిళా దినోత్సవ ముగింపు కార్యక్రమంలో డీమ్డ్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ భారతి హరిశంకరన్, షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్, డిప్యూటీ డైరెక్టర్ గ్రహదురై తదితరులు

సూళ్లూరుపేట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): సమాజ నిర్మాణంలో మహిళలే కీలకమని కోయంబత్తూరు డీమ్డ్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ భారతి హరిశంకరన్ అన్నారు. బుధవారం సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం షార్‌లోని బ్రహ్మప్రకాష్ హాలులో జాతీయ మహిళా దినోత్సవ ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భారతి హరిశంకరన్ విచ్చేశారు. ముందుగా జ్యోతి ప్రజ్వళన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పురుషులతో సమానంగా మహిళలు పోటీ పడుతూ అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. ముఖ్యంగా ఇస్రో కీలక విభాగాల్లో మహిళలు శాస్త్రవేత్తలుగా ఎదిగి ఉపగ్రహాలను అంతరిక్షంలోకి పంపుతుండడం దేశానికే గర్వకారణమన్నారు. పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ అన్నారు. మహిళా ఉద్యోగులకు పలు పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో షార్ కంట్రోలర్ ఎం.శ్రీనివాసులు రెడ్డి, ఆర్వో డిప్యూటీ డైరెక్టర్ గ్రహదురై, రమేష్ బాబు, షార్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయండి



కమిషనర్ కృష్ణతేజకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

గూడూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): గూడూరు నియోజకవర్గ పరిధిలో పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణతేజను ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ కోరారు. బుధవారం విజయవాడలో కమిషనర్‌ను కలిసిన ఎమ్మెల్యే నియోజకవర్గ పరిధిలో ఉపాధి పథకం కింద చేపట్టాల్సిన పనుల గురించి వివరించారు. ఇందుకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరారు.

## కాలువ పూడ్చారు

వెంకటగిరిటౌన్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తోలిమిట్ట అంకమ్మ చెట్టు వీధిలో తవ్విన కాలువను మున్సిపల్ సిబ్బంది పూడ్చి వేయించారు. అంకమ్మ చెట్టు వీధిలో పైపులైన్ దెబ్బతిని ఏడాదిగా నీళ్లు రావడం లేదని స్థానికులు ఫిర్యాదు చేయడంతో మున్సిపాలిటీ సిబ్బంది మరమ్మతుల కోసం కాలువ తవ్వి వదిలేశారు. దీనిపై ఆంధ్రజ్యోతిలో బుధవారం కథనం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. ఎక్స్‌కవేటర్ సాయంతో కాలువను పూడ్చి వేసి వీధిలో మట్టి లేకుండా శుభ్రం చేయించారు.

## రైస్ మిల్లును తరలించండి

సూళ్లూరుపేట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణం వట్రపాలెం ప్రాంతంలో ఇళ్లకు అనుకొని ఉన్న రైస్‌మిల్లును అక్కడి నుంచి తరలించాలని కోరుతూ స్థానికులు బుధవారం ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఏడీపీఎస్ నాయకుడు సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో వట్రపాలెం వాసులు ఆర్డీవో కార్యాలయానికి చేరుకొని నిరసన తెలిపారు. రైస్‌మిల్లు నుంచి వెలువడుతున్న ధూళి వల్ల అనారోగ్యానికి గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. జనావాసాల మధ్య ఉన్న రైస్‌మిల్లును అక్కడి నుంచి తరలించాలని ఆర్డీవో కార్యాలయ ఏవో రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

## కలుజు ఎత్తు పెంచడంతో నీట మునిగిన పంట పొలాలు

పెళ్లకూరు, మార్చి 12 (ఆంధ్రజోతి): దొరవారిసత్రం మండలం వేణుంబాక చెరువు కలుజు ఎత్తు పెంచడంతో తమ పంటలు నీట మునిగాయని పెళ్లకూరు మండలంలోని బంగారంపేట రైతులు వాపోతున్నారు. బాధిత రైతులు గుండుబోయిన పులయ్య, సమాధి శ్రీనివాసులు, బుడతోటి డిల్లెయ్య, మహేష్, మస్తాన్, బందిల చంద్రయ్య, శంకరయ్య, వెంకటేశ్వర్లు, వెంకటసుబ్బయ్య, సురేష్ తదితరులు మాట్లాడుతూ వేణుంబాక చెరువు కలుజు ఎత్తు పెంచడంతో అలుగుకు కూడా మట్టిని అడ్డుగా పోసేశారని, దీంతో తమ వరి పంటలు నీట మునగాయన్నారు. పంటల కోత వరకు నీళ్లు తగ్గించాలని వేణంబాకం రైతులను కోరితే అంగీకరించడం లేదని, పంటల్లో నీళ్లుంటే కోతలు ఎలా చేపట్టాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు చొరవ తీసుకుని సమస్యను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

## నిమ్మలో సస్యరక్షణపై అవగాహన

వెంకటగిరి టౌన్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): నిమ్మ సాగుతో నిర్ణీత సమయాల్లో సస్యరక్షణ తప్పనిసరిగా చేపట్టాలని ఉద్యానవన శాఖ అధికారి దశరథరామి రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక నిమ్మ, చీని పరిశోధన కేంద్రం వద్ద రైతులకు అవగాహన కల్పించారు. పురుగు మందుల వాడకాన్ని తగ్గించి జీవన ఎరువులు వాడాలన్నారు. భూమిలో సేంద్రియ కర్బనం పెంచితే తెగుళ్ల ఉధృతి తగ్గి దిగుబడి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌వో ఆనంద్‌రెడ్డి, శారద, కార్తీక్, భరద్వాజ్, రైతులు పాల్గొన్నారు.

## పరీక్షా సామగ్రి పంపిణీ

కోట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కోట మండలం పెదగోవిందపల్లి ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు బుధవారం మంజుక్రాంతి అధినేత దేవీసింగ్, నగేష్ దాతృత్వంతో పరీక్షా సామగ్రిని పంపిణీ చేశారు. పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు పలుకుతూ హెచ్‌ఎం గిరిధర్‌బాబు, ఉపాధ్యాయులు సరస్వతీ పూజ నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు తిరుమూరు మురళి, అనూక్, దిలీప్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

## పీ-4 సర్వేని పకడ్బందీగా నిర్వహించాలి

వాకాడు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టిన పీ-4 సర్వేని పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీవో శ్రీనివాసులు అన్నారు. మండలంలోని నెలిపూడి సచివాలయంలో బుధవారం రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పంచాయతీల లాగిన్‌లలో ప్రతి ఇంటికి సంబంధించిన డేటా అందుబాటులో ఉందన్నారు. సిబ్బంది విధిగా ఇంటింటికీ వెళ్లి 16 అంశాలపై పూర్తి డేటాను సేకరించి ఎంట్రీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో డిజిటల్ అసిస్టెంట్ జితేంద్ర, మహిళా పోలీస్ అమరావతి, ఏఎన్ఎం నాగమణి, వెల్ఫేర్ అసిస్టెంట్ ప్రసన్న పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతిచెందిన శ్రీనివాసులు

చిల్లకూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోట క్రాస్‌రోడ్డు సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు... గూడూరు మండలం పోటుపాళెం గ్రామానికి చెందిన శ్రీనివాసులు(45) గూడూరు వైపు నుంచి రెట్టపల్లి గ్రామానికి బైక్ వెళుతుండగా అదుపుతప్పి జాతీయ రహదారికి పక్కన ఉన్న టెలిఫోన్ స్తంభాన్ని ఢీకొని మృతిచెందాడు. డీఎస్పీ గీతాకుమారి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## కోడి పందేల స్థావరంపై దాడులు ఏడుగురి అరెస్టు

డక్కిలి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): డక్కిలి మండలం ఆల్తూపాడు అడవుల్లో కోడి పందేల స్థావరంపై ఎస్ఐ శివశంకర్ ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం సాయంత్రం దాడి చేశారు. ఏడుగురిని అరెస్టు చేసి, మూడు కోళ్లు, రూ.8150 నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## వేణుగోపాలుడికి గరుడసేవ

సూళ్లూరుపేట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మంగళంపాడులో వెలసిన సౌందర్యవల్లీ రుక్మిణీ సత్యభామా గోదా సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం వేణుగోపాలుడు గరుడ వాహనంపై గ్రామవీధుల్లో ఊరేగారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి దర్శించుకొన్నారు.

## పరీక్షల్లో ఒత్తిడికి గురికావొద్దు

సూళ్లూరుపేట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పరీక్షల సమయంలో విద్యార్థులు ఒత్తిడికి గురికావొద్దని మన్నారుపోలూరు జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజశేఖర రెడ్డి అన్నారు. బుధవారం పాఠశాలలో సరస్వతి పూజ నిర్వహించారు. విద్యార్థులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. అలాగే సూళ్లూరుపేట బాలికల పాఠశాల, కోట పోలూరు జడ్పీ ఉన్నత పాఠశాలల్లో సరస్వతి పూజ నిర్వహించారు.

## బస్టాండ్‌లోకి దూసుకెళ్లిన లారీ తృటిలో తప్పిన ప్రమాదం

కోట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మైక్రోటవర్ కాలనీ వద్ద బుధవారం ఓ ఖాళీ లారీ పాడుబడిన బస్టాండ్‌లోకి దూసుకువెళ్లింది. గూడూరు నుంచి కోట వైపు వెళ్తున్న లారీ మైక్రోటవర్ కాలనీ వద్ద అదుపుతప్పి పాడుబడిన బస్టాండ్‌లోకి వెళ్లింది. ఈ సంఘటనలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు.

## క్రమశిక్షణతోనే లక్ష్య సాధన



సరస్వతీదేవి పూజలో విద్యార్థులు

డక్కిలి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తే అనుకొన్న లక్ష్యాన్ని సులభంగా చేరుకొంటారని వెంబులూరు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చెరుకూరి చెన్నయ్య అన్నారు. బుధవారం పాఠశాలలో సర్వస్వతీ దేవి పూజ నిర్వహించారు. అలాగే విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లిఖార్జున రావు, విద్యా కమిటీ చైర్మన్ పాయసం సులోచనమ్మ, గాలి గోపాలయ్య, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పేద మహిళలకు దుస్తుల పంపిణీ

గూడూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఎంఎఫ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక షాదీమంజిల్‌లో 786 మంది పేద మహిళలకు దుస్తులను పంపిణీ చేశారు. ట్రస్ట్ అధ్యక్షుడు మగ్దూం మాట్లాడుతూ పేదలందరూ రంజాన్ పండుగను సంతోషంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో దుస్తులు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో నాశిన భాస్కర్‌గౌడ్, కడివేటి చంద్రశేఖర్, రియాజ్‌అహ్మద్, జమాలుల్లా, షఫీమౌలానా, అన్వర్ బాషా, షబ్బీర్, ఎల్‌వీ సుబ్బయ్య, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

## సరస్వతీదేవికి పూజలు

గూడూరు అర్బన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విందూరు ఉన్నత పాఠశాలలో బుధవారం వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సరస్వతీదేవికి పూజలు చేశారు. ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున్‌రావు మాట్లాడుతూ పదో తగరతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, వెంకటేశ్వర్లురాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీల దోపిడీ

### తక్కువ వడ్డీతో రుణాలిస్తామని వల

### ప్రాసెసింగ్ ఫీజు పేరిట 40శాతం లాగేస్తున్న వైనం

### చక్ర వడ్డీతో అప్పుల ఊబిలోకి బాధితులు

వెంకటగిరి టౌన్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): వెంకటగిరిలో ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీల దోపిడీ రోజు రోజుకు మితిమీరిపోతోంది. పుట్టగొడుగుల్లా వెలిసిన ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలు తక్కువ వడ్డీతో రుణాలిస్తామని ఆశల వల విసురుతున్నాయి. తీరా ఇచ్చిన రుణంలో 40శాతం వరకు ప్రాసెసింగ్ ఫీజు కింద లాగేసుకుంటున్నాయి. తరువాత కంతులు సరిగా చెల్లించలేదంటూ చక్ర వడ్డీ వేసి ప్రజలను పీడించి దోచుకుతింటున్నాయి. ఇటీవల పట్టణంలోని బొగ్గులమిట్టకు చెందిన షేక్ పీర్మ లక్ష రూపాయలు అవసరం కావడంతో ఓ ఫైనాన్స్ కంపెనీని ఆశ్రయించింది. ఆ సంస్థ ప్రతినిధులు వచ్చి షేక్ పీర్మ ఇంటి స్థలం కొలతలు వేసి పట్టా డాక్యుమెంట్ తీసుకున్నారు. సదరు ఇంటి విలువ ప్రకారం నాలుగు లక్షల రూపాయల రుణం ఇవ్వగలమని తెలిపారు. ఇది ప్రభుత్వం ఇచ్చిన పట్టా కాబట్టి తామే రిజిస్ట్రేషన్ చేసి ఇస్తామని సంతకాలు పెట్టించుకున్నారు. ఇదంతా పూర్తయ్యాక రిజిస్ట్రేషన్ కోసం రూ.1.5లక్షలు ఖర్చు అయిందని చెప్పి రూ.2.5 లక్షలు మాత్రమే చేతిలో పెట్టారని షేక్ పీర్మ వాపోయింది. అలాగే సాలాపక్షి ధనమ్మ అనే మహిళ ఓ ఫైనాన్స్ కంపెనీ నుంచి రూ.3లక్షలు అప్పు తీసుకుంది. ఒక్క నెల కంతు కట్టడంలో ఆలస్యమయ్యే సరికి ఇంటి వద్దకు వచ్చి అసభ్యంగా మాట్లాడారని, వెంటనే చెల్లించకపోతే ఇంటికి తాళం వేస్తామని బెదిరించారని సదరు మహిళ ఆవేదన వ్యక్తం చేసింది. రుణం తీసుకున్నాక మొదటి కంతు చెల్లించడంలో నాలుగు రోజులు ఆలస్యం అయినందుకు ఇళ్ల వద్ద ఆడవాళ్లు ఉన్న సమయంలో వచ్చి తాళాలు వేస్తామని బెదిరిస్తున్నారని ఓ వ్యక్తి వాపోయాడు. ఈ విషయమై స్త్రీ విముక్తి సంఘటన రాష్ట్ర కమిటీ సభ్యురాలు అజిత మాట్లాడుతూ ఫైనాన్స్ కంపెనీలు తక్కువ వడ్డీతో రుణాలు ఇస్తామని మధ్య తరగతి ప్రజలను మోసం చేయడం దారుణమని, అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

## విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న వాహనం



ఒరిగిన విద్యుత్ స్తంభం

సూళ్లూరుపేట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చెంగాళమ్మ ఆలయ సమీపంలోని శ్రీనగర్ కాలనీ వద్ద జీఎన్‌టీ రోడ్డు పక్కన విద్యుత్ స్తంభాన్ని గుర్తుతెలియని ఢీకొంది. ఈ ప్రమాదంలో స్తంభం ఒరిగిపోవడంతో దాదాపు గంటపాటు సరఫరాలో అంతరాయం కలిగింది. అదేవిధంగా సూళ్లూరు ప్రధాన వీధిలో విద్యుత్ లైన్ తెగి దాదాపు రెండు గంటల పాటు విద్యుత్‌కు అంతరాయం కలిగింది. వెంటనే స్పందించిన విద్యుత్‌శాఖ అధికారులు సరఫరా పునరుద్దరించారు.

## బకాయిల కోసం టిప్పర్ల యజమానుల నిరసన

కోట, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కోట మండలం చంద్రశేఖరపురం వద్ద ఉన్న ఆప్కో కార్యాలయం ఎదుట బుధవారం టిప్పర్ల యజమానులు రవాణా బకాయిలు చెల్లించాలంటూ నిరసన తెలిపారు. మండలంలో సాగరమాల రోడ్డు పనులు చేస్తున్న సంస్థ నుంచి నాయుడుపేట, మనుబోలు, నెల్లూరు, శ్రీకాళహస్తి, చంద్రగిరి ప్రాంతాలకు చెందిన పలువురు టిప్పర్ల యజమానులు సబ్ కాంట్రాక్టు తీసుకుని ఫ్లైయాష్ రవాణా చేశారు. అయితే 9నెలలు బిల్లులు చెల్లింకపోవడంతో రూ.1.30 కోట్లు బకాయిలు ఉన్నాయి. దీంతో ఆప్కో కార్యాలయం వద్ద బైఠాయించి సంస్థ వాహనాలను అడ్డుకున్నారు. ఎస్ఐ పవన్‌కుమార్ సంఘట నాస్థలికి చేరుకొని ఇరువర్గాలతో చర్చించారు. బకాయిలు చెల్లించేందుకు కొంత సమయం కావాలని కాంట్రాక్టర్ కోరడంతో టిప్పర్ల యజమానులు సమ్మతించి వెళ్లిపోయారు.

## రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థి ఎంపిక



హర్షవర్ధన్‌ను అభినందిస్తున్న పాఠశాల హెచ్‌ఎం మధుసూదన్

గూడూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జీఎస్ఆర్ పాఠశాల విద్యార్థి హర్షవర్ధన్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థి ఎంపికైనట్లు హెచ్‌ఎం మధుసూదన్‌రావు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 7వ తేదీన ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని కావాలిలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించి పోటీల్లో హర్షవర్ధన్ ప్రతిభచాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడన్నారు. ఈనెల 14నుంచి 16వ తేదీ వరకు కడప జిల్లాలో జరగనున్న పోటీల్లో హర్షవర్ధన్ పాల్గొంటాడన్నారు. హర్షవర్ధన్‌ను హెచ్‌ఎంతో పాటు వ్యాయామ ఉపాధ్యాయుడు వెంకటసుబ్బయ్య అభినందించారు.

## బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడికి సత్కారం

పెళ్లకూరు, మార్చి 12 (ఆంధ్రజోతి): మండలంలోని తాళ్వాయిపాడు గ్రామంలో బుధవారం బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దల నరేంద్రరెడ్డి జన్మదిన వేడుకలు జరిగాయి. బీజేపీ మండల అధ్యక్షుడు కలిచేటి నరసింహులు, మాజీ అధ్యక్షుడు గోగుతట్టు మురళి, జనసేన అధ్యక్షుడు మల్లాం విజయ్ ఆధ్వర్యంలో నరేంద్రరెడ్డిని గజమాల, దుశ్శాలువాలతో సత్కరించారు. కేక్ కట్‌చేసి పంచి పెట్టారు. పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎద్దల సురేష్‌రెడ్డి, వీరయ్య, వెంకయ్య, గణేష్, భరత్, కొమ్ముతోటి సుబ్రహ్మణ్యం(కైలాస్), కవిత, వరలక్ష్మి, లక్ష్మి, సతీష్ పృధ్వీరాజ్, వెంకటరమణయ్య, వినయ్, బుజ్జమ్మ పాపయ్య తదితరులు పాల్గొన్నారు.



నరేంద్రరెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న బీజేపీ నాయకులు